



అవినీతికి పాల్పడితే శాఖాపరమైన చర్యలు

కె.వి.జి.సత్యనారాయణ, విద్యుత్‌శాఖ ఎస్ఈ

విద్యుత్‌శాఖ సిబ్బంది అవినీతికి పాల్పడితే చర్యలు తీసుకుంటాం. రైతులకు వేగవంతంగా సేవలు అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశాం. పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు కోరుతూ వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా చూడాలని ఏఈ, ఈఈలను ఆదేశించా. రైతులు దరఖాస్తు చేసుకున్న వెంటనే అంచనాలు తయారు చేయాలని అధికారులకు సూచించా. ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలను నివారించేందుకు చర్యలు చేపట్టాం. దీనిపై ఎస్పీకి ఫిర్యాదు చేశాం. విద్యుత్ సిబ్బందితోపాటు రైతులను కలుపుకొని రాత్రుళ్లు గస్తీ ఏర్పాటు చేస్తున్నాం.

ఒంగోలు రూరల్ మండలం ఉలిచిలోని తారకరామ ఎత్తిపోతల కింద వెయ్యి ఎకరాల ఆయకట్టు ఉంది. ఆ పథకం కోసం 240కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దానిని జూలై 3న దొంగలు పగులగొట్టి రాగి తీగను ఎత్తుకెళ్లారు. ఆ ట్రాన్స్‌ఫార్మర్ ఖరీదు రూ.8లక్షలు. ఇంతవరకూ కొత్తది బిగించలేదు. దీంతో సాగుకు రైతులు ఇబ్బంది పడుతున్నారు. అదే మండలంలోని చేజర్ల గ్రామంలోని చేజర్లమ్మ ఎత్తిపోతల పథకం కింద 700 ఎకరాల ఆయకట్టు ఉంది. ఆ పథకానికి 160కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దానిని కూడా జూలై 3నే దొంగలు పగులగొట్టారు. దీంతో పంటల సాగుకు ఇబ్బందికరంగా మారింది.

రాచర్ల మండలం అనుమలవీడు గ్రామానికి చెందిన వాకా కిరణ్ అనే రైతు తన వ్యవసాయ భూమిలో బోరు ఏర్పాటు చేసుకున్నారు. అందుకు అవసరమైన విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. రూ.20వేలు లంచం ఇస్తేనే కనెక్షన్, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని లైన్‌మన్ రామలింగయ్య డిమాండ్ చేశాడు. రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా రామలింగయ్య రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు.



చేజర్ల ఎత్తిపోతల పథకం

ట్రాన్స్‌ఫార్మర్ వెతలు

విద్యుత్ సిబ్బంది ధనదాహం, దొంగల చేతివాటంతో రైతులు విలవిల్లాడుతున్నారు. ఒకవైపు అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది కుమ్మక్కై అందిన కాడికి దోచుకుంటున్నారు. ప్రతి పనికీ రేటు నిర్ణయించి వసూళ్ల పర్వం సాగిస్తున్నారు. విద్యుత్ కనెక్షన్లు మొదలు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, లైన్‌ల మార్పు వంటి వాటికి కాసులు పడితేనే కదులుతున్నారు. అందరూ కలిసి రైతులను జలగల్లా పీక్కుతుంటున్నారు. ఇంకోవైపు జిల్లావ్యాప్తంగా ఎత్తిపోతల పథకాలు, పొలాల్లో వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌ల చోరీలు గత వైసీపీ పాలనలో పెచ్చరిల్లాయి. నాలుగేళ్లలో 385కుపైగా ట్రాన్స్‌ఫార్మర్లు దొంగల పాలయ్యాయి. దీంతో రైతులు పంటల సాగుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బంది, అధికారుల తీరుపై వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దొంగల పాలైన ట్రాన్స్‌ఫార్మర్‌ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడంలో తాత్సారం చేస్తుండటంతో దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

- అటు దొంగలు.. ఇటు కరెంటోళ్ల దోపిడీ
- విద్యుత్ శాఖలో ఇదీ పరిస్థితి
- ఇష్టారీతిన పొలాల్లో చోరీలు
- నాలుగేళ్లలో 385 ట్రాన్స్‌ఫార్మర్లు ఫట్
- వాటిలో ఎత్తిపోతలవే ఎక్కువ
- మిగతావి వ్యవసాయ బోర్లవి
- మరోవైపు సిబ్బంది లంచాల బాదుడు
- విలవిల్లాడిపోతున్న కర్షకులు
- కనెక్షన్ కోసం రైతు నుంచి రూ.20వేలు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ లైన్‌మన్

ఒంగోలు (క్రైం), సెప్టెంబరు 1 : జిల్లాలో విద్యుత్‌శాఖ అధికారుల తీరు కర్షకులను కన్నీరు పెట్టిస్తోంది. వారి అవినీతికి అంతు లేకుండా పోయింది. అదేసమయంలో దొంగలు స్వైరవిహారం చేస్తున్నారు. పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్‌లను రాత్రికి రాత్రి పగులగొట్టి రాగితీగ, ఇతరత్రా సామగ్రిని కొల్లగొడుతున్నారు. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. విద్యుత్ శాఖలో పనిచేసే కొందరు సంస్థకు రావాల్సిన ఆదాయానికి కూడా గండికొట్టి సొంత లాభం కోసం పాకులాడుతున్నారు. గత ప్రభుత్వంలో జరిగిన అవకతవకలు పునరావృతం కాకూడదని ప్రభుత్వ పెద్దలు మొత్తుకుంటున్నా అధికారులు, సిబ్బంది తీరు మాత్రం మారడం లేదు. రైతుల అవసరాన్ని ఆసరా చేసుకొని అందినకాడికి దోచుకుంటున్నారు.

నాలుగేళ్లలో రూ.5కోట్లకుపైన విలువైన ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ

ఉమ్మడి జిల్లాలో రైతుల కోసం పొలాల్లో ఏర్పాటు చేసిన 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 2020 నుంచి ఇప్పటి వరకూ 385 చోరీకి గురయ్యాయి. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ ఖరీదు రూ.లక్షకుపైనే ఉంటుంది. ఆప్రకారం జిల్లాలో దొంగల పాలైన ట్రాన్స్‌ఫార్మర్‌ల విలువ సుమారు రూ.4కోట్లకుపైనే ఉంటుంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకూ 60 ట్రాన్స్‌ఫార్మర్లు ఉమ్మడి జిల్లాలో చోరీకి గురయ్యాయి. ఎత్తిపోతల పథకాలకు సంబంధించి 250కేవీ నుంచి 500కేవీ వరకూ ఉంటాయి. వీటి విలువ రూ.5 నుంచి రూ.10లక్షల వరకూ ఉంటుంది. అవి కూడా పెద్ద సంఖ్యలోనే దొంగల పాలయ్యాయి. ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి అందులో ఉండే లక్షల రూపాయల విలువైన రాగితీగను దొంగలు లాగేసి కేవలం రూ.10వేల నుంచి రూ.20వేలకు విక్రయిస్తున్నట్లు సమాచారం. దీంతో రైతుల వెతలు వర్ణనాతీతమయ్యాయి. సకాలంలో పంటలు సాగు చేయలేకపోతున్నారు. వేసిన పంటలకు నీరందక ఎండిపోతున్నాయి. దీంతో రైతులు పెట్టుబడులతోపాటు రూ.కోట్లలో రాబడిని కోల్పోతున్నారు.

లంచం ఇస్తేనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్


పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైందని పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న రైతులు కొత్తదాని కోసం విద్యుత్ శాఖ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. నిబంధనల ప్రకారం రైతులు ట్రాన్స్‌ఫార్మర్ కోసం దరఖాస్తు చేసుకున్న నెలకు విద్యుత్ అధికారులు ఏర్పాటు చేయాలి. చోరీ జరిగితే అందుకు సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీని అందజేసిన 24 గంటల్లో కొత్తదాన్ని ఉచితంగా బిగించాలి. కానీ అలా జరగడం లేదు. నెలలు గడిచినా అధికారులు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం లేదు. పైగా ఒక్కోదానికి భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఇలా ఉద్యోగులకు లంచాలు, ఏర్పాటు చేసిన తరువాత చోరులతో రైతులు అల్లాడుతున్నారు. దీంతోపాటు కొత్త వ్యవసాయ కనెక్షన్ ఇవ్వాలన్నా, లైన్ మార్చాలన్నా సిబ్బంది చేయి తడపాల్సిందే. వారు అడిగినంత ముట్టచెప్తేనే పనిచేస్తున్నారు. లేకుంటే ముప్పుతిప్పలు పెడుతున్నారు. రైతులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా కనికరించని పరిస్థితి నెలకొంది.



ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగితీగ చోరీ కావడంతో పని చేయని పొందూరు ఎత్తిపోతల పథకం

ఎస్పీ దామోదర్ సీరియస్

ఎస్పీగా దామోదర్ బాధ్యతలు తీసుకున్న కొద్ది రోజులకే జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలపై విద్యుత్ శాఖ ఎస్ఈ ఆయన్ను కలిసి ఫిర్యాదు చేశారు. దీన్ని ఎస్పీ సీరియస్‌గా తీసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాల కేసులను వేగవంతంగా దర్యాప్తు చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో కదిలిన పోలీసులు నెలరోజుల్లోనే 60 కేసుల్లో నిందితులను అరెస్టు చేసి జైలుకు పంపారు.



అలంకారప్రాయంగా చేజర్ల ఎల్ఐసీ ట్రాన్స్‌ఫార్మర్

ట్రాన్స్‌ఫార్మర్‌ల చోరీతో ఇబ్బందులు

తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, శ్రీ ఆంజనేయ ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు, నెన్నూరుపాడు

నెన్నూరుపాడులో ముసి ఆధారంగా మూడు ఎత్తిపోతల పథకాలున్నాయి. శ్రీ ఆంజనేయ ఎత్తిపోతల కింద దాదాపు 260 ఎకరాల ఆయకట్టు ఉంది. దీనికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌ను రెండు నెలల క్రితం దొంగలు పగులగొట్టి రాగి తీగ చోరీ చేశారు. మరో రెండు ఎత్తిపోతల పథకాలకు కలిపి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను కూడా చోరీ చేశారు. ఈ విషయమై రెండు నెలల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశాం. ఇప్పటి వరకూ ట్రాన్స్‌ఫార్మర్‌లు రాలేదు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైంది. ఏం చేయాలో దిక్కుతోచడం లేదు.

ఏసీబీకి చిక్కిన లైన్‌మన్

రాచర్ల మండలం అనుమలవీడులో వ్యవసాయ కనెక్షన్ ఇచ్చేందుకు రూ.20వేలు లంచం తీసుకుంటూ లైన్‌మన్ రామలింగయ్య మూడురోజుల క్రితం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఆ గ్రామానికి చెందిన వాకా కిరణ్ అనే రైతు తన వ్యవసాయ భూమిలో బోరుకు విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకొన్నారు. రూ.20వేలు లంచం ఇస్తేనే విద్యుత్ కనెక్షన్, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని లైన్‌మన్ రామలింగయ్య తేల్చిచెప్పాడు. అసలే వర్షాలు కురవక, పంటలు పండక అప్పోసొప్పో చేసి బోరు వేయించుకున్నానని, అంత డబ్బు ఇవ్వలేనని రైతు బతిమాలినా వినలేదు. దీంతో రైతు కిరణ్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి సూచన మేరకు రైతు లైన్‌మన్‌కు ఫోన్ చేయగా పొలానికి వచ్చి రూ.20వేలు తీసుకున్నాడు. అక్కడ మాటు వేసి ఉన్న ఏసీబీ అధికారులు ఆయన్ను పట్టుకున్నారు. దర్శి మండలం రాజంపల్లిలో టి.లక్ష్మానాయక్ అనే లైన్‌మన్ రైతు పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు లంచం తీసుకుంటూ గతంలో ఏసీబీకి పట్టుబడ్డాడు. ఇలాంటి సంఘటనలు అనేకం ఉన్నాయి.



ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ లైన్‌మన్ రామలింగయ్య(ఫైల్)

అధికారులు సహకరించడం లేదు

పమిడి వెంకటేశ్వరరావు, పొందూరు ఎల్ఐ స్కీం అధ్యక్షుడు



మా పథకానికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగితీగ, ఇతర పరికాలు మూడు నెలల క్రితం చోరీకి గురయ్యాయి. పోలీసులకు ఫిర్యాదు చేశాం. ఐడీసీ అధికారులను కలిసి విషయం తెలిజేశాం. ట్రాన్స్‌కో అధికారులకూ విన్నవించాం. కానీ ఎవ్వరూ సహకరించలేదు. ఇప్పటి వరకూ కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయలేదు. ఇప్పుడు పంటల సాగుకు సమయం మించిపోతోంది. దీంతో రైతులమంతా సొంతంగా డబ్బులు వేసుకొని కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించుకోవాలని నిర్ణయించుకున్నాం.

సాగుపై సందిగ్ధంలో ఉన్నాం

గద్దె వెంకటకృష్ణ, చేజర్ల ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు, ఒంగోలు రూరల్ మండలం



చేజర్ల ఎత్తిపోతల కింద 700 ఎకరాల ఆయకట్టు ఉంది. జూన్ 3వతేదీన పథకానికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీగను దొంగలు చోరీ చేశారు. దీనిపై ఒంగోలు తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశాం. ఇప్పటి వరకూ కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం వరినాట్లు వేసుకునే సీజన్. అయితే నీరు అందే పరిస్థితి లేకపోవడంతో సాగుపై సందిగ్ధంలో ఉన్నాం. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రూ.10లక్షలు విద్యుత్‌శాఖకు చెల్లించాలంటున్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలు స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలి.

దంచికొట్టిన వాన



ఒంగోలు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వర్షం దంచికొట్టింది. చాలాకాలంగా వానలు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజానీకానికి ఊరట కలిగించింది. 48 గంటల వ్యవధిలో ఏకంగా 90.01 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. దాదాపు సగం మండలాల్లో 100 నుంచి 170 మి.మీ కురిసింది. జిల్లా అంతటా ఈ వర్షాలు వ్యవసాయానికి, తాగునీటికి మేలు చేశాయి. పలుచోట్ల వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తుండటంతో రవాణాకు అంతరాయం కలిగింది. గుండ్లకమ్మకు భారీగా వరద నీరు రావడంతో నాలుగు గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ఇంతకు మించి వర్షాలు కురిస్తే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.

- 48 గంటల్లో 90.1మి.మీ వర్షపాతం
- పశ్చిమప్రాంతంలో అధికం
- పొంగిన వాగులు, వంకలు
- పలుచోట్ల రవాణాకు అంతరాయం
- గుండ్లకమ్మ నాలుగు గేట్లు ఎత్తివేత
- ఇతర వనరులకూ భారీగానే చేరిక
- సాగుకు ఉపయుక్తం
- అధికారులతో కలెక్టర్ అన్సారియా టెలికాన్ఫరెన్స్
- తక్షణ చర్యలకు ఆదేశం

పంటలకు జీవం.. ఖరీఫ్ సాగుకు ఊతం

దాదాపు నెలన్నర నుంచి జిల్లాలో సరైన వర్షం లేక ఖరీఫ్ సీజన్ ముందుకు సాగలేదు సుమారు 2.02 లక్షల హెక్టార్ల ఖరీఫ్ సాధారణ విస్తీర్ణంలో కేవలం 31శాతంలో మాత్రమే పంటలు సాగయ్యాయి. అందులోనూ పలుచోట్ల వర్షాలు లేక ఎండుముఖం పట్టాయి. ఆగస్టు నెలలోనూ ఎండల తీవ్రత అధికంగా ఉండటంతోపాటు చాలా చోట్ల తాగునీటికి ఇక్కట్లు తప్ప లేదు. ఈ పరిస్థితుల్లో వాయుగుండం ప్రభావంతో జిల్లాలో గురువారం అర్ధరాత్రి నుంచి వర్షం ప్రారంభమైంది. ఇది ప్రస్తుతం పొలాల్లో ఉన్న పైర్లకు జీవం పోసింది. మున్ముందు పంటల సాగుకు ఉపకరించనుంది.



త్రిపురాంతకం మండలం గణపవరం ఎస్సీకాలనీలో కూలిన రేకుల ఇల్లు



వైచెర్లోపల్లి వద్ద చప్టాపై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు, నిలిచిన రాకపోకలు

పశ్చిమప్రాంతంలోనూ..

జిల్లాలోని తూర్పు ప్రాంతంతో పోల్చితే పశ్చిమ ప్రాంతంలో వర్ష ప్రభావం అధికంగా ఉంది. నల్లమల అటవీ ప్రాంతంలో భారీ వర్షాలు కురవడంతో మార్కాపురం డివిజన్‌లోని అటవీ సమీప మండలాల్లో ఉన్న గుండ్లకమ్మ ఉధృతంగా ప్రవహిస్తోంది. పలు వాగులు, వంకలు పొంగాయి. గుండ్లకమ్మ, జంపలేరులోకి వస్తున్న నీరు క్రమంగా కంభం చెరువులోకి వెళుతోంది. దోర్నాల ప్రాంతంలో నల్లమల నుంచి భారీగా నీరు వస్తూ తీగలేరు పొంగి ప్రవహిస్తుండగా సప్లయ్ చానల్ ద్వారా మార్కాపురం చెరువుకు పెద్ద ఎత్తున చేరుతోంది. పెద్దారవీడు మండలంలోని రామాయపాలెం వద్ద నల్లవాగు వర్షపు నీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది. తీగలేరు ఉధృతితో మార్కాపురం-దోర్నాల మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. అక్కడ పోలీసులు పికెట్ ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను మళ్లించారు. ఇతర పలు గ్రామాల మధ్య ఇలాంటి పరిస్థితే కనిపించింది.

లోతట్టు ప్రాంతాలు జలమయం

వర్షాలతో పలుచోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అక్కడక్కడా ఇళ్లు కూలాయి. మార్కాపురం మండలం తిప్పాయపాలెంలో గృహాల మధ్య నీరు చేరి ప్రజలు అవస్థ పడ్డారు. త్రిపురాంతకం మండలం గణపవరం వద్ద ఎస్సీ కాలనీలో రేకుల షెడ్డు పడిపోయింది. కురిచేడు మండలం గంగదొనకొండలో పాపిరెడ్డి అనే వ్యక్తికి చెందిన పాతమిద్దె కూలిపోయింది. ఆ సమయంలో అందులో ఎవ్వరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్

జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం పగలు కూడా జల్లులు పడ్డాయి. వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ అన్సారియా టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. పారిశుధ్య చర్యలపై తక్షణం దృష్టి పెట్టాలని ఆదేశించారు. తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రవాణా, విద్యుత్ సరఫరాకు ఆటంకాలు లేకుండా చూడాలన్నారు.అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి వర్షాల వల్ల నష్టాలు జరగకుండా సిబ్బందిని అప్రమత్తం చేశారు.

గుండ్లకమ్మ ప్రాజెక్టుకు భారీగా వరద నీరు

మద్దిపాడు : అల్పపీడనం ప్రభావంతో ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు గుండ్లకమ్మ ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు గరిష్ట నీటి మట్టం 24.38 మీటర్లు కాగా ప్రస్తుతం 20.90 మీటర్ల మేర నీరు చేరింది. ఇన్‌ఫ్లో 18వేల క్యూసెక్కులు ఉండగా అధికారులు నాలుగు గేట్లను ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు వదులుతున్నారు.

పంటలకు స్వల్ప నష్టం

అధికారులు ప్రాథమిక అంచనా

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 1 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు పంటలకు స్వల్పంగా నష్టం వాటిల్లింది. ఈ మేరకు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ఆ ప్రకారం ఆరు మండలాల పరిధిలోని 17 గ్రామాల్లోని 668మంది రైతులకు చెందిన 1,334 హెక్టార్లలో పంటలకు కొంత నష్టం జరిగింది. కొర్ర 504 హెక్టార్లు, సజ్జ 337 హెక్టార్లు, నువ్వు 493 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు.

నేడు 'మీ కోసం' రద్దు

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 1 : భారీ వర్షాల నేపథ్యంలో ఒంగోలులోని ప్రకాశం భవన్‌లో ప్రతివారం నిర్వహించే మీకోసంను సోమవారం రద్దు చేసినట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు పాఠశాలలకు సెలవు

జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సోమవారం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలకు కలెక్టర్ తమీమ్ అన్సారియా సెలవు ప్రకటించారు.

రైతులకు మెరుగైన సేవలందించాలి

మంత్రి స్వామి

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 1 : వ్యవసాయ, అనుబంధ శాఖల ద్వారా రైతులకు మెరుగైన సేవలందించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సూచించారు. వ్యవసాయ శాఖ నూతనంగా అమలు చేయనున్న పొలం పిలుస్తోంది కార్యక్రమ పోస్టర్‌ను ఆదివారం మంత్రి తన స్వగ్రామైన తూర్పునాయుడుపాలెంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులు షెడ్యూల్ ప్రకారం గ్రామాలకు వెళ్లి క్షేత్రస్థాయిలో ఉండే పంట పొలాలను రైతుల సమక్షంలో పరిశీలించి గ్రామ సభ నిర్వహించాలన్నారు. చీడపీడల నివారణ చర్యలపై శాస్త్రవేత్తల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. తొలుత వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు కార్యక్రమం గురించి మంత్రికి వివరించారు. వ్యవసాయ శాఖ సింగరాయకొండ సహాయ సంచాలకులు రమేష్, నిర్మల కుమారి, ఒంగోలు వ్యవసాయాధికారి శ్రీనివాసనాయక్, కొండపి నియోజకవర్గ వ్యవసాయాధికారులు విజయ్, స్వర్ణలత, యుగంధర్‌రెడ్డి, పూర్ణచంద్రరావు, మాల్యాద్రి పాల్గొన్నారు.



పొలం పిలుస్తోంది కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి డాక్టర్ స్వామి

ప్రాణాలు తీసిన ఈత సరదా

- నీటికుంటలోకి దిగి ముగ్గురు చిన్నారుల మృతి
- పెద్దారవీడు మండలం కొత్తపల్లిలో విషాదం
- ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో బయటకు..
- పొలంలోని నీటి కుంటలోకి దిగి
- ఈత రాకపోవడంతో మునక

మెయిన్‌లో...



మృతిచెందిన ఏడుకొండలు, శివ, మను(ఫైల్)

తాగునీరు కలుషితం కాకుండా
చర్యలు తీసుకోవాలి : కలెక్టర్

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 1 : తుఫాన్ నేపథ్యంలో జిల్లాలో కురిసిన భారీ వర్షాల కారణంగా పట్టణాలు, గ్రామాల్లో పారిశుధ్య ఏర్పాట్లతో పాటు మంచినీరు ఎక్కడా కలుషితం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి ఆదివారం రెవెన్యూ, పంచాయతీరాజ్, పురపాలక, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, వ్యవసాయశాఖ అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. పట్టణాలు, గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను పటిష్ఠంగా అమలు చేయాలని, పట్టణాల్లో ఎక్కడా వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలని మునిసిపల్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో అవసరమైన మేరకు వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు ఫీవర్‌సర్వేలను నిర్వహించాలని సూచించారు. విద్యుత్‌కు అంతరాయం లేకుండా ఆ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎక్కడైనా వాగులు పొంగి రోడ్లపై ప్రవహిస్తుంటే అక్కడ బందోబస్తును ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ గోపాలకృష్ణతో పాటు పలువురు అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

- ఎమ్మెల్యే దామచర్ల



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల, రియాజ్

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 1: జనసేన పార్టీ అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలు నగరం గద్దలగుంటలో జనసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెడికల్‌క్యాంపును ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్‌తో కలిసి ఎమ్మెల్యే దామచర్ల ప్రారంభించారు. ముందుగా స్థానిక మూడు బొమ్మల సెంటర్‌లో నగర కార్యదర్శి రాయల్‌మనోజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జనసేన జెండాను ఆవిష్కరించారు. అనంతరం మెడికల్ క్యాంపు, రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే దామచర్ల ప్రారంభించి పవన్‌కళ్యాణ్‌కు జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రియాజ్ మాట్లాడుతూ జిల్లాలోని జనసేన పార్టీని బలోపేతం చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు చిట్టెం ప్రసాద్, మలగా రమేష్, చనపతి రాంబాబు, ముత్యాల కళ్యాణ్, బొందిల శ్రీదేవి, పిల్లి రాజేష్, పల్ల ప్రమీల, దండే అనిల్, బండారుమదన్, పాలబుజ్జి, పోతంశెట్టి దుర్గ, దండే బాచి తదితరులు పాల్గొన్నారు.

అపుస్మా జిల్లా అధ్యక్షుడిగా మాధవరావు



నూతన కార్యవర్గం

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 1: ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (అపుస్మా) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఒంగోలులోని ఐఎంఏహాలులో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈ కమిటీ ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షులుగా కొల్లా మాధవరావు (ఒంగోలు), కార్యదర్శిగా జిమల్లికార్జునరెడ్డి(మార్కాపురం), గౌరవాధ్యక్షులుగా బొడ్డు హనుమంతరావు(సంతనూతలపాడు), కోశాధికారిగా ఎం.వెంకటేశ్వర రెడ్డి (కనిగిరి), ఉపాధ్యక్షులుగా జి.రంగస్వామిరెడ్డి(గిద్దలూరు), జాయింట్ సెక్రటరీగా పి.నాగేశ్వరరావు(ఒంగోలు), సభ్యులుగా జి.లక్ష్మణ్(కొండపి), ఎం.మల్లికార్జునరావు(పెద్దారవీడు), లక్ష్మీనారాయణ(దర్శి)లను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా సుబ్బారెడ్డి, సమన్వయకర్తగా ఏవీ.సుబ్బారావు వ్యవహరించారు

'పొలం పిలుస్తోంది' పోస్టర్ విడుదల



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, సెప్టెంబరు 1: పొలం పిలుస్తోంది పోస్టర్‌ను ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ ఆదివారం ఒంగోలులోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం నుంచి వ్యవసాయశాఖ ద్వారా ప్రారంభం కానున్న పొలం పిలుస్తోంది కార్యక్రమాలు అన్ని గ్రామాల్లో జరుగుతాయని తెలిపారు. ప్రతీ మంగళవారం, బుధవారం వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు పంటపొలాలను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు ఇస్తారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

నాగులుప్పలపాడు: ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌ను నాగులుప్పలపాడుకు చెందిన టీడీపీ నాయకులు ఆదివారం కలిశారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు ఉన్నం వెంకటరావు ఆధ్వర్యంలో ఒంగోలులోని ఎమ్మెల్యే తన కార్యాలయంలో కలిసి బొకే అందించారు. కార్యక్రమంలో కట్టా నవీన్, కల్లూరి రవి, ఉన్నం సబ్బారావు, ప్రశాంత్, యాదగిరి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సెపక్‌తక్రా సంఘ జిల్లా అధ్యక్షుడుగా సురేష్‌కుమార్



ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 1 : జిల్లా సెపక్ తక్రా సంఘం జిల్లా అధ్యక్షులుగా యనమల సురేష్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఒంగోలులోని అంబేడ్కర్ భవనం వద్ద ఉన్న ఇందిరాకాలనీలో జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సెపక్ తక్రా అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని, తనను ఎన్నుకున్న సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

సేవా కార్యక్రమాలే వాసవి క్లబ్ లక్ష్యం



రక్తదానం చేస్తున్న యువకులు

ఒంగోలు(కల్చరల్), సెప్టెంబరు 1: సేవా కార్యక్రమాలే వాసవి క్లబ్ లక్ష్యమని ఆ క్లబ్ బ్లడ్ డొనేషన్ కార్యక్రమాల ఇన్‌చార్జి జి.బ్రహ్మానందం తెలిపారు. వాసవి క్లబ్ ఫౌండర్ కేసీ గుప్తా జయంతి సందర్భంగా వాసవి క్లబ్ ఒంగోలు, వాసవి క్లబ్ కేసీజీఎఫ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించే వారోత్సవాలు ఆదివారం స్థానిక గాంధీరోడ్డు ఆర్యవైశ్య సంపత్కుమార రామానుజ కళ్యాణ మండపంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిబిరంలో 100మంది యువకులు రక్తదానం చేశారు. అనంతరం బ్రహ్మానందం మాట్లాడుతూ వారోత్సవాలలో భాగంగా 3వ తేదీ వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాలలో సేవలు, 4న మహిళలు, యువతులకు సాధికారిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో క్లబ్ ఒంగోలు అధ్యక్షులు నల్లమల్లి బదరి నారాయణ, సెక్రటరీ పద్మనాభుని నందకుమార్, కోశాధికారి గుర్రం సునీల్‌కుమార్, సభ్యులు, యూత్ అధ్యక్షులు కునాల శ్రీనివాసరావు, కార్యదర్శి కూనిశెట్టి పవన్‌కుమార్, కోశాధికారి దొరడ్ల శ్రీనివాసరావు, వనిత ప్రెసిడెంట్ వి.విజయలక్ష్మి, అడ్మినిస్ట్రేషన్ ఛైర్మన్ దర్శి మనోహర్, చంద్రశేఖర్, ఉమా అన్నపూర్ణ, పూర్వ అధ్యక్షులు రాధారమణగుప్తా జంధ్యం, పలువురు వైశ్య నాయకులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణ

- ఎమ్మెల్యే దామచర్ల
- ఘనంగా అంతర్రాష్ట్ర కరాటే పోటీలు
- హాజరైన గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, వేదికపై ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి తదితరులు

ఒంగోలు(కార్పొరేషన్), సెప్టెంబరు 1: ఆత్మరక్షణకు మార్షల్‌ఆర్ట్స్ ఎంతో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఆదివారం సిద్ధార్థ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఒంగోలులోని మహాలక్ష్మి కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర కరాటే పోటీలను ఎమ్మెల్యే దామచర్ల, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుమల అశోక్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు, క్రీడలపట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. ప్రస్తుత రోజుల్లో ప్రతి ఒక్కరికి ఆత్మరక్షణ ఎంతో అవసరమని, అందుకోసం కరాటే ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే ముత్తుమల మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల నుంచి సుమారు 600మంది క్రీడాకారులు పాల్గొనడం అభినందనీయమన్నారు. సిద్ధార్థ అకాడమీకి తనవంతు సహకారం ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా పలు విభాగాల్లో క్రీడాకారులు పోటీపడగా, విజేతలకు మెడల్స్, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ, ఎస్‌కేడీఎఫ్ ప్రెసిడెంట్ డాక్టర్ కేఎంఎల్.శాస్త్రి, నిర్వాహకులు ఎన్.మోహన్‌రావు, ప్రతిభ కళాశాల ఛైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, డాక్టర్ గుండవరపు రాఘవ, జి.రవికుమార్, మారెళ్ళ సుబ్బారావు, మండవ సుబ్బారావు, కుర్రా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఏరువాక కేంద్రాన్ని ఒంగోలులో ఏర్పాటు చేయాలి

- మంత్రికి ఆచార్య రంగా కిసాన్ సంస్థ ప్రతినిధుల విజ్ఞప్తి



మంత్రి స్వామికి వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 1: జిల్లాకేంద్రమైన ఒంగోలులో వ్యవసాయ సాంకేతిక సలహా కేంద్రం(డాట్), ఏరువాక కేంద్రాన్ని పునఃస్థాపించేలా చర్యలు తీసుకోవాలని ఆచార్య రంగా కిసాన్ సంస్థ ప్రతినిధులు కోరారు. ఆదివారం తూర్పునాయుడుపాలెంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖమంత్రి స్వామిని కలిసిన వారు ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ఒంగోలులో 1998-99లో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. జిల్లాలోని తూర్పుప్రాంతంలోని 30మండలాల రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, క్షేత్ర సందర్శనలు నిర్వహించి విశిష్టమైన సేవలను అందించిందని తెలిపారు. అయితే 2023లో వైసీపీ ప్రభుత్వం ఈ కేంద్రాన్ని పల్నాడు జిల్లాకు తరలించిందన్నారు. తిరిగి ఈ కేంద్రాన్ని ఒంగోలులోనే ఏర్పాటు చేయాలని కోరారు. సంస్థ అధ్యక్షుడు ఆళ్ళ వెంకటేశ్వరరావు, చుంచు శేషయ్య, మండవ శ్రీనివాసరావు, నన్నూరి నాగేశ్వరరావు, బి.కోటేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే ఒంగోలులో సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్‌ను కలిసి డాట్ సెంటర్‌ను ఒంగోలులో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంను రద్దు చేయాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్టీయూ ప్రతినిధులు

ఏపీటీఎఫ్ డిమాండ్
పలు ప్రాంతాల్లో నిరసనలు

ఒంగోలు (విద్య), సెప్టెంబరు 1 : కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీటీఎఫ్ నాయకులు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఆందోళనకు దిగారు. పాత తాలూకా కేంద్రాలైన ఒంగోలు, దర్శి, కనిగిరి, గిద్దలూరులలో నిరసనలు చేపట్టారు. ఒంగోలులోని ప్రకాశంభవనం వద్ద ఒంగోలు, కొండపి జోన్ల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఒంగోలు జోన్ అధ్యక్షుడు బి.శేషారావు అధ్యక్షత వహించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్.మంజుల మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించడం మినహా మిగిలినవేవీ తమకు ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన యూపీఎస్ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పూర్వ రాష్ట్ర కార్యదర్శి ఐ.విజయ సారథి మాట్లాడుతూ పెన్షన్ అనేది భిక్షాటన కాదని, ఉద్యోగుల హక్కు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమాన్ని విస్మరించి ప్రమాదకరమైన విధానాలను అవలంబిస్తున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర మాజీ కార్యదర్శి బి.రఘుబాబు, నాయకులు కె.తిరుమల, పి.హనుమంతరావు, ఎం.మోహన్‌రెడ్డి, కె.రవి, వీరరాఘవులు, రామారావు, డి.మధు, ఎ.హరిబాబు, యాకోబు, ఈశ్వరయ్య, మౌలాలి, ఎం.వి.కృష్ణారావు, పి.సుబ్బారావు, పి.శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి : ఎస్టీయూ

ఒంగోలు(విద్య): సీపీఎస్ ప్రారంభమైన సెప్టెంబరు 1వతేదీని ఎస్టీయూ బ్లాక్‌డేగా ప్రకటించి ఆదివారం స్థానిక ప్రకాశంభవనం ఎదుట ఆశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కె.ఎర్రయ్య, రాష్ట్ర అదనపు ప్రధానకార్యదర్శి బివెంగళరెడ్డి మాట్లాడుతూ సీపీఎస్ వల్ల గత 20 ఏళ్ళుగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎంతో నష్టపోయారని ఆందోళన వ్యక్తంచేశారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చల్లా శ్రీనివాసులు, జిల్లా ప్రధానకార్యదర్శి జి.నరసింహారెడ్డి, ఆర్థిక కార్యదర్శి బి.నాగయ్య, నాయకులు మౌలాలి, సిద్దిక్, వెంకటేశ్వర్లు, నారాయణ, మాల్యాద్రి, రవికిరణ్, కుమార్, కేవీ.నారాయణ, సురేష్, హనుమంతాచారి, సింగారెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో డ్రైనేజీ వ్యవస్థ మెరుగుకు చర్యలు

- కమిషనర్ వెంకటేశ్వరరావు



మామిడిపాలెంలోని డ్రైనేజీని పునరుద్ధరిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు(కార్పొరేషన్), సెప్టెంబరు 1: బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ నేపథ్యంలో ఒంగోలు కార్పొరేషన్ ఆధ్వర్యంలో మురుగునీటి పారుదల వ్యవస్థ మెరుగుకు చర్యలు వేగవంతం చేసినట్లు నగర కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం నగరంలో మురుగునీటి పారుదల వ్యవస్థపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు నేపథ్యంలో నీరు రోడ్లపై నిలవకుండా, అలాగే మురుగు పారుదలలో తలెత్తిన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఈ మేరకు మామిడిపాలెంలోని రెడ్డి హాస్టల్ సమీపంలో గత కొన్నేళ్ళుగా పూడుకుపోయి ఉన్న డ్రైనేజీ పనులు చేపట్టినట్లు చెప్పారు. అంతేగాకుండా పోతురాజు కాలువ, 60 అడుగుల రోడ్, నగరంలోని అన్ని ప్రధాన డ్రైన్లలో పూడికతీత పనులు చేపడుతున్నట్లు వివరించారు. కాలనీల్లో నీరు నిలిచి ప్రజలకు ఇబ్బందుల లేకుండా చర్యలు వేగవంతం చేశామన్నారు. ఇకపై ప్రతి రోజు డివిజన్ల వారీగా స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి పారిశుధ్యం, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామని వివరించారు. ముందస్తు చర్యల్లో భాగంగా25 మందితో క్విక్ రెస్పాన్స్ టీమ్‌ను నియమించినట్లు కమిషనర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈలు గణపతి, పద్మజ, పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మరాఠా సంక్షేమ సంఘ ప్రమాణస్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

ఒంగోలు(కల్చరల్), సెప్టెంబరు 1: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మరాఠ సంక్షేమ సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం ఒంగోలు నగరం రంగుతోటలోని క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్‌లో ఘనంగా జరిగింది. ఒంగోలు మరాఠా సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులుగా అంబురపు వెంకటేశ్వరరావు, దుంమ్మే వీరు, కాళే వెంకటేశ్వర్లు, అధ్యక్షులుగా అంబోరు వెంకటనాగేంద్రబాబు, సెక్రటరీగా సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా జాజుల గంగారామ్ ప్రమాణ స్వీకారం చేశారు. కాగా సోమాసి శివప్రసాద్, సోమాసి శంకర్, కాళే క్రిష్ణమోహన్, దెండే ప్రభాకరరావు, కాళే వెంకటసుబ్బయ్య, కాళే సుబ్బారెడ్డి తదితరులు సభ్యులుగా ప్రమాణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరాఠ కుటుంబీకుల సంక్షేమం కోసం అన్ని విధాల కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి మరాఠా కుటుంబీకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 12వ డివిజన్ కార్పొరేటర్ అంబోరు శ్రీనివాసరావును కమిటీ తరపున ఘనంగా సన్మానించారు.

ఆత్రేయకు గౌరవ డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న పరుత్‌కుమార్‌ఆత్రేయ

ఒంగోలు(కల్చరల్), సెప్టెంబరు 1: జిల్లాకు చెందిన సాహిత్యవేత్త, ఉపాధ్యాయుడు పరాంకుశం మరుత్‌కుమార్‌ఆత్రేయకు సామాజిక సేవలో గౌరవ డాక్టరేట్ లభించింది. ఆయన ప్రస్తుతం చిలకపాడు గ్రామంలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తు న్నారు. దాదాపు మూడున్నర దశాబ్దాలుపైగా ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ అనేక సేవా కార్యక్రమాలలో పాల్గొన్న ఆత్రేయను తమిళనాడు హోసూరులో జరిగిన కార్యక్రమంలో ఏషియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ ప్రతినిధులు గౌరవ డాక్టరేట్‌తో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్రేయ సామాజిక సేవాతో పాటు విద్యార్థులకు యోగాలో శిక్షణ ఇవ్వడం, సాహిత్య సమావేశాలు నిర్వహించటం, తిరుమల తిరుపతి దేవస్థానంలో వ్యాఖ్యాతగా వ్యవహరించటం మొదలైనవి చేసినందుకు గుర్తింపుగా డాక్టరేట్ ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు.

1,325 మందికి వైద్యసేవలు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 1: ఒంగోలు నగరం నెల్లూరు బస్టాండు సమీపంలోని టీటీడీ కళ్యాణమండపంలో దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జీబీఆర్ ఫౌండేషన్ సహకారంతో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి రెగ్యులర్‌గా జరుగుతున్న ఈ శిబిరంలో వైద్యులు గోపాలం శ్రీమన్నారాయణ, బి.హరిబాబు, జాన్‌రిచర్డ్స్, సందీప్, జి.చైతన్య, శరత్, రవితే, దీరజ్‌బాబు, జైదుర్గప్రసాద్, కొల్లా భారతి, చాపల వంశీకృష్ణ 1,325 మందిని పరీక్షించి మందులు అందజేశారు. వైద్యశిబిరం నిర్వహణ కోసం డాక్టర్ బి.జవహర్ రూ.10వేలు, డాక్టర్ డాకా సుబ్బారెడ్డి రూ.10వేలు ఆర్థికసాయం అందించారని కమిటీ ప్రతినిధి మాదాల వెంకట్రావు తెలిపారు.

ప్రభాకర్‌రావుకు అవార్డు ప్రదానం

ఒంగోలు(కార్పొరేషన్), సెప్టెంబరు 1 : జీపీఐ జనరల్ మేనేజరుగా పని చేస్తున్న మెండ ప్రభాకర్‌రావుకు కేకే మోడీ లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డును ప్రదానం చేశారు. గత నెల 27వ తేదీన కేకే మోడీ 84వ జయంతిని పురస్కరించుకుని ఢిల్లీలో ఈ అవార్డును అందజేశారు. గత 33 సంవత్సరాలుగా జీపీఐ లీఫ్‌లో వివిధ వి భాగాలలో ప్రభాకర్‌రావు అందించిన సేవలకు గుర్తింపుగా గౌరవించారు. కార్యక్రమంలో సంస్థ ఛైర్మన్, బీన మోడీ, అగ్రికల్చరల్ సీఈవో షాద్, లీఫ్ హెడ్ జితేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

జిల్లాలో 58.5 మి.మీ వర్షపాతం

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 1: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఆదివారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 58.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. జిల్లాలో అత్యధికంగా ముండ్లమూరు మండలంలో 138.0 మి.మీ. వర్షం కురువగా అత్యల్పంగా సీఎస్‌పురంలో 25.8 మి.మీ నమోదైంది. త్రిపురాంతకంలో 106.2, నాగు లుప్పలపాడు 96.4, పుల్లలచెరువు 96.2, తాళ్ళూరు 94.8, కురిచేడు 94.0, మద్ది పాడు 86.2, దొనకొండ 77.4, మార్కాపురం 76.4, చీమకుర్తి 75.8, పొదిలి 71.2, తర్లుబాడు 69.8, దోర్నాల 64.8, వైపాలెం 64.0, కొనకనమిట్ల 62.0, కంభం 59.6, మర్రిపూడి 57.0, బేస్తవారపేట 55.5, ఒంగోలు 52.8, కొత్తపట్నం 49.2, రాచర్ల 46.8, దర్శి 48.8, కొండపి 47.4, కనిగిరి 44.2, హనుమంతునిపాడు 41.0, అర్ధవీడు 41.2, వెలిగండ్ల 35.2, పామూరు 34.2, టంగుటూరు 33.8, కొమరోలు 29.4, జరుగుమల్లి 29.4, పొన్నలూరు 28.0, పుల్లలచెరువు 28.0 మి.మీ వరం వర్షం పడింది.

కారు బోల్తా-ఒకరికి గాయాలు

మద్దిపాడు, సెప్టెంబరు 1: బసవన్నపాలెం రోడ్డు దగ్గర శనివారం అర్ధరాత్రి కారు బోల్తా పడి ఒకరికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో ప్రసాద్ అనే వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు ఈ ఘటనపై విచారణ చేపట్టారు.

విద్యాశాఖ కార్యాలయంలోకి వర్షపునీరు



ఎంపీడీవో కార్యాలయంలో నిలిచిన నీరు

మద్దిపాడు, సెప్టెంబరు 1: మద్దిపాడులోని మండల విద్యా వనరుల కేంద్రం కార్యాలయంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీరు చేరింది. ఈ భవనం శిథిలావస్థకు చేరడం, వర్షపు నీరు రావడంతో సిబ్బంది అవస్థలు పడ్డారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో నీరు పోవడంతో అటెండర్లు ఆ నీటిని బయటికి పంపేందుకు తీవ్రంగా కృషి చేయాల్సి వచ్చింది. మండల పరిషత్ కార్యాలయం 1930లో నిర్మించారు. గత ప్రభుత్వంలో నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలకే పరిమితం అయ్యింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలోనైనా కార్యాలయాలకు నూతన భవనాలు నిర్మిస్తారనే ఆశాభావాన్ని ఉద్యోగులు వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం

సంతనూతలపాడు, సెప్టెంబరు 1: ఆర్టీసీ బస్సుకు తృటిలో ప్రమాదం తప్పిన సంఘటన ఆదివారం సంతనూతలపాడు జరిగింది. ఒంగోలు నుంచి ఎర్రగుడిపాడుకు మైనంపాడు మీదుగా వెళ్లే బస్సు నల్లవాగు బిడ్జి వద్ద వర్షాలకు రోడ్డు బాగోలేకపోవడంతో మార్జిన్‌లోకి వెళ్లి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

బ్యాటరీ, డీజిల్ చోరీపై ఫిర్యాదు

సంతనూతలపాడు, సెప్టెంబరు 1: చంద్రపాలెం అంబేడ్కర్‌నగర్ వద్ద ఉంచిన ట్రాక్టర్‌లోని డీజిల్, బ్యాటరీని ఆదివారం వేకువజామున దొంగలు చోరీ గుర్రైంది. దీంతో బాధితులు అయినంపూడి వెంకట్రావు సంతనూతలపాడు పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

మద్దిపాడు, సెప్టెంబరు 1: విద్యుదాఘాతంతో ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన ఆదివారం గుండ్లాపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన వీరగంధం అంజమ్మ(60) నీటి మోటార్ వైర్లు ప్లైగ్‌లో పెడుతుండగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ అంజమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. పార్టీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, తుమ్మల సుధాకర్, పోకూరి శ్రీనివాసరావు, పారా నరసింహారావు, తేళ్ల సుబ్బారావు, తుమ్మల హరిబాబు, అంకమ్మ రావు, మండవ గోపీచంద్, దేవబత్తిన ప్రసాదరావు, అడ్డాల రవి తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

ఉప విద్యాధికారికి సన్మానం

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 1 : ఒంగోలు ఉప విద్యాధికారిగా ఉద్యోగ విరమణ చేసిన జె.అనితారోజ్‌రాణిని ఆదివారం స్థానిక అంబేడ్కర్‌భవన్‌లో సన్మానించారు. డైట్ అధ్యాపకుడు సోమా సుబ్బారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీఈవో సుభద్ర ముఖ్యఅతిథిగా హాజరై అనితారోజ్‌రాణి సేవలను అభినందించారు. కార్యక్రమంలో నెల్లూరు డీఈవో రామారావు, హెచ్‌ఎంలు కాంతారావు, వెంకట్రావు, జీఎస్ఆర్.సాయి, డీసీఈబీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో చోరీ



పరిశీలిస్తున్న సీఐ శ్రీకాంత్‌బాబు

నాగులుప్పలపాడు సెప్టెంబరు 1: మండలంలోని బినిడమానూరులో గల సాయిబాబా దేవాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు.. స్థానిక సాయిబాబా దేవాలయం వద్దకు శనివారం రాత్రి కారులో వచ్చిన దుండగులు గడ్డపారతో ఆలయం వెనక వైపు న్నున్న తలుపు గడియను విరగ్గొట్టి లోపలికి ప్రవేశించారు. 16కేజీల బాబావారి వెండి సింహాసనం, దత్తాత్రేయ, వినాయక వెండి ప్రతిమలను దొంగిలించారు. ఆలయంలోని సీసీకెమెరాల వైర్లను కత్తిరించి డీవీఆర్‌ను సైతం ఎత్తుకెళ్ళారు. హుండీని గడ్డపలుగుతో పగులగొట్టేందుకు విఫల యత్నం చేసి దానిని అక్కడే వదిలివెళ్ళారు. ఉదయాన్నే దేవాలయానికి వచ్చిన పూజారి చోరీ జరిగినట్లు గుర్తించి ఆలయ కమిటీ అధ్యక్షుడు మారెడ్డి గంగిరెడ్డికి తెలిపారు. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూరల్ సీఐ బీఎస్.శ్రీకాంత్‌బాబు, ఎస్ఐ శ్రీకాంత్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. క్లూస్ టీం వేలిముద్రలను సేకరించింది. గంగిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వర్ష నష్టాన్ని అంచనా వేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ మధుసూదనరావు

కొత్తపట్నం(ఒంగోలునగరం) సెప్టెంబరు 1: భారీ వర్షాల కారణంగా గ్రామాల్లో జరిగిన నష్టాలను అంచనా వేయాలని తహసీల్దార్ మధుసూదనరావు కోరారు. ఆదివారం కొత్తపట్నం మండలపరిషత్ సమావేశపుహాలులో సచివాలయం సిబ్బందితో ఆయన మాట్లాడారు. భారీ వర్షాల నేపథ్యంలో సచివాలయం సిబ్బంది అప్రమత్తంగా ఉండి వర్షాలకు జరిగిన నష్టం వివరాలను సేకరించాలన్నారు. గ్రామాల్లో నీరు నిలిచి ఉన్నా, పాత గృహాలు కూలిపోయే ప్రమాదం ఉన్నా ప్రజలను అప్రమత్తం చేయాలని చెప్పారు. పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఎంపీడీవో సుజాత, ఈవోఆర్డీ బాలచెన్నయ్య పాల్గొన్నారు.

ఎస్పీ నివాళి

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 1: పోలీసు శాఖలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్న కామేపల్లి హరికృష్ణ (52) ఆదివారం ఆకస్మికంగా మృతి చెందారు. దీంతో ఒంగోలు నగరం గాంధీనగర్ 4వ లైన్‌లోని గృహంలో ఉన్న హరికృష్ణ భౌతికాయాన్ని ఎస్పీ దామోదర్ సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. అత్యవసర ఖర్చుల కోసం ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమలో ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, తాలుకా సీఐ అజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పేర్నమిట్టలో రూ.3లక్షల సొత్తు చోరీ

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 1: పేర్నమిట్టలో తాళం వేసి ఉన్న ఇంటిలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. సుమారు రూ.3లక్షల విలువైన సొత్తును అపహరించుకు వెళ్ళారు. ఈ ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. వివరాలలోకి వెళితే.. పేర్నమిట్టకు చెందిన రావూరి పుష్పవతి తన భర్త వెంకటేశ్వరరెడ్డి చికిత్స నిమిత్తం గత నెల 26న చెన్నయ్ వెళ్లారు. వారు తిరిగి ఆదివారం మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి వెనుక తలుపు పగుల కొట్టి ఉంది. ఇంట్లో ఉన్న బీరువాను దొంగలు పెకలించి సుమారు 5 సవర్ల బంగారపు ఆభరణాలు అపహరించుకు వెళ్ళారు. వీటి విలువ రూ.3లక్షలు ఉంటుందని బాధితులు వాపోయారు. తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేశారు.

185 మందికి వైద్యపరీక్షలు

నాగులుప్పలపాడు సెప్టెంబరు 1: స్టార్ ఫౌండేషన్ సహకారంతో ఉప్పుగుండూరు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు 185 మందికి వైద్యసేవలు అందించినట్లు నిర్వాహకులు కేఎల్.నాగేశ్వరావు తెలిపారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఎస్.లతారెడ్డి, గోనుగుంట వీరబ్రహ్మం, స్వాతి, కుమారశర్మ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐ పక్కన టంగుటూరు ఎస్సై

వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసు శాఖ అనుమతి తప్పనిసరి

టంగుటూరు, సెప్టెంబరు 1 : వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీస్ శాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సింగరాయకొండ సీఐ హజరత్తయ్య చెప్పారు. ఆదివారం టంగుటూరు పోలీస్ స్టేషన్‌ను సీఐ సందర్శించారు. అనంతరం సిబ్బందితో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన విగ్రహాల ఉత్సవ కమిటీలకు పలు విషయాలు పోలీసుల ద్వారా తెలిపారు. ఐదుగురు, అంతకన్నా ఎక్కువున్నా సరే కమిటీగా ఏర్పడి విగ్రహం ఏర్పాటుకు పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివాదాస్పద స్థలంలో విగ్రహాలు పెట్టవద్దని చెప్పారు. దరఖాస్తులలో విధిగా వినాయక విగ్రహాల నిమజ్జనం తేదీ, ప్రదేశం సూచించాలన్నారు. రాత్రి వేళలో సైతం ఇద్దరికి తగ్గకుండా మండపం వద్ద కాపలా ఉండాలని చెప్పారు. నిమజ్జనం పోలీస్ వారి కనుసన్నల్లో జరగాలన్నారు. గ్రామంలో ఒక గంటకు మించి ఊరేగింపు చేయకూడదని చెప్పారు. ఎస్సై వీ నాగమల్లీశ్వరరావు పాల్గొన్నారు.

తెలుగు తమ్ముళ్ల సంబరాలు

పొన్నలూరు, సెప్టెంబరు 1 : టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు తొలిసారి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసి 29 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలుగు తమ్ముళ్లు పొన్నలూరులో సంబరాలు నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు నేతృత్వంలో ఆదివారం ఉదయం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబు అహర్నిశలు పాటుపడుతున్నారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను ప్రగతిపథంలో నడిపిన ఘనత చంద్రబాబుదేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మండవ ప్రసాద్, కర్హా కోటిరెడ్డి, మురళి, మండవ మల్లికార్జున, పల్లపోతు రమేష్, కుంకు సురేష్, నేలపాటి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

సుదర్శన్‌బాబుకు అంతర్జాతీయ పురస్కారం

టంగుటూరు, సెప్టెంబరు 1 : టంగుటూరులోని న్యూ లైఫ్ హోలి మినిస్ట్రీస్ అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ సుదర్శన్‌బాబు అందించిన సామాజిక, క్రైస్తవ అధ్యాత్మిక సేవలను గుర్తిస్తూ సర్టిఫికెట్ ఆఫ్ కమిట్‌మెంట్ అవార్డు ప్రదానం చేశారు. లండన్‌లోని అంతర్జాతీయ సంస్థ వరల్డ్ బ్యాంకు ఆఫ్ రికార్డ్సు సౌత్ రీజియన్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ ఉల్లాజి ఎలియాజర్ పాల్గొని సుదర్శన్‌బాబుకు అవార్డు బహూకరించారు. ఈ సందర్భంగా పాస్టర్ సుదర్శన్‌బాబు మాట్లాడుతూ తనకు ఎల్లవేళలా సహకారం అందిస్తున్న కుటుంబసభ్యులకు, సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

రాతి మండపానికి రూ.లక్ష విరాళం

అద్దంకి, సెప్టెంబరు 1 : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం రాతి ముఖ మండపం నిర్మాణానికి అద్దంకి మండలంలోని కొంగపాడుకు చెందిన ప్రియ స్టుడియో అధినేత కప్పు నాగేశ్వరరావు, వెంకట సుజాత దంపతులు లక్ష నూట పదహారు రూపాయలను ఆదివారం అందజేసినట్లు ఈవో సుభద్ర తెలిపారు.

నేడు అరటి పండ్ల పూజ

శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో అమవాస్య సందర్భంగా సోమవారం ఉదయం 7-39 గంటలకు అరటి పళ్లతో పూజ జరుగుతుందని ఈవో, అసిస్టెంట్ కమీషనర్ సుభద్ర తెలిపారు.

ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూసుకోవాలి

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు1 : చేపలు, రొయ్యల విక్రేతలు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ తమ వ్యాపారాలు చేసుకోవాలని ఎస్సై వెంకటేశ్వర్లు సూచించారు. ఆదివారం ఆయన సిబ్బందితో కలసి కాలుక సెంటర్లో చేపల విక్రేతలకు పలు సూచనలు చేశారు. వాస్తవానికి చేపల మార్కెట్ నిర్ణీత స్థలంలో ఉన్నా, వారికి అనువుగా ఉంటుందని కాలువ సెంటర్లో విక్రయాలు చేస్తుంటారు. ఈ క్రమంలో మీ జీవనోపాధికి ఇబ్బంది లేకుండా నడుచుకోవాలని ఎస్సై వారికి స్పష్టం చేశారు.

ఆపదలో ఉన్న వ్యక్తికి రక్తదానం

అద్దంకిటౌన్, సెప్టెంబరు 1 : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో ఆదివారం సర్జరీ చేయించుకుంటున్న వ్యక్తికి రక్తదానం చేశారు. అద్దంకికి చెందిన పీడీ ముద్దన విష్ణు ప్రసాద్‌కు విజయవాడ మణిపాల్ ఆసుపత్రిలో సర్జరీ ని మిత్తం ఏబీ పాజిటివ్ రక్తం అవసరం అని వైద్యులు తెలిపారు. ఈ క్రమంలో రోగి బంధువులు రోటరీ క్లబ్ సెక్రటరీ చుండూరి మురళీ సుధాకరరావును సంప్రదించగా అద్దంకికి చెందిన శివారెడ్డి, చెన్నుపల్లి వాసు, ప్రసన్న ముగ్గురు విజయవాడ వెళ్లి రక్తదానం చేశారు.

గుండ్లకమ్మ నదికి వరద

వరిసాగుకు సిద్ధమవుతున్న రైతులు

అద్దంకికి తీరిన తాగునీటి కష్టాలు


అద్దంకి సమీపంలో గుండ్లకమ్మ నది వరద ఉధృతి

అద్దంకి, సెప్టెంబరు 1 : గుండ్లకమ్మ నదికి వరద నీటి ప్రవాహం బాగా పెరిగింది. గత రెండు రోజులుగా గుండ్లకమ్మ నది ఎగువ పరీవాహక ప్రాంతాలలో వర్షాలు, సాగర్ కాలువలకు పూర్తి స్థాయిలో నీటి విడుదల నేపథ్యంలో గుండ్లకమ్మ నదిలో నీటి ప్రవాహం ఆదివారం బాగా పెరిగింది. గత ఏడాది నుంచి గుండ్లకమ్మ నదికి ఇంతమేర వరద నీరు రాలేదు. సాగర్ నీరు కూడా విడుదల జరగడంతో ఇక గుండ్లకమ్మ నదిలో నీటి ప్రవాహం కొనసాగనుంది.

గుండ్లకమ్మ ఆధారంగా ఉన్న ఎత్తిపోతల పథకాల ఆయకట్టు రైతు లు వరిసాగుకు సిద్ధమవుతున్నారు. పట్టణానికి కూడా తాగునీటి కష్టాలు తీరినట్లయింది. అద్దంకిలో ఆదివారం ఉదాయినికి 111.4 మి.మీ వర్షపాతం నమోదైంది. సాయంత్రం వరకు కూడా వర్షపు జల్లులు పడ్డాయి. శుక్రవారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు జల్లులు పడుతున్నాయి. ఆదివారం సాయం త్రం కొద్దిమేర ఎండ వచ్చినప్పటికీ ఆకాశం మేఘావృతమై ఉంది. వర్షపు జల్లులు పడుతుండడం ఆదివారం సెలవు కావడంతో అద్దంకి పట్టణంలోని వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. రెండు రోజుల పాటు ఎడతెరపి లేకుండా వర్షాలతో పొలాలలో నీరు నిలిచింది. వాగులకు నీరు చేరింది. బోరుబావుల కింద వరినాట్లు ముమ్మరం అయ్యాయి. నీటి వినియోగం లేకపోవటం తో సాగర్ కాలువల నిండా నీరు ప్రవహిస్తుంది.

నిండుతున్న వాగులు, చెరువులు

బల్లికురవ : నిన్న మొన్నటి వరకు చు క్క నీరులేని చెరువులు, వాగులు భారీ వర్షాలతో నిండుతున్నాయి. మూడు రోజుల నుంచి మండలంలోని అన్ని గ్రామాల లో కురిసిన భారీ వర్షంతో బెట్ట కొచ్చిన మెట్ట పంటలు జీవం పోసుకున్నాయి. చుక్క నీరు లేని చెరువులు వాగులకు నీరు పెద్ద ఎత్తున నీరు చేరుతోంది. మండలంలోని గుంటుపల్లి, ముక్తేశ్వరం గ్రామాల మధ్య ఉన్న పరమడ వాగు నీటి ఉధృతి కొనసాగుతోంది. ఈ నీరు బల్లికురవ వీర్లచెరువుకు చేరుతుండడంతో చెరువు కళ కళలాడుతుంది. అంబడిపూడి సాగు నీటి చెరువు పూర్తి స్థాయిలో నిండుకుంది. చెన్నుపల్లి, చెరువు పూర్తి స్థాయిలో నిండింది. అలానే గంగపాలెం వేమవరం గ్రామాల మధ్య ఉన్న అక్కమ్మ కుంటలో మట్టిని తవ్వడంతో వర్షపు నీటితో పంటపొలాలు నీట మునిగాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బల్లికురవ మండలంలో రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకున్న వర్షాలు ఇప్పటి వరకు పంటలకు ఎంతో ఉపయోగం అని రైతులు అంటున్నారు.

శోకసంద్రంలో కొత్తపల్లి

కన్నీరు మున్నీరైన తల్లిదండ్రులు, బంధువులు

అండగా ఉండి ఆదుకుంటా: ఎరిక్షన్‌బాబు


కుమారుడు మను మృతదేహం వద్ద సొమ్మసిల్లిన తండ్రి భానుచారి


నివాళులర్పిస్తున్న టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, నేతలు

పెద్దారవీడు, సెప్టెంబరు 1 : ముగ్గురు చిన్నారుల మృతితో మండలంలోని కొత్తపల్లి శోకసంద్రంలో మునిగిపోయింది. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి కులవృత్తి అయిన వడ్రింగి పని చేసుకుంటున్న కొత్తపల్లి విశ్వరూపాచారి, భానుచారిల కుమారులు మను, శివ, అదేవిధంగా ఆరవీటి శ్రీను కుమారుడు ఏడుకొండలు మృతితో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరై విలపిస్తున్నారు. రోజూ చలాకీగా బడికి పోతూ, వస్తూ అందరి మధ్యలో తిరిగే చిన్నారుల మృతితో కొత్తపల్లి గ్రామంలో కన్నీరు పెట్టని వారు లేరు. ఇటువంటి విషాద ఘటన మును పెన్నడూ తమ ఊరిలో జరగలేదంటూ నాటి తరం వారి నుంచి నేటితరం వారు పేర్కొంటున్నారు. ఈ సంఘటన గురించి తెలుసుకున్న టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు, ఇన్‌చార్జ్ సబ్‌కలెక్టర్ వెంకటసునీల్, డివిజనల్ పంచాయతీ అధికారి భాగ్యవతి, డిప్యూటీ తహసీల్దార్ రాజేష్, ఎంపీడీవో రాజ్‌కుమార్‌లు చిన్నారులు మృతి చెందిన ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ముగ్గురు చిన్నారుల మృతదేహాల వద్ద నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు అండా ఉంటానన్నారు. విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి ఆయా కుటుంబాలను ఆదుకుంటానని తెలిపారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు మెట్టు శ్రీనివాసుల రెడ్డి, మాజీ అధ్యక్షుడు గొట్టం శ్రీనివాసులరెడ్డి, తదితరులు ఉన్నారు.

విద్యార్థుల మృతి బాధాకరం : మంత్రి స్వామి

ఒంగోలు(కార్పొరేషన్) : జిల్లాలోని పెదారవీడు మండలం ఎస్.కొత్తపల్లిలో ముగ్గురు విద్యార్థులు నీటికుంటలో పడి మృతి చెందడం బాధాకరమని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉన్న చిన్నారులు చనిపోవడం, వారి తల్లిదండ్రుల బాధను ఎవరూ తీర్చలేనిదన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తల్లిదండ్రులు పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వర్షాలు తగ్గే వరకు పిల్లలను బయటకు పంపొద్దని సూచించారు.


గురిజేపల్లిలో ప్రవహిస్తున్న ఓగేరు వాగు

ఓగేరు వాగు ఉధృతం

● రాకపోకలు నిలిపివేత

సంతమాగులూరు, సెప్టెంబరు 1 : మండలంలోని గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండలంలోని గురిజేపల్లి - చవిటిపాలెం గ్రామాల మధ్యగల ఓగేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వంతెనపై రాకపోకలను అధికారులు నిలిపివేశారు. దీంతో పలు గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.


బాధితులకు ఆహార పొట్లాలను అందిస్తున్న డాక్టర్ మహేంద్రనాథ్

వర్ష బాధితులకు టీడీపీ ఆహారం పంపిణీ

చీరాల, సెప్టెంబరు1 : నియోజకవర్గంలోని శివారు ప్రాంతాల్లో వర్షాలతో ఇబ్బందిపడుతూ ఆహారం లేని వారికి టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్ ఆదివారం ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆయా ప్రాంతాల్లో కరకట్టలపై జీవనం సాగిస్తున్న వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి వర్షంలోనే వారికి ఆహార పొట్లాలను పంపిపెట్టారు. ఎవరు కూడా ఆహారం కోసం ఇబ్బంది పడకుండా తమవంతు ప్రయత్నం చేస్తామన్నారు. ప్రకృతి ప్రకోపాన్ని ఎవరూ ఆపలేరని, అయితే బాధితుల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా తమ వంతు సాయం అందిస్తామని బాధితులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

పంగులూరు, సెప్టెంబరు 1 : మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో సాగులో ఉన్న పంటలను వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి ఆదివారం రైతులతో కలిసి పరిశీలించారు. రేణంగివరం, కొండమూరు గ్రామాలలో మినుము, పత్తి పైర్లను పరిశీలించిన ఏవో రైతులకు పలు సూచనలు చేశారు. వర్షం పడుతున్నందున పంటలో అక్కడక్కడా నీరు నిలిచి ఉందని, ఆ నీటిని బయటకు మళ్లించాలన్నారు. లీటర్ నీటికి రెండు గ్రాములు యూరియా లేదా పొటాషియం నైట్రేట్ నాలుగు గ్రాములు కలిపి వారం వ్యవధిలో మినుపై రెండు సార్లు పిచికారీ చేయాలని సూచించారు. మూడురోజుల వ్యవధిలో 14 సెంటీమీటర్ల వర్షం నమోదయిందని, నిరంతరం కురుస్తున్న వర్షంతో భూమికి సరిపడా నీరు చేరిందని, సాగులో ఉన్న పంటలకు ఇప్పటి వరకు ఇబ్బంది లేదని ఏవో తెలిపారు.


కాల్వ గండిని పూడ్చిన నేతలు

మైనర్ కాలువకు గండి

● పూడ్చిన టీడీపీ నాయకులు

ఇంకొల్లు, సెప్టెంబరు 1 : ఇంకొల్లు మండలంలోని పోలిమేర ఆంజనేయస్వామి గుడి సమీపంలో పావులూరు ఎస్ఎస్సీ మైనర్ క్వాలకు గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గండి పడింది. సాగర్ కాల్వకు పావులూరు రోడ్డుకు మధ్య ఉన్న పంట పొలాలు నీట మునిగాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సూచనల మేరకు స్పందించిన పావులూరు గ్రామ టీడీపీ నేతలు గుంజి వెంకట్రావు, నారిశెట్టి రాంబాబు, తన్నీరు రామాంజనేయులు, అన్నెం వెంకట్రావు, పావులూరి రవి, అశోక్, శ్రీను, కొత్తపల్లి మహేష్, మోషే, వలేరు డేవిడ్, టీడీపీ కార్యకర్తలు, అభిమానులు ఆదివారం కాలువ గండి పూడ్చారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బల్లికురవ, సెప్టెంబరు 1 : గ్రామాలలో గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ జీవీ చౌదరి సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పలు గ్రామాలలో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని ప్రజలు అత్యవసరమైతేనే ప్రయాణాలను చేయాలన్నారు. ఎదైనా సమాచారం ఉంటే వెంటనే పోలీసు స్టేషన్‌కు తెలియజేయాలన్నారు. అలానే గ్రామాలలో కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే వెంటనే వారి వివరాలు సేకరించి అనుమానం కలిగితే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాలలో తమ సిబ్బంది నైట్ బీట్ తిరుగుతున్నారని, చోరీలు జరగకుండా చర్యలు చేపడుతున్నామని ఎస్ఐ తెలిపారు.

పొలాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలి

చెరుకూరు(పర్చూరు) 1 : పొలాల్లో వరద నీరు నిల్వ లేకుండా వెంటనే బయటకు పంపించాలని వ్యవసాయ సబ్‌డివిజన్ సహాయ సంచాలకులు ఎన్.మోహనరావు సూచించారు. ఆదివారం అధిక వర్షాల కారణంగా నీటమునిగిన పంట పొలాలను వ్యవసాయ సిబ్బందితో కలసి పరిశీలించారు. మండలంలోని చెరుకూరు, కొత్తపాలెం గ్రామాల్లోని వరి, పత్తి పొలాలను ఆయన పరిశీలించి రైతులకు తగు సలహాలు సూచనలు ఇచ్చారు. పొలంలో నీటిని తీసివేసి ఎకరానికి 30 కేజీల యూరియా, 15 కేజీల ఎంవోపీ ఎరువులను బూస్టర్ డోస్‌గా పంటలకు అందించాలన్నారు. ప్రస్తుతం కురిసిన వర్షాల నేపథ్యంలో వరి పైరులో కలుపు వచ్చే ప్రమాదం ఉందని నివారణకు ఎకరానికి 100ఎంఎల్ బిస్ పైరిబాక్ సోడియం 10శాతం చొప్పున పిచికారీ చేయాలన్నారు. పత్తిలో బయటకు నీటిని పంపిన తరువాత మల్టీ కే (13-0-45) లేదా 19-19-19 లీటరు నీటికి 10 గ్రాములు చొప్పున పిచికారీ చేస్తే మంచి ఫలితం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


జాతీయ రహదారి పక్కన నీట మునిగిన పొలాలు

నీట మునిగిన పొలాలు

చీరాల, సెప్టెంబరు1 : వర్షం ప్రభావంతో పలుచోట్ల పొలాలు నీట మునిగాయి. ఇప్పటికి సాగులో ఉన్న పైర్లకు వర్షం జీవం పోసింది. ఇసుక నేల కావటంతో పొలాల్లో నీటిని వెలుపలకు పంపితే పెద్దగా నష్టం ఉండదని రైతులు అంటున్నారు. లోతట్టు ప్రాంతంలో సాగు చేసిన మినుము, పెసర పైర్లు కొన్ని చోట్ల కొంతమేర పాడయ్యే ప్రమాదం ఉంది. చేలల్లో నిలిచిన నీరు వెలుపలకు పంపేందుకు మార్గం లేక ఆగిన చోట పంట దెబ్బతింటుంది. మొత్తం మీద వర్ష ప్రభావంపై రైతుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

కూలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



మార్టూరు, సెప్టెంబరు 1 : మండలంలోని వలపర్ల గ్రామంలో శనివారం రాత్రి కురిసిన వర్షాలకు జడ్పీ హైస్కూల్‌కు వెళ్లే రహదారిలోని విద్యుత్ ట్రాన్స్‌ఫారమ్ పడిపోయింది. రోడ్డుపక్కన గ తంలో నేలపై సిమెంట్ దిమ్మెతో ఏర్పా టు చేసిన ట్రాన్స్‌ఫారమ్ వర్షం కారణంగా ఒరలు కింద ఉన్న మట్టి కరిగిపోవడంతో ట్రాన్స్‌ఫారమ్ పక్కనున్న గుంతలోకి పడిపోయింది. వినియోగదారులకు అంతరాయం కలగకుండా వి ద్యుత్ లైన్‌మన్ ప్రత్యామ్నాయ ఏర్పా ట్లు చేశారు. విద్యుత్ అధికారులు స్పం దించి వెంటనే ట్రాన్స్‌ఫారమ్‌ను పునరుద్ధరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

టిఫిన్ దుకాణంలో అగ్నిప్రమాదం

● తండ్రీకుమారుడికి గాయాలు ● రూ.2లక్షల ఆస్తి నష్టం

మార్టూరు, సెప్టెంబరు 1 : మండల పరిధిలోని రాజుపాలెం గ్రా మంలో శనివారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. దామవరపు శ్రీను అనే వ్యక్తికి చెందిన తాటి ఆకుతో ఉన్న దుకాణం పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో దుకాణంలోని వస్తువులతోపాటు కొంతనగదు పూర్తిగా కాలిపోయింది. సుమారు రూ.2లక్షల నష్టం వాటిల్లినట్లు తెలిసింది. కాలిపోతున్న వాటిని బయటకు తీసే ప్రయత్నంలో యజమాని శ్రీను, అతని కుమారుడు నాగరాజులకు గాయాలయ్యాయి. ఎస్సీ కాలనీలో రోడ్డు పక్కన టిఫిన్ దుకాణాన్ని శ్రీను నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి 10 గంటల సమయంలో భారీ వర్షం కారణంగా కరెంట్ పోయింది. దుకాణంలో వెలుతురు కోసం శ్రీను కొవ్వొత్తిని వెలిగించారు. కొంత సేపటికి దుకాణం బయట ఉన్న శ్రీను దుకాణంలో భారీగా మంటలు రావడం గమనించారు. కొవ్వొత్తి కారణంగా ఒక్క సారిగా మంటలు వ్యాపించాయి. వాటిని అదుపుచేయడానికి కాలనీవాసులు ప్రయత్నిస్తుండగా, దుకాణంలోపల ఉన్న నగదును, వస్తువులను బయటకు తీసుకురావడానికి ప్రయత్నించిన తం డ్రీకుమారుడు గాయపడ్డారు. చిలకలూరిపేట అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను పూర్తిగా ఆర్పివేశారు.

దాడిపై కేసు నమోదు

చీరాల, సెప్టెంబరు 1 : మున్సిపల్ పరిధిలోని జయంతిపేటలో ఓ వ్యక్తి, మరో కుటుంబంపై దాడి చేసిన నేపథ్యంలో టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జయంతిపేటకు చెందిన ఆదర్ష్, ఆనందబాబులు సమీప ఇళ్లలో ఉంటుంటారు. ఆదర్ష్ తరచూ మద్యం సేవించి అక్కడ న్యూసెన్స్ చేస్తుంటాడు. ఆనందబాబు పలుమార్లు ఆదర్ష్ చర్యలు ఖండిస్తూ వారించాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఆనంద్‌బాబు డ్యూటీకి వెళ్లగా అతని ఇంటికి ఆదర్ష్ వెళ్లి ఆనందబాబు భార్య అలేఖ్యను దుర్భాషలాడతాడు. చంపుతానని బెదిరించాడు. అలేఖ్య జరిగిన విషయాన్ని తన భర్త ఆనంద్‌బాబుకు ఫోన్‌లో తెలపగా అతను ఇంటికి వచ్చాడు. ఆదివారం ఉద యం తెల్లవారుజామున 5 గంటల సమయంలో ఆదర్ష్ మరలా ఆనంద్‌బాబు ఇంటికి గొడ్డలితో వెళ్లి ఘర్షణకు దిగుతాడు. ఈ నేపథ్యంలో అలేఖ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దార్యప్తు చేస్తున్నారు.







దోర్నాలలో మిరపనాట్లు వేస్తున్న కూలీలు, మార్కాపురంలో జీవం పోసుకున్న పత్తి చేలు, పెద్దారవీడులో రామాయపాలెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న తీగలేరు

- పొంగిపొర్లుతున్న గుండ్లకమ్మ వాగులు
- చెరువులకు చేరుతున్న జలాలు
- వ్యవసాయ పనులకు ఊతం

వర్షాలతో పైర్లకు జీవకళ

మార్కాపురం రూరల్, సెప్టెంబరు 1: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో రైతుల సాగుచేస్తున్న వివిధ రకాల పైర్లు కళకళలాడుతున్నాయి. ఇప్పటివరకు వర్షాలు లేక వాడిపోయే దశలో ఉన్న పంటలు సైతం ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు జీవం పోసుకున్నాయి. బోర్లకు వచ్చే అరకొర నీటితో సాగు చేసిన పైర్లకు వర్షపు నీరు తగలడంతో మరింత బలం చేకూరింది. వర్షంతో మొక్కలో పెంపు ఆశాజనకంగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. మండలంలోని తిప్పాయపాలెం, పెద్దనాగులవరం, చింతగుంట్ల, నికరంపల్లి చెరువులతో పాటు మరికొన్ని గ్రామాల చెరువులకు కొంతమేర వర్షపు నీరు చేరింది. దీంతో ఆయా గ్రామాల రైతులు బోర్లకు నీరు సక్రమంగా అందుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ప్రధానంగా పత్తి, కంది, పొగాకు, మిర్చితో పాటు ఉద్యానవన పంటలతో పాటు ఇతర పంటలను రైతులు సాగు చేస్తున్నారు. మండలంలో ప్రధానంగా పత్తి 2063, కంది 433, పొగాకు 470, మిరప 860 ఎకరాలలో సాగు చేస్తున్నారు.

కంభం : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా నల్లమల అడవుల్లో కురుస్తున్న భారీ వర్షాలతో చారిత్రాత్మక కంభం చెరువుకు నీరు అందించే గుండ్లకమ్మ, జంపలేరు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో కంభంలో నిన్నటి వరకు ఉన్న 3 అడుగుల నీటికి తోడు ఆదివారం సాయంత్రానికి రెండువాగుల ద్వారా చెరువుకు వస్తున్న వరదనీటి కారణంగా 8 అడుగులమేర నీరు చేరింది. గత నెలలో రాష్ట్రం, దేశంలో భారీ వర్షాలు కురిసి డ్యాంలు, నదులు ఉప్పొంగి ప్రవహిస్తే ప్రకాశం జిల్లాలో సరైన వర్షాలు లేకపోవడంతో అతిపెద్ద చెరువు కంభం చెరువుకు చుక్క నీరు చేరలేదు. చెరువు అడుగంటి కేవలం 3 అడుగులు మాత్రమే నీరు చేరింది. ఇరిగేషన్ అధికారులు తాగునీటి అవసరా కోసం స్టోర్ చేశారు. రైతులు సాగు చేసిన పొగాకు, మిరప, పసుపు, తదితర పంటలు బెట్టకు వచ్చాయి. ఈ పరిస్థితుల్లో అల్పపీడనంతో శుక్రవారం నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు ఎడతెరపి లేకుండా వర్షాలు కురిశాయి. దీంతో నల్లమల అడవుల నుంచి కంభం చెరువు, తురిమెళ్ల తప్పిటవానిచెరువు, రాచర్లలోని రామన్నకతువకు నీరు అందించే గుండ్లకమ్మ, జంపలేరు వాగులు ఉధృతంగా ప్రవహించాయి. ఆయా చెరువులకు నీరు చేరింది. కంభం చెరువుకు వరద నీరు చేరుతుండడంతో రైతులు, పర్యాటకులు కంభం చెరువు కట్టకు భారీగా చేరుకున్నారు. ఆదివారం సెలవుదినం కావడంతో ప్రజలు వివిధ వాహనాల్లో తరలివచ్చి కంభం చెరువు అందాలను తిలకించారు.

పెద్దారవీడు : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా వర్షాలు జోరుగా కురుస్తున్నాయి. మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి మండలంలోని సానికవరం పంచాయతీ పరిధిలోని రామాయపాలెం వద్ద తీగలేరు ఉధృతంగా ప్రవహిస్తుంది. తీగలేరు వాగు వెంబడి రామాయపాలెం వద్ద తహసీల్దార్ శైలేంద్రకుమార్, ఎస్సై అనిల్‌కుమార్‌లు సిబ్బందిని నియమించి ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట చర్యలు చేపట్టారు. దోర్నాల మండలం చిన్నదోర్నాల వద్ద తీగలేరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో దోర్నాల, శ్రీశైలం వెళ్లే వాహనాలును మండలంలోని గొబ్బూరు, తోకపల్లి, హనుమాన్ జంక్షన్ (కుంట) మీదుగా దోర్నాలకు మళ్లించారు. ఎండుముఖం పట్టిన పంటలకు ఈ వర్షాలు జీవం పోశాయని రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కంభం : మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గుండ్లకమ్మవాగు కంభం మండలం యర్రబాలెం బ్రిడ్జిపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో కంభం, గిద్దలూరు మండలాల నుంచి యర్రబాలెం మీదుగా అర్ధవీడు మండలంలోని వివిధ గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయాయి. యర్రబాలెం గ్రామస్థులు కంభం రావాలంటే లింగాపురం, అర్ధవీడు మండలంలోని బోగోలు, మొహిద్దీన్‌పురం, నాగులవరం గ్రామాల మీదుగా చుట్టూ తిరిగి రావలసిన పరిస్థితి ఏర్పడింది. అర్ధవీడు మండలంలోని ప్రజలు కూడా నాగులవరం, కంభం మీదుగా గిద్దలూరు వెళ్ళాల్సి వస్తోంది. గుండ్లకమ్మకు వరదలు వచ్చినపుడు యర్రబాలెం వంతెనపై నుంచి వరద రావడంతో తాము ఎటూ వెళ్లలేని పరిస్థితి వస్తోందని నూతన వంతెన ఎత్తుగా నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

కంభం చెరువుకు చేరుతున్న వర్షపునీరు

కంభం : వర్షాలు కురవక ముందు కేవలం 3 అడుగులమేర మాత్రమే ఉన్న కంభం చెరువు ప్రస్తుతం ఒట్టిపోయే స్థితికి వెళ్లింది. ఈ క్రమంలోనే చిన్నకంభం తూమును అధికారులు మరమ్మతు చేయించారు. ప్రస్తుతం వర్షాలు కురవడంతో గుండ్లకమ్మ, జంపలేరు వాగుల ద్వారా వరదనీరు ఆదివారం మధ్యాహ్నానికి చెరువుకు అదనంగా 5 అడుగులమేర నీరు చేరింది. దీంతో తూము వద్ద సగం వరకు నీరు కనిపిస్తోంది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వర్షాలకు కూలిన రేకులషెడ్డు గోడలు

త్రిపురాంతకం : వర్షాల దాటికి మండలంలోని గణపవరం ఎస్సీ కాలనీలో రేకులషెడ్డు గోడలు కూలాయి. గ్రామానికి చెందిన మాచర్ల చిన్న త్రిపురయ్యకు చెందిన రేకులషెడ్డు గోడలు వర్షానికి నానిపోవడంతో పడిపోయాయి. సమాచారం అందుకున్న రెవెన్యూ సిబ్బంది త్రిపురయ్య ఇంటికి వెళ్లి, కూలిన ఇంటి గోడలను పరిశీలించి, వివరాలు నమోదు చేసుకున్నారు.

నల్లమలలో భారీ వర్షాలు

పెద్ద దోర్నాల : వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ఆదివారం మండలంలోని నీటి వనరులు నిండు కుండలా మారాయి. ఎన్నాళ్లకెన్నాళ్లకు వాగులు, వంకలు, చెరువులు నిండి గళగళమంటూ నీటి ప్రవాహంతో కళకళలాడాయంటూ రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా నల్లమల అటవీ ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులన్నీ జలకళను సంతరించుకున్నాయి. శనివారం అర్ధరాత్రి నుంచి వరద ఉధృతి ఎక్కువ కావడంతో అటవీ ప్రాంతంలోని దొంగలవాగు, నల్లవాగు, రాళ్లవాగులు నీటి ప్రవాహంతో తొణికసలాడాయి. ఎగువచెర్లోపల్లి, గంటవానిపల్లె, కడపరాజుపల్లె, పెద్ద బొమ్మలాపురం గండి చెరువు, బలిజేపల్లి చెరువులలతో పాటు చట్టుతాండ కుంట, తదితరములు నిండి అలుగుల ద్వారా నీరు ప్రవహించడంతో తీగలేరు కాలువ సాయంత్రం వరకు ఉధృతి తగ్గలేదు. ఆ కాలువపై తక్కువ ఎత్తులో నిర్మించిన చప్టాలు శిధిలావస్థకు చేరడంతో ఎగువ చెర్లోపల్లి, గంటవానిపల్లె, కడపరాజుపల్లె, మర్రిపాలెం గ్రామాలకు మధ్యాహ్నం వరకు రాకపోకలు నిలిచిపోయాయి. అర్ధరాత్రి కర్నూలు నుంచి వచ్చే కారు దొంగలవాగులో చిక్కుకోగా పోలీసులు ట్రాక్టరు సహాయంతో బయటకు తీశారు. ఎటువంటి అపాయం వాటిల్లలేదు. ముఖ్యంగా మర్కాపురం-దోర్నాల రహదారిలో చిన్నదోర్నాల వద్ద ఉన్న చప్టాలపై తీగలేరు వరద ప్రవహించడంతో వాహనాల రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. ఆర్టీసీ బస్సులు మార్కాపురం, దోర్నాలకు ట్రాఫిక్‌ను కుంట మీదుగా మళ్లించారు. ఈ క్రమంలో ఎర్రగొండపాలెం టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు సాయంత్రం వరద ఉధృతిని పరిశీలించారు. మండలంలో భారీ వర్షాలు కురవక పోయినా, నాన్పుడి వాన కురిసింది. తీగలేరు వరదతో కొత్తూరు, ఐనముక్కల, తిమ్మాపురం, యడవల్లి గ్రామాలలోని కొన్ని పంటపొలాలపై ప్రవహించడంతో మిరప, బీర, పత్తి పంటలు పూర్తిగా నీటిలో మునగడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు పలువురు రైతులు సంతోషం వెలిబుచ్చుతూ మిరపనాట్లు వేస్తూ పనుల్లో నిమగ్నమయ్యారు.

ముమ్మరంగా మిరపనాట్లు

పెద్దదోర్నాల :మండలంలోని రైతాంగం ఆదివారం ముమ్మరంగా మిరపనాట్లు వేస్తున్నారు. వాయుగుండం ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొలాలన్నీ పదునెక్కాయి. పైగా పది రోజుల క్రితం నల్లమలలో కురిసిన భారీ వర్షానికి చెరువులకు కొంతమేర నీరు చేరింది. మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు చిన్నగుడిపాడు చెరువు మినహాయించి నీటి వనరులు పూర్తిగా నిండాయి. దీంతో మిరపసాగుకు రైతులు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే సిద్ధం చేసిన భూముల్లో నాట్లు వేస్తున్నారు. మండలంలో సుమారు 2500 హెక్టారుల్లో మిరప సాగు చేసే అవకాశం ఉన్నట్లు రైతులు తెలిపారు. సాగు చేసిన కంది, పత్తిపైరు జీవం పోసుకుని కళకళలాడుతున్నాయి.

విధుల్లో చేరిన నూతన సబ్ కలెక్టర్



విధుల్లో చేరిన వెంకట్ త్రివినాగ్

మార్కాపురం, సెప్టెంబరు1: మార్కాపురం నూతన సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్ సోమవారం రాత్రి విధుల్లో చేరారు. విజయనగరం జిల్లాలో ట్రైనీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న త్రివినాగ్‌ను మార్కాపురం సబ్ కలెక్టర్‌గా నియమిస్తూ ఈ నెల 25న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో కుండపోత వర్షాలతో విపత్కర పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ త్రివినాగ్ మాట్లాడుతూ వర్షాల ప్రభావంతో డివిజన్ పరిధిలో ఎక్కడా ఆస్థి, ప్రాణనష్టం జరగకుండా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా ఆయన మార్కాపురంలోని చెన్నకేశవస్వామిని దర్శనం చేసుకున్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

బేస్తవారపేట, సెప్టెంబరు 1 : బేస్తవారపేట మండలంలోని జేసీ అగ్రహారం గ్రామంలో అక్రమంగా మద్యం ఉంచారన్న సమాచారంతో ఎస్సై రవీంద్రారెడ్డి ఆదివారం ఉదయం దాడిచేశారు. అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొన్నారు. వారి వద్ద నుంచి 210 క్వార్టర్స్ సీసాలు, 12 బీరు సీసాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

జూదరుల అరెస్టు

బేస్తవారపేట, సెప్టెంబరు1 : బేస్తవారపేటలోని ఓగృహంలో పేకాట ఆడుతున్న పోలీసులకు సమాచారం రావడంతో ఏస్సై రవీంద్రారెడ్డి తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. గృహంలో 9 మంది పేకాట ఆడుతునట్లు గుర్తించి వారి నుంచి రూ.4310 స్వాధీనం చేసుకొన్నారు. జూదరులను అదుపులోకి తీసుకున్నారు.

కొండచిలువ కలకలం



కొండచిలువను పట్టుకున్న సిబ్బంది

గిద్దలూరు, సెప్టెంబరు 1 : రాచర్ల మండలం రామాపురం గ్రామంలో కొండచిలువ కలకలం సృష్టించింది. గ్రామంలో ఆపివున్న ఒక ట్రాక్టర్ లోపలికి కొండచిలువ వెళ్లింది. చూసిన గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. 12 అడుగుల పొడవు ఉన్న కొండచిలువను పట్టుకుని అడవిలో వదిలిపెట్టడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

హుండీ చోరీ

గిద్దలూరు, సెప్టెంబరు 1 : రాచర్ల మండలం సోమిదేవిపల్లి గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో ఉన్న హుండీని దొంగలు తీసుకెళ్లారు. హుండీని సమీప పొలాల్లోకి తీసుకెళ్లి పగులగొట్టి అందులో ఉన్న డబ్బును దోచుకున్నారు. హుండీలో సుమారు రూ.20వేల వరకు నగదు ఉండవచ్చని దేవస్థాన కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఆ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

18 మంది జూదరుల అరెస్టు

పొదిలి, సెప్టెంబరు 1 : మండలంలోని కొనకనమిట్ల అడ్డరోడ్డు సమీపంలో పేకాట ఆడుతున్న 18 మంది జూదరులను పోలీసులు ఆదివారం రాత్రి అరెస్టు చేశారు. పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడి చేసి పేకాట ఆడుతున్న 18 మందిని అదుపులోకి తీసుకొన్నారు. వారి వద్ద నుండి రూ.57 వేలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

సగిలేరుకు ఉధృతంగా నీరు



వాగును పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

గిద్దలూరు, సెప్టెంబరు 1 : తుఫాన్ కారణంగా నల్లమల అటవీ ప్రాంతంలో భారీ వర్షాలు కురవడంతో సగిలేరునదికి నీటిరాక పెరిగింది. శనివారంతో పోలిస్తే ఆదివారం నీటి ఉధృతి కొంచెం పెరిగింది. భీమలింగేశ్వరస్వామి దేవాలయం సమీపంలో సగిలేరువాగును ఇరిగేషన్ డిఇ జయరామయ్య, ఎఇ విశ్వనాథన్, ఇతర సిబ్బంది పరిశీలించారు. నీటి ఉధృతి ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రమాదకర పరిస్థితి ఏమీలేదని, అయినప్పటికీ సగిలేరు పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సగిలేరులో నీటి ఉధృతిని ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించామని పేర్కొన్నారు.

మార్కాపురం చెరువు సప్లైచానల్‌లో చెత్త తొలగింపు

పనులు ప్రారంభించిన అధికారులు



కాలువలో పేరుకుపోయిన చెత్త

మార్కాపురం, సెప్టెంబరు 1: ఒకవైపు విస్తారంగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండు తున్నా రెండు శాఖల నిర్లక్ష్యం ఫలితంగా మా ర్కాపురం చెరువుకు సక్రమంగా నీరు చేరడం లేదు. రెండు రోజులుగా వర్షాలు కురవడంతో గుండ్లకమ్మ నది ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో మార్కాపురం చెరువుకు ప్రధాన వనరైన సప్లైఛానల్‌లోకి మాత్రం సక్రమంగా నీరు రావడంలేదు. మండలంలోని మాల్యవంతునిపాడు వద్ద గుండ్లకమ్మ నుంచి కాలువలోకి నీరు వస్తున్నా పట్టణ సమీపానికి వచ్చేసరికి చెరువు లోకి నీరు సక్రమంగా పోవడంలేదు. దీంతో కాలువలో చెత్తాచెదారం నిండుకుని అవరోధం ఏర్పడుతోంది. ఇళ్లలోని చెత్తను సక్రమంగా మున్సిపాలిటీ అధికారులు సేకరించకపోవడం తో ప్రజలు చెరువుకు నీటిని అందించే కాలువలోకి వేస్తున్నారు. అంతేకాక వర్షాకాలానికి ముందే ఇరిగేషన్ అధికారులు చెరువుకు నీరు చేరే మార్గాలన్నింటినీ శుభ్రం చేయించాలి. కానీ ఆ శాఖ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరి స్తున్నారు. దీంతో వర్షాలు పడినా చెరువు నిండేం దుకు అవకాశం లేకుండా పోతోంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో చెరువుకు సక్రమంగా నీరు చేరడం లేదని ప్రజలు సామాజిక మాధ్యమాల ద్వారా అధికారుల తీరును ఎండగట్టారు. దీంతో ఆదివారం సాయంత్రం నుంచి సప్లైఛానల్‌లో ఎక్సకవేటర్ ద్వారా చెత్తను తొలగించే పనిని అధికారులు మొదలుపెట్టారు.

మార్కాపురం రూరల్ : మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని తిప్పాయపాలెం గ్రామంలో ఇళ్ల మధ్యలోకి వర్షపు నీరు సుమారు మూడు అడుగుల మేర చేరింది. దీంతో స్థానికులు సమస్యను సంబంధిత అధికారులకు తెలిపారు. స్పందించిన తహశీల్దార్ చిరంజీవి ఆదివారం ఉదయం ఇళ్ల మధ్య చేరిన నీటిని మరొక మార్గానికి మళ్లించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు.

శ్రీశైలం-దోర్నాల ఘాట్ రోడ్డులో విరిగిన కొండచరియలు



చెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

పెద్ద దోర్నాల, సెప్టెంబరు1: శ్రీశైలం-దోర్నాల ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగిపడి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ ఘటన ఆదివారం చోటుచేసుకుంది. మండల పరిధిలోని చింతల, తుమ్మలబైలు మధ్యలో నల్లమల అటవీ ప్రాంతంలో ఘటన చోటుచేసుకొంది. రెండు రోజులుగా అటవీ ప్రాంతంలో భారీగానూ, ఎడతెరిపి లేకుండా వాన కురవడంతో కొండచరియలు, చెట్లు విరిగి రోడ్డుపై అడ్డంగా పడ్డాయి. పెద్ద కొండరాళ్లు, చెట్ల సమూహంతో పడడంతో వాహనాల రాకపోకలకు అవరోధం ఏర్పడింది. దీంతో వాహనదారులు పోలీసులకు సమాచారమిచ్చారు. స్పందించిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఎక్సకవేటర్ సహాయంతో రాళ్లు, చెట్లను రోడ్డుపై నుంచి తొలగించడంతో వాహనాల రాకపోకలు యథాతథంగా కొనసాగాయి.

కడసారి చూసుకోగలిగారు

- ఆర్మేనియాలో దోర్నాల మండల వాసి మృతి
- 22 రోజుల తర్వాత స్వగ్రామానికి భౌతికకాయం
- చొరవచూపిన మంత్రి లోకేష్, ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు





మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఎరిక్షన్‌బాబు, శివన్నారాయణ(ఫైల్)

పెద్దదోర్నాల, సెప్టెంబరు 1: పరాయిదేశంలో బిడ్డ మృతిచెందాడన్న బాధ ఒకవైపు, కనీసం కడసారి చూపు చూసుకుంటామో లేదోనన్న ఆవేదనతో మరోవైపు ఆ తల్లిదండ్రులు కుమిలిపోయారు. 22 రోజులుగా వారు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. ఎట్టకేలకు ఆదివారం స్వగ్రామానికి మృతదేహం చేరింది. మంత్రి నారా లోకేష్ కృషి, టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు చొరవతో తల్లిదండ్రుల కన్నబిడ్డను కడచూపు చూసుకోగలిగారు. మండలంలోని హసనాబాద్ గ్రామానికి చెందిన ఒంటేరు చిన్న ఆవులయ్య, రాజేశ్వరిల కుమారుడు ఒంటేరు శివన్నారాయణ (32) ఉన్నత ఉద్యోగం కోసం పరాయి దేశం ఆర్మేనియాకు వెళ్లాడు. ఆరేడు నెలలుగా అక్కడే ఉంటూ రోజూ తల్లిదండ్రులతో మాట్లేవాడు. అయితే అక్కడ అనారోగ్యంతో ఉండడంతో ఆగస్టు 7న తల్లిదండ్రులకు ఫోన్ చేశాడు. తదనంతరం రెండు రోజులకు ఆగస్టు 9న మృతి చెందినట్లు శివన్నారాయణ సహచరుడు ఇక్కడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో బిడ్డ మృతిచెందిన బాధ ఒక వైపు, అంత దూరం నుంచి భౌతికకాయాన్ని స్వగ్రామం ఎలా తీసుకురావాలో తెలియని నిస్సహాయత ఇంకో వైపు ఆ కుటుంబాన్ని తీవ్రంగా కుంగదీసింది. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఈ క్రమంలో వారు ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబును కలిసి తమగోడు వెళ్లబోసుకున్నారు. వెంటనే ఆయన సీఎంవో కార్యాలయానికి సమాచారమిచ్చారు. స్పందించిన విద్యాశాఖ మంత్రి లోకేశ్ కేంద్ర విదేశీ మంత్రిత్వశాఖ అధికారులకు విషయం తెలియజేశాడు. శివన్నారాయణ భౌతికకాయాన్ని స్వగ్రామం తరలించేంత వరకూ ఎరిక్షన్‌బాబు అటు ముఖ్యమంత్రి, ఇటు మంత్రి లోకేష్‌తో సమన్వయం చేసుకుంటూ వారికి ప్రభుత్వ ఖర్చులతో మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చారు. బిడ్డలేని లోటును ఆ కుటుంబానికి పూడ్చలేకున్నా, తమకోసం కష్టపడుతూ ప్రాణాలు వదిలిన కుమారిడికి గౌరవప్రదంగా అంతియయాత్ర చేసుకోగలిగారు.

శోకసంద్రంలో కొత్తపల్లి





నివాళి అర్పిస్తున్న ఎరిక్షన్‌బాబు, రోధిస్తున్న తల్లిదండ్రులు

పెద్దారవీడు, సెప్టెంబరు 1 : మండలంలోని కొత్తపల్లి గ్రామం ముగ్గురు చిన్నారుల మృతితో శోకసంద్రంలో మునిగిపోయింది. ఈత కోసం కుంటలో దిగి ముగ్గురు చిన్నారులు మృతిచెందారు. దీంతో తల్లిదండ్రులు కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి కులవృత్తి అయిన వడ్రింగి పని చేసుకుంటున్న కొత్తపల్లి విశ్వరూపాచారి, భానుచారీల కుమారులు మను, శివ, ఆరవీటి శ్రీను కుమారుడు ఏడుకొండలు ఈత కోసం కుంటలో దిగి మృతిచెందారు. రోజూ చలాకీగా బడికి పోతూ, వస్తూ అందరి మధ్యలో తిరిగే చిన్నారుల మృతితో కొత్తపల్లి గ్రామంలో కన్నీరు పెట్టని వారు లేరు. ఇటువంటి విషాద ఘటన మునుపెన్నడూ తమ ఊరిలో జరగలేదంటూ నాటితరం వారి నుంచి నేటితరం వారు పేర్కొంటున్నారు. ఈ ఘటన గురించి తెలుసుకున్న టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు, ఇన్‌చార్జ్ సబ్‌కలెక్టర్ వెంకట సునీల్, డివిజనల్ పంచాయతీ అధికారి భాగ్యవతి, డిప్యూటీ తహసీల్దార్ రాజేష్, ఎంపీడీవో రాజ్‌కుమార్‌లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ముగ్గురు చిన్నారుల మృతదేహాల వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు అండా ఉంటానన్నారు. పరిస్థితిని సీఎం చంద్రబాబునాయుడికి వివరించి ఆయా కుటుంబాలను ఆదుకుంటానని తెలిపారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు మెట్టు శ్రీనివాసులరెడ్డి, మాజీ అధ్యక్షుడు గొట్టం శ్రీనివాసులరెడ్డి, తదితరులు ఉన్నారు.

అవీ..ఇవీ..

పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

గిద్దలూరు, సెప్టెంబరు 1 : పాత ఫించన్ విధానాన్ని పునరద్ధరించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్ విధానం వద్దని పేర్కొంటూ స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. జీవో నంబరు 117ను రద్దు చేయాలని, తెలుగు, ఇంగ్లీషు మాధ్యమాలను సమాంతరంగా ఉండే విధంగా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు టి.సుబ్బరాయుడు, మాజీ రాష్ట్ర కౌన్సిలర్ మూర్తయ్య, జిల్లా కౌన్సిలర్ రంగస్వామి, ఏపీటీఎఫ్ నాయకులు సయ్యద్ దస్తగిరి, నారాయణరావు, వెంకటేశ్వర్లు, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

ప్రభుత్వ వైద్యశాలలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న వాసవిక్లబ్ సభ్యులు

మార్కాపురం, ఆగస్టు 1: స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఆదివారం వాసవిక్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. క్లబ్ వ్యవస్థాపకులు కల్వకుంట్ల చంద్రశేఖర్‌గుప్తా జయంతిని పురస్కరించుకొని వాసవి ఇంటర్నేషనల్ అధ్యక్షులు రవిచంద్రన్ ఆదేశాల మేరకు శిబిరం నిర్వహించారు. క్లబ్‌కు చెందిన పలువురు ప్రతినిధులు రక్తదానం చేశారు. శిబిరాన్ని వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సావిత్రి పర్యవేక్షించారు. కార్యక్రమంలో క్లబ్ రీజనల్ చైర్‌పర్సన్ పోలేపల్లి లక్ష్మీనారాయణ, రీజనల్ సెక్రటరీ సూరె కేశవ, మార్కాపురం గౌరవాధ్యక్షులు సముద్రాల రమేష్‌కుమార్, సెక్రటరీ బచ్చు ప్రభాకర్, ట్రెజరర్ పాదర్తి హరిబాబు, సభ్యులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

మార్కాపురం, ఆగస్టు 1: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్‌ల జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. స్థానిక కంభం రోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమాన్ని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ప్రారంభిస్తారన్నారు. జనసేన నాయకులు, కార్యకర్తలు రక్తదాన శిబిరంలో పాల్గొనాలని కోరారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి



కేకు కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

మార్కాపురం, ఆగస్టు 1: రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబునాయుడితోనే సాధ్యమని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ అన్నారు. స్థానిక కంభం కూడలిలోని పట్టణ పార్టీ అధ్యక్షులు డాక్టర్ మౌలాలి వైద్యశాలలో ఆదివారం సాయంత్రం చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా తొలిసారి బాధ్యతలు చేపట్టి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ చంద్రబాబు దార్శనికత వలనే నేడు హైదరాబాద్ ప్రపంచంలోనే గుర్తింపుపొందిన నగరంగా పేరుగాంచిందన్నారు. విభజిత ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో ఆయన అభివృద్ధి చేస్తారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కనిగిరి బాలవెంకటరమణ, పఠాన్ ఇబ్రహీం, పఠాన్ గులాబ్‌ఖాన్, ఈ.వెంకటేశ్వర్లు, గురవయ్య పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ సేవలు అభినందనీయం

ఉద్యోగ విరమణ చేసిన తారావాణికి ఘన సన్మానం

పొదిలి, సెప్టెంబరు 1 : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ చెరుకూరి తారావాణి విద్యార్థులకు అందించిన సేవలు అభినందనీయమని ఆర్‌జేడీ వీవీ సుబ్బారావు, జిల్లా ప్రిన్సిపాల్స్ సంఘం అధ్యక్షుడు కేపీ రంగనాయకులు తదితరులు కొనియాడారు. ప్రిన్సిపల్ ఉద్యోగ విరమణ సందర్భంగా కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన అభినందనసభలో పలువురు పాల్గొని మాట్లాడారు. 37ఏళ్లు ఉపాధ్యాయురాలిగా, అధ్యాపకురాలిగా, కళాశాల ప్రిన్సిపాల్‌గా వివిధ హోదాల్లో పనిచేసి విద్యార్థుల విద్యాభివృద్ధికి బాధ్యతగా కృషి చేశారని కొనియాడారు. వృత్తి పట్ల అంకితభావంతో పనిచేస్తూ అధికారుల మన్ననలు సైతం పొందారన్నారు. అనంతరం కళాశాల అధ్యాపక బృందం, అధికారులు, విద్యార్థులు ప్రిన్సిపాల్ తారావాణి, ఈశ్వరయ్య దంపతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నెల్లూరు జిల్లా అధ్యక్షుడు ఎస్కే సికిందర్, విశ్రాంత ఆర్‌ఐవో పి.మనోహర్‌బాబు, బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కరిమున్‌బీబీ, హబిబుల్లా, సేవాసంస్థ చైర్మన్ ఎం.కరిముల్లాబేగ్, కళాశాల అధ్యాపకులు ఎల్.పద్మారావు, వెంకటేశ్వరరావు, రమణారెడ్డి, సి.రామలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థాన కమిటీ అధ్యక్షులుగా రంగసత్యనారాయణ



నూతన అధ్యక్షుడిని సన్మానిస్తున్న సభ్యులు

గిద్దలూరు, సెప్టెంబరు 1 : పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థాన కమిటీ అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నిక రసవత్తరంగా సాగింది. 130 ఓట్ల ఆధిక్యతతో వాడకట్టు రంగ సత్యనారాయణ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 992 ఓట్లు ఉండగా ఆదివారం జరిగిన ఎన్నికలో 866 ఓట్లు పోలయ్యాయి. వాడకట్టు రంగసత్యనారాయణకు 496 ఓట్లు రాగా ప్రత్యర్థి రాచపూటి నరసింహారావుకు 366 ఓట్లు వచ్చాయి. నాలుగు ఓట్లు చెల్లకుండా పోయాయి. 130 ఓట్ల ఆధిక్యతతో రంగసత్యనారాయణ విజయం సాధించారు. రెండేళ్లపాటు పదవిలో ఉంటారు. ఈ దేవస్థానానికి సంబంధించి 15 హద్దులు ఉండగా 13 హద్దుల్లో ఏకగ్రీవ ఎన్నిక జరుగింది. మిగతా 2 హద్దులకు సభ్యుల మధ్య పోటీ ఉండడంతో ఎన్నిక జరిగింది. నూతన అధ్యక్షునిగా ఎన్నికైన వాడకట్టు రంగసత్యనారాయణను దేవస్థానంలో పలువురు సన్మానించారు.

రసాయన ఎరువులను క్రమపద్ధతిలో వినియోగిస్తే అధిక దిగుబడులు

పెద్దారవీడు, సెప్టెంబరు 1: రసాయన ఎరువులను క్రమపద్ధతి లో వినియోగిస్తే అధిక దిగుబడులు సాధ్యమని 'ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా' రీజనల్ హెడ్ వైవీఎస్ మూర్తి అన్నారు. మండలంలోని దేవరాజుగట్టు వద్ద ఉన్న ఎస్ఎస్ అగ్రికల్చర్ కళాశాలలో ఆ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ విచక్షణారహితంగా ఎరువులు వాడినంత మాత్రాన దిగుబడులు పెరగవన్నారు. భూమిలో ఏ పోషకాలు తక్కువగా ఉన్నాయో గుర్తించి అందుకనుగుణంగా ఎరువులను వినియోగించాలన్నారు. నానో టెక్నాలజీ ద్వారా ఎరువులు కూడా ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్నాయన్నారు. డ్రోన్ ద్వారా మందులను పిచికారీ చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఫెర్టిలైజర్ రంగంలో వ్యవసాయ కళాశాలల్లో చదివే విద్యార్థులకు అపారమైన ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నాదెళ్ల చంద్రమౌళి, అసోసియేట్ డాక్టర్ ఆర్‌వీఎస్‌కే రెడ్డి, పలు కంపెనీలకు చెందిన రీజనల్ అధికారులు పాల్గొన్నారు.

భైరవకోనలో సీఐ ప్రత్యేక పూజలు


భైరవకోనలో పూజలు చేస్తున్న సీఐ భీమానాయక్

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 1: సీఎస్‌పురం మండలంలో ప్రముఖ శైవ క్షేత్రమైన భైరవకోన త్రీముఖదుర్గాంబా దేవస్థానాన్ని ఆదివారం సీఐ ఎం.భీమానాయక్ సందర్శించారు. అక్కడ జాలువారుతున్న జలపాతాన్ని తిలకించారు. అనంతరం ఒకేరాతి కొండపై చెక్కబడి ఉన్న పలు ఆలయాలను పరిశీలించి విశేషాలను అడిగి తెలుసుకొన్నారు. తదఅనంతరం శ్రీ కాలభైరవ స్వామి, త్రిముఖ దుర్గాఅమ్మవార్లను దర్శించుకొన్నారు. అర్చకులు సీఐ కుటుంబ సభ్యుల పేర్లపై అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. స్వామి వార్ల తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో సీఎస్‌పురం ఎస్ఐ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

వాసవీ దేవస్థానంలో పూజలు


వాసవీ దేవస్థానంలో పూజలు చేస్తున్న భక్తులు

పామూరు, సెప్టెంబరు 1: పామూరులోని శ్రీవాసవీ కణ్యాకపరమేశ్వరి దేవస్థానాన్ని పాలకొల్లు ప్రాంతానికి చెందిన 30 మంది భక్తులు ఆదివారం సందర్శించారు. ఈసందర్భంగా దేవస్థాన కమిటీ చైర్మన్ యేల్చూరి బాలకొండలు వారికి ఆహ్వానం పలికారు. అనంతరం ప్రత్యేక కుంకుమ పూజ కార్యక్రమాలు జరిపించారు. కార్యక్రమంలో శేగు కృష్ణయ్య గురు, కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.

సుపరిపాలనకు మారుపేరు చంద్రబాబు

దర్శి, సెప్టెంబరు 1: సుదీర్ఘ అనుభవం కలిగిన గొప్ప నాయకుడు సీఎం చంద్రబాబు అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. ఈమేరకు ఆదివారం ఓప్రకటన విడుదలచేశారు. సీఎం చంద్రబాబు తొలిసారి ముఖ్యమంత్రి పదవి చేపట్టి 30 సంవత్సరాలు అయిన సందర్భంగా ఆయన చేసిన అభివృద్ధిని కొనియాడారు. ఉమ్మడిఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా హైదరాబాద్‌లో హైటెక్ సిటీ నిర్మించి వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. చంద్రబాబును చూస్తే ప్రజలకు అభివృద్ధి, సుపరిపాలన గుర్తుకు వస్తుందన్నారు. 75 ఏళ్ల వయస్సులో కూడా నిత్య యువకుడిలా నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ లక్ష్మి విజ్ఞప్తి చేశారు. వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నందున హడావుడిగా నీటిలో దిగి ప్రమాదాల బారినపడవద్దని ఆమె హితవు పలికారు.

వర్షాలకు కూలిన మట్టిమిద్దె

కురిచేడు, సెప్టెంబరు 1: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మట్టిమిద్దె కూలిన సంఘటన మండలంలోని గంగదొనకొండలో ఆదివారం చోటు చేసుకుంది. అందిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన గూడేటి సీతారామిరెడ్డికి చెందిన పాత మట్టిమిద్దె ఎడతెరపి లేకుండా కురిసిన వర్షంతో బాగా తడిసి అకస్మాత్తుగా కూలింది. ఆసమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవటంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు.

గుంతలమయంగా ఆర్‌అండ్‌బీ రోడ్డు

పామూరు, సెప్టెంబరు 1: కొద్దిపాటి వర్షానికే ప్రధానమైన ఆర్‌అండ్‌బీ రోడ్డు ఛిద్రంగా తయారైంది. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రోడ్డు గుంతలమయంగా మారింది. గతంలో ఏర్పడిన గుంతలను కంకరు చిప్‌తో తత్కాలిక మరమ్మతులు చేశారు. శనివారం కురిసిన కొద్దిపాటి వర్షానికే కంకరడస్ట్ కొట్టుకుపోవడంతో గుంతలు బయటపడ్డాయి. దాంతో వర్షం నీరు గుంతల్లో చేరి వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఈరోడ్డు ఆర్‌అండ్‌బీ పరిధిలోకి వెళ్లింది. సంబంధిత అధికారులు దృష్టి సారించి గుంతలు ఏర్పడ్డ ప్రాంతంలో మరమ్మతు పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

వసతి గృహాలను పరిశీలించిన తహసీల్దార్


భోజనం నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్న తహసీల్దార్ రజనీకుమారి

కురిచేడు, సెప్టెంబరు 1: గత రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆదివారం తహసీల్దార్ రజనీకుమారి కురిచేడులోని కస్తూర్బా గాంధీ పాఠశాల, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం, ఎస్సీ, బీసీ హాస్టళ్లను పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆహార నాణ్యతను, రోజువారీ మెనూ అమలు గురించి ఆరా తీశారు. వర్షాలు కురుస్తున్న సమయంలో విద్యార్థులు ఎటువంటి వ్యాధులకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. వర్షాలతో ఎటువంటి సమస్య తలెత్తినా తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని ఉపాధ్యాయులు, వసతి గృహ సంక్షేమాధికారులకు సూచించారు. కార్యక్రమంలో కురిచేడు, పడమర వీరాయపాలెం వీఆర్వోలు వి.సరోజినీ, సీహెచ్ ఆంజనేయులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి సహకరించాలి


మాట్లాడుతున్న ఎస్ఐ నాగరాజు

ముండ్లమూరు, సెప్టెంబరు 1: గ్రామాల్లో ఎలాంటి అలజడులు లేకుండా ప్రశాంతంగా ఉండేందుకు సహకరించాలని ఎస్ఐ వై.నాగరాజు అన్నారు. విజుబుల్ పోలీసింగ్‌లో భాగంగా ఆదివారం సాయంత్రం పసుపుగల్లు గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా గ్రామస్థులతో మాట్లాడుతూ అందరూ కలసిమెలసి జీవించాలన్నారు. చిన్నచిన్న విషయాలకు గొడవలు పడి శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దన్నారు. గ్రామంలో ఎవరైనా ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈనెల 7న వినాయక చవితి పండుగను పురస్కరించుకొని విగ్రహాల ఏర్పాటుక్రమంలో చిన్నపాటి గొడవ జరిగినా క్షమించేది లేదన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ప్రేమానిధి, ఖాశీం తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సరుకులను సద్వినియోగం చేసుకోవాలి

పామూరు, సెప్టెంబరు 1: మండలంలో సెప్టెంబరు నెలకు సంబంధించి ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేస్తున్న రేషన్ సరుకులను కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బీవీ రమణారావు సూచించారు. బియ్యంతో పాటు పంచదారను అందిస్తున్నట్టు చెప్పారు. పంపిణీలోగాని, తూకంలోగాని లోపాలు ఉన్నట్లయితే 1967 టోల్‌ఫ్రీ నెంబరుకు తెలియజేయాలని సూచించారు.

జూదరుల అరెస్ట్

పామూరు, సెప్టెంబరు 1: పట్టణంలోని ఓ లాడ్జిలో పేకాట ఆడుతున్న ఐదుగురిని సీఐ ఎం.భీమానాయక్ తన సిబ్బందితో ఆదివారం దాడిచేసి అదుపులోకి తీసుకొన్నారు. వారినుంచి రూ.8928 నగదును స్వాధీనం చేసుకున్నారు.

పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం

- గుంతలను తలపిస్తున్న అంతర్గత రోడ్లు
- సీజనల్ వ్యాధులు వ్యాపిస్తాయని ప్రజల ఆందోళన
- పట్టించుకోని అధికారులు

వీసీపల్లి, సెప్టెంబరు 1: పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. ఎక్కడపడితే అక్కడ మురుగునీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. మురుగు కాలువలు లేకపోవడంతో ఇళ్లల్లోని నీరు రోడ్లపై నిలిచిపోయి నీటిగుంతలను తలపిస్తున్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పల్లెలవైపు కన్నెత్తి చూడడంలేదు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా వంటివి వ్యాపిస్తాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.


కమ్మవారిపల్లి గ్రామంలో నిలిచిన నీరు

మండలంలోని పలుగ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. లింగన్నపాలెం గ్రామం నడిమధ్యలో మురికిగుంత ఏర్పడింది. గ్రామంలో మురుగుకాలువలు లేకపోవడంతో ఇళ్లల్లోని నీరు అక్కడకు వచ్చిచేరి మురికి కూపంగా మారి దోమలకు ఆవాసకేంద్రంగా మారాయి. ఇళ్లల్లోని నీటితోపాటు వర్షపునీరు కూడా చేరడంతో దుర్వాసన వెదజల్లుతోంది. పలుమార్లు సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటికీ సమస్యను పరిష్కరించలేదు. గత ఏడాది వర్షాకాల సీజన్‌లో పలువురు సీజనల్ వ్యాధుల బారినపడి కనిగిరి, ఒంగోలులో చికిత్స పొందారు. గత అనుభవాన్ని గుర్తుచేసుకుని పారిశుధ్య పనులు చేపట్టడంలో అధికారులు విఫలమయ్యారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

వీసీపల్లి పాత బ్యాంక్‌సెంటర్ నుంచి ఎమ్మార్వో ఆఫీసుకు వెళ్లే మార్గం కొద్దిపాటి చినుకులు పడినా బురదమయంగా మారుతుంది. కమ్మవారిపల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మించి సైడుకాలువ నిర్మాణం చేపట్టలేదు. దీంతో గ్రామం మధ్యలో రోడ్డుపైనే నీరు నిలిచి చిన్నపాటి కుంటలా తలపిస్తోంది. వివిధ పనులపై మండలకేంద్రానికి ఆమార్గం గుండా వెళ్లే ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీంతోపాటు ఇళ్లమధ్య చేరిన


లింగన్నపాలెం గ్రామం మధ్యలో నిలిచిఉన్న మురుగునీరు

నీరు మురికికూపంగా మారడంతో దుర్గంధం వెదజల్లుతోంది. పెద్దన్నపల్లి గ్రామంలో సైడుకాలువలు లేకపోవడంతో చినుకుపడితే చిత్తడిగా మారుతోంది. రెండురోజులుగా కురుస్తున్న చిరుజల్లులతో పాటు ఇళ్లల్లోని నీరు రోడ్డుపైకి చేరింది. గ్రామం మధ్యలో మురుగు నిలవడంతో సీజనల్ వ్యాధులు వ్యాపిస్తాయేమోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. కమ్మవారిపల్లి నుంచి కొత్తపల్లి వెళ్లే అంతర్గత రోడ్డులో నీరు నిలబడిపోయింది. ప్రజలు అడుగుతీసి అడుగు వేయలేకపోతున్నారు. గ్రామాల్లోని పారిశుధ్య సమస్యలపై సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకునివెళ్లినా సరైన స్పందన కనిపించడంలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు గ్రామాలను సందర్శించి పారిశుధ్య పనులను చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

- ఏపీటీఎఫ్ నేతల డిమాండ్
- పలుచోట్ల నిరసన ర్యాలీలు


దర్శిలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

దర్శి, సెప్టెంబరు 1: ఉపాధ్యాయుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం దర్శిలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. ఈసందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్ విధానాలను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఐదేళ్లుగా ఉపాధ్యాయులు ఎన్నో ఉద్యమాలు చేసినప్పటికీ గత పాలకులు పట్టించు కోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం ఉద్యోగుల హక్కులను కాలరాసి జీపీఎస్ విధానాన్ని ప్రవేశపెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం యూపీఎస్ విధానాన్ని ప్రవేశపెట్టి తీరని అన్యాయం చేస్తుంద న్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధా నాలకు నిరసనగా ఈ ఆందోళన కార్య క్రమం చేపట్టినట్లు చెప్పారు. కార్యక్ర మంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి సీహెచ్ శివరామ కృష్ణ, రంగస్వామి, కోటేశ్వరరావు, పి.శ్రీనివాసులు, షేక్ మస్తాన్‌వలి, ఎన్.శ్రీనివాసులు, బి.సుబ్బారెడ్డి, రహంతు ల్లా, ఎస్‌వీఎల్ సుబ్బారావు, వేమా రమణయ్య, జి.వేణు తదిత రులు పాల్గొన్నారు.



సీపీఎస్ రద్దు చేయాలని కోరుతూ కనిగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

అలాగే, యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆదివారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా యూటీఎఫ్ డివిజన్ కార్యదర్శి వెంకట రెడ్డి మాట్లాడుతూ సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్ విధానాలను రద్దుచేసి పాత విధానాలను అమలుచేయాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలపట్ల పాలకులు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు మీనగ శ్రీనివాసరావు, డి.ఖాశిం, ఏ.రామారావు, కె.రామారావు, ఎం.వెంకటరెడ్డి, ఏ.రోశయ్య, ఎస్.తిరుపతిరెడ్డి, శ్రీనివాసులు, టి.చెంచయ్య, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దుచేయాలి

కనిగిరి, సెప్టెంబరు 1: సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని ఏపీటీఎఫ్ నాయకుడు నాయబ్‌రసూల్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్ విధానాలను ప్రభుత్వాలు విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం కేంద్రీకృత పెన్షన్ విధానం (యూపీఎస్) అనే నూతన పెన్షన్ విధానం అమలుకు యోచిస్తుందన్నారు. ఇది ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఆమోదయోగ్యం కాదన్నారు. పాత పెన్షన్ విధానం(ఓపీఎస్) ఒక్కటే ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు మెరుగైందని చెప్పారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్‌లకు జలకళ

- ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు
- పైర్లకు జీవం పోసిన వర్షం


కొత్తపాలెం వద్ద చెక్‌డ్యాంపై పొంగి ప్రవహిస్తున్న నీరు

తాళ్లూరు, సెప్టెంబరు 1: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని వాగులు, వంకలు నీటితో నిండిపోయాయి. నిన్నటివరకు చుక్కనీరు లేని దోర్నపువాగు, వావిళ్ల వాగు, కాండ్లవాగులు, వంకలు నీటితో ప్రవహిస్తున్నాయి. పలుగ్రామాల్లోని చెక్‌డ్యామ్‌లు జలకళ సంతరించుకున్నాయి. నీరందక నెర్రెలువారిన వరి పైరుకు ఈ వర్షం జీవం పోసింది. ఎండుముఖం పట్టిన మొక్కజొన్న పైరుకు ఊపిరి పోసింది. వాగులు ప్రవహిస్తుండటంతో రెవెన్యూ, పోలీస్ శాఖలు అప్రమత్తమై పహారా కాస్తున్నారు. వ్యవసాయశాఖ అధికారి, సిబ్బంది వర్షం వల్ల దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్నారు.

బొప్పాయి రైతులు అప్రమత్తంగా ఉండాలి

కనిగిరి, సెప్టెంబరు 1: బొప్పాయి రైతులు అప్రమత్తంగా ఉండాలని ఉద్యానశాఖ ఏవో ఎం. అంజలీబాయి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని యడవల్లి గ్రామంలోని బొప్పాయి తోటను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా రైతులకు పలుసూచనలు చేశారు. మీటరు ఎత్తుకు పైగా ఉన్న బొప్పాయి చెట్లు ఈదురుగాలులకు ఒరిగిపోకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. రెండు మీటర్లు ఎత్తు ఉండే వెదురు పుల్లలను చెట్లకు ఆపుగా నిలిపితే ఈదురుగాలులకు ఒరిగిపోవన్నారు. కార్యక్రమంలో రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.


యడవల్లి గ్రామంలో బొప్పాయి తోటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ ఏవో అంజలీబాయి


వితలాపురం వెళ్లే మార్గంలోప్రవహిస్తున్న దోర్నపువాగు

రైతులకు మేలుచేకూర్చిన వర్షం

దర్శి, సెప్టెంబరు 1: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఖరీఫ్ పైర్లు బాగా పుంజుకునే అవకాశం లభిస్తుంది. ఇటీవల కాలంవరకు వర్షాలు లేక మెట్ట ప్రాంతాల్లో ఇంకా పైర్లు సాగు చేయలేదు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు విత్తనం వేసేందుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. ఈ వర్షం అన్నీ రకాలుగా రైతులకు మేలు చేకూర్చింది.

కాగా, గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాతగోడలు కూలు తున్నాయి. చెట్లు కొమ్మలు విరిగిపడుతున్నాయి. దర్శి పట్టణ సమీపంలోని శివరాజ్‌నగర్ వద్ద రోడ్డుపై చెట్టుకొమ్మ విరిగిపడింది. దర్శి నుంచి ప్రయాణికులతో వెళుతున్న ఆటోను తాకుతూ కొమ్మ కిందపడటంతో ప్రమాదం తప్పింది. హ టాహటీన ఆటోలోని ప్రయాణికులు దిగిపోవటంతో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

ఈదర సబ్‌స్టేషన్‌ను పరిశీలించిన ఏడీఈ


ఈదర సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఏడీఈ పిచ్చయ్య

ముండ్లమూరు, సెప్టెంబరు 1: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏడీఏ కె.పిచ్చయ్య అన్నారు. ఆయా గ్రామాల్లోని ప్రజలు విద్యుత్ లైన్‌లను తాకవద్దని సూచించారు. ఆదివారం మండలంలోని ఈదర సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. అనంతరం వర్షానికి వివిధ గ్రామాల్లో పడిపోయిన విద్యుత్ స్తంభాలను పరిశీలించారు.

వర్షాలు తగ్గిన వెంటనే పడిపోయిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటుచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఈ ఎస్.వీరబ్రహ్మం, లైన్ ఇన్‌స్పెక్టర్ ఎస్ సాంబయ్య, లైన్‌మెన్‌లు ఆంజనేయులు, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల విరిగిపడిన విద్యుత్ స్తంభాలు

ముండ్లమూరు, సెప్టెంబరు 1: మండలంలోని పలు గ్రామాల్లో శని, ఆదివారాల్లో కురిసిన వర్షానికి 35 విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ఆశాఖ అధికారులు యుద్ధప్రాతిపదికన విద్యుత్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. మండలంలోని తమ్మలూరు, శంకరాపురం, ఈదర, పూరిమెట్ల, పసుపుగల్లు, మారెళ్ల గ్రామాలతో పాటు వ్యవసాయ పొలాల్లో స్తంభాలు విరిగిపడ్డాయి. ఏడీఈ కె.పిచ్చయ్య, ఏఈ ఎస్.వీరబ్రహ్మం, సిబ్బంది పడిపోయిన విద్యుత్ స్తంభాలను పరిశీలించారు. నష్టాన్ని అంచనా వేసి ఆశాఖ ఉన్నతాధికారులకు పంపించారు. రెండు మూడు రోజుల్లో స్తంభాలు వచ్చేవిధంగా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఏఈ వీరబ్రహ్మం, లైన్‌ఇన్‌స్పెక్టర్ సాంబయ్య, లైన్‌మెన్‌లు ఆంజనేయులు, నాయక్, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

- కనిగిరి నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య


సమావేశంలో మాట్లాడుతున్న కేవీ రమణయ్య

పామూరు, సెప్టెంబరు 1: దేశవ్యాప్తంగా సోమవారం ప్రారంభం కానున్న బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆపార్టీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మొదటగా సభ్యత్వాన్ని స్వీకరిస్తారని చెప్పారు. సమావేశంలో ఉమ్మడిశెట్టి శ్రీను, చామల శ్రీనివాసులరెడ్డి, డి.వెంకటచరణ్, పి.విజయకుమారచారి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని ప్రజలకు మరింత చేరువ చేయాలి

కురిచేడు, సెప్టెంబరు 1: బీజేపీని ప్రజలకు మరింతగా చేరువ చేసేందుకు నాయకులు, కార్యకర్తలు బాధ్యతగా కృషి చేయాలని ఆపార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తిండి నారాయణరెడ్డి సూచించారు. ఆదివారం కురిచేడులో జరిగిన సమావేశానికి ఆపార్టీ మండల అధ్యక్షుడు కోరంగి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ బీజేపీ సభ్యత్వ నమోదును పండుగలా నిర్వహించాలన్నారు. కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నం శ్రీనివాసులు మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు పి.వెంకటరామయ్య, చెన్నంశెట్టి పిచ్చయ్య, సుబ్బారావు, జోసఫ్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

తాళ్లూరు, సెప్టెంబరు 1: పవిత్ర పుణ్యక్షేత్రంగా వెలుగొందుతూ భక్తుల కోర్కెలు తీరుస్తున్న సోమవరప్పాడు పరిధిలోని గుంటిగంగ సన్నిధిలోగల గుంటి గంగాభవానీ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గంగమ్మ తల్లికి పొంగళ్లు పెట్టి కరుణించమని వేడుకున్నారు. ఆలయబ్రాహ్మణ అర్చకులు ఎస్.కామేశ్వరశర్మ, పూజారులు ప్రకాశ్‌పంతులు, బాలరాజులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో పి.కార్తిక్, ఆలయకమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

నారాయణస్వామికి విశేష పూజలు

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 1: మండలంలోని మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకులు మంకాల సత్యనారాయణ శర్మ అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించి నూతన వస్త్రా లతో అలంకరణచేశారు. స్వామి వారికి నైవేద్యాన్ని మేళతాళా లతో ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి స్వామి వారికి సమ ర్పించారు. గోశాలలోని ఆవులకు పసుపు, కుంకుమలతో ప్ర త్యేక పూజలు చేశారు. తదనంతరం నైవేద్యాన్ని భక్తులకు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్య క్రమాల్లో ఆవో శ్రీగిరిరాజు నరసింహబాబు, భక్తులు పాల్గొ న్నారు.

27న ఆరాధన మహోత్సవాలు

పామూరు, సెప్టెంబరు 1: మండంలోని అనుమునిగిరి క్షేత్రంలో వెలసియున్న శ్రీమద్విరాట్ జగద్గురు శివరామబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవ వేడుకలు ఈనెల 27న నిర్వహిస్తున్నట్లు మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు నొస్సం నాగేంద్రచారి ఆదివారం తెలిపారు. ఈసందర్భంగా ఆరాధనకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో శివానందస్వాములు, భక్తులు పాల్గొన్నారు.


ఆనంద ఆశ్రమంలో శ్రావణమాస ప్రత్యేక పూజలు


ఆనంద ఆశ్రమంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

దొనకొండ, సెప్టెంబరు 1: స్థానిక నాలుగు రోడ్ల కూడలిలోని ఆనంద ఆశ్ర మంలో ధర్మకర్త కాకర్ల భైరవానందస్వామి నేతృత్వంలో శ్రావణమాసం ఆఖరి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీపోలేరమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా దేవాలయానికి విచ్చేసిన భక్తులకు ధర్మకర్త అమ్మవారి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





తాడేపల్లి రైల్వే వంతెనల వద్ద కృష్ణమ్మ పరుగులు



వరద ఉధృతికి గండి వద్ద కోతకు గురై పొలాలను ముంచెత్తుతున్న వరద నీరు

వరద.. వణుకు



రేపల్లె : బోటులో పల్లెపాలెంకు చెందిన ప్రజలను సురక్షితప్రాంతాలకు తరలిస్తున్న అధికారులు

- కృష్ణమ్మ మహోగ్రరూపం
- సాగర్‌కు రికార్డు స్థాయిలో వరద
- తెరపిచ్చిన వాన.. ఉధృతంగా వాగులు
- కృష్ణానది కుడి కరకట్టను తాకిన ప్రవాహం
- పలు ప్రధాన మార్గాల్లోనూ నిలిచిన రాకపోకలు
- భయం గుప్పిట్లో నదీ తీర, లంక గ్రామాల ప్రజలు
- ముంపులో ఉమ్మడి గుంటూరు జిల్లాలో లోతట్టు ప్రాంతాలు
- ముంపు ప్రాంతాల్లో కలెక్టర్లు పర్యటన.. సహాయక చర్యల పరిశీలన
- ఎక్కడికక్కడ బాధితులు సురక్షిత, పునరావాస ప్రాంతాలకు తరలింపు
- బ్యారేజీ నుంచి 10.10 లక్షల క్యూసెక్కులకు చేరిన వరద ప్రవాహం

ఆకాశానికి చిల్లుపడిందా.. మేఘాలు ముంచెత్తాయా.. అన్నట్లు వరుణుడు చెలరేగగా.. ఆ ప్రభావం ఆదివారం వరద రూపంలో ముంచెత్తింది. కుంభవృష్టితో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలు చిగురుటాకులా వణికిపోగా ఆదివారం వరుణుడు విరా మం తీసుకున్నాడు. అయినా కృష్ణమ్మ మహోగ్రంగా సాగరం దిశగా పరుగులు తీస్తోంది. కృష్ణమ్మ కన్నెర్రతో తీర ప్రాంత గ్రామాలు, డెల్టాలోని లంకలు, పల్లెవాసులు వణికిపోతున్నారు. ప్రాణ రక్షణతో భీతిల్లిపోతున్న వారిని అధికారులు ఎక్కడికక్కడ సహాయ శిబిరాలకు, పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. వాగులు, వంకలు రోడ్డెక్కగా.. పల్లపు ప్రాంతా లను వర్షపు నీరు చుట్టేసింది. దీంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇక ప్రకాశం బ్యారేజీ నుంచి విడుదలైన నీటి ప్రవాహం లంకలను ముంచేస్తోంది. బ్యారేజ్‌కు ఆదివారం అర్ధరాత్రికి 10.10 లక్షల క్యూసెక్కులు దాటినట్లు అధికారులు తెలిపారు. సోమవారం తలెత్తే ఎలాంటి పరిస్థితులునైనా ఎదుర్కొనేందుకు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, గజ ఈతగాళ్లు అధికారులు సిద్ధం చేశారు. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి పై నుంచి వచ్చే వరద తోడవడంతో నష్ట తీవ్రత భారీగా పెరిగింది.

గుంటూరు, తెనాలి, బాపట్ల, నరసరావుపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా వర్షాలు కురిసిన వర్షాలతో కృష్ణానదితో పాటు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. శుక్ర, శనివారాల్లో కురిసిన వర్షాలతో జనజీవనం అతలాకుతలం కాగా.. ఆదివారం ముంచెత్తుతోన్న వరదతో ప్రజలు భయం గుప్పిట్లో చిక్కుకున్నారు. ఎటు చూసినా నీరే.. వాగులు వంకలు పొంగి పొలాలను ముంచెత్తగా ప్రధాన రహదారులు తటాకాలను మరిపిస్తున్నాయి. పలు కాలనీలు, లంక గ్రామాలు, నదీ తీర గ్రామాలను కృష్ణమ్మ చుట్టేసింది. పలు ప్రాంతాల్లోని పల్లెలు, పట్టణాల్లోని లోతట్టు ప్రాంతాలు కూడా ముంపునకు గురయ్యాయి. రెండురోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఆదివారం తగ్గుముఖం పట్టినా సాగర్ జలాశయం, పులిచింతల, ప్రకాశం బ్యారేజీల నుంచి నీటి ప్రవాహం అసాధారణంగా దిగువకు వస్తోంది. గంటకో విధంగా పెరిగిపోతూ పరవళ్ళు తొక్కుతున్న కృష్ణమ్మ లంక గ్రామాలపై విరుచుకుపడింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల ధాటికి కృష్ణమ్మ మహోగ్రరూపం దాల్చడంతో ప్రకాశం బ్యారేజీ దిగువన ఉన్న లంక గ్రామాలు ముంపు బారిన పడ్డాయి. కట్టలు తెంచుకునేంత ఉగ్రరూపం దాల్చి కృష్ణా కుడి కరకట్టను తాకింది. బ్యారేజ్ దిగువున రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోన్నది.

రాత్రికి బుడమేరు, మున్నేరు వాగుల నుంచి వరద ప్రవాహం మరింతగా వచ్చి చేరే అవకాశం ఉండటంతో నీటి విడుదల 10.50 లక్షల క్యూసెక్కులకు చేరుకునే అవకాశం ఉందని కృష్ణానది సంరక్షక విభాగం అధికారులు తెలిపారు. బ్యారేజ్ వద్ద సాధా రణ రోజుల్లో 11 నుంచి 12 అడుగుల మాత్రమే ఉండే నీటిమట్టం ఇప్పుడు 19.5 అడుగులకు చేరింది. ఇది మరింతగా పెరిగే అవకాశం ఉన్నది. సోమవా రానికి పది లక్షల క్యూసెక్కుల వరద బ్యారేజీ దిగువకు రావొచ్చన్న అంచనాల నేపథ్యంలో సహాయక చర్యలపై అప్రమత్తంగా ఉండేలా సిబ్బందిని అధికారులు ఆదేశిం చారు. కృష్ణానది కుడి కరకట్ట కొన్నిచోట్ల కిందకు జారిపోయి భయపెడుతుంది. మరికొన్ని చోట్ల కట్టలు కోతకు గురై ప్రమాదాన్ని తలపిస్తుంది. 2009లో కృష్ణా నది పోటెత్తిన వరద పరిస్థితులు మళ్లీ పునరావృతం అయ్యేలా ఉన్నాయని లంక గ్రామాల ప్రజలు భయపడుతున్నారు. భారీ వర్షాల ధాటికి పొంగి పొర్లుతున్న వరద ఉధృతిని సీఎం చంద్రబాబు విజయ వాడ నుంచి వస్తూ వారధిపై ఆగి హోంమంత్రి అనితతో కలసి ప్రవా హాన్ని పరిశీలించారు. బీజేపీ ఏపీ అధ్య క్షురాలు, ఎంపీ పురందేశ్వరి బ్యారేజిపై ఆగి వరద ఉధృతిని పరిశీలించారు. మంత్రులు లోకేశ్ మంగళగిరి పరిధిలో నాదెండ్ల మనోహర్ కొల్లిపర మండలంలోని అన్నవరపు లంకలో పర్యటించారు. కొల్లూరు మండలం పెసర్లంక అరవింద వారధి గండి వద్ద పోసిన కట్టను పరిశీలించారు. లంక గ్రామాల్లో పర్యటించి 10.50 లక్షల క్యూసెక్కుల వరకు వరద వచ్చే అవకాశాలు ఉన్నాయని ప్రజలంతా గ్రామాలను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలు, పునరావాస కేంద్రాలకు తరలి రావాలని సూచించారు. కొల్లూరు మండలం పెసర్లంక అరవింద వారధి ఎగువన గండి వద్ద పోసిన కట్టపై నుంచి వరద నీరు పొంగి పొర్లడం, క్రమేపి వరద ఉధృతి ఎక్కువ కావడంతో కట్ట కోతకు గురై ఒక్కసారిగా నీరు పెసర్లంక వైపు విరుచుకుపడి క్షణాల్లో కొల్లూరు కరకట్టను తాకింది. మధ్యలో నక్కపాయ వద్ద రహదారి వరద ఉధృతికి కొట్టుకుపోయింది. కొల్లూరు కరకట్ట దిగువన లంక గ్రామాలకు వెళ్లే రహదారిపై సైతం వరద నీరు ప్రవహించడంతో ఆ మార్గంలో రాకపోకలను పోలీసులు నిలిపి వేశారు.

చెరువులను తలపిస్తోన్న చేలు

భారీ వర్షాలు, వరదతో పొలాలు కూడా ముంపునకు గురయ్యాయి. వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పొల్లాల్లో నీరు బయటకు పోయే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. చాలా చోట్ల పైర్లు పూర్తిగా నీటమునిగి పొలాలు చెరువుల ను తలపిస్తుండడంతో నష్టం అంచనాపై ఇంకా కచ్చితమైన అంచనాలను వ్యవసాయ శాఖ వెల్లడించలేక పోతోంది. నాట్లు వేసిన వరి పొలాలు కూడా నీటిలో నానుతున్నాయి. మిరప, పత్తి తదితర పంటలు ఉరకెత్తే ప్రమాదం నెలకొంది. పత్తి, మిరప, పొగాకు,వరి, కంది పంటలకు భారీగానే నష్టం వాటిల్లింది. రేపల్లె, నగరం, కొల్లూరు, బాపట్ల, కర్లపాలెం, చెరుకుపల్లి పరిధిలో పైర్లకు భారీగా నష్టం వాటిల్లింది.

గేట్లెత్తేశారు..

నాగార్జునసాగర్ జలాశయానికి రికార్డు స్థాయిలో వరద నీరు వచ్చిచేరుతోంది. 5,61,364 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా అన్ని క్రస్ట్ గేట్లను 15 అడు గుల మేర ఎత్తి 5,77,786 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. భారీగా నీటి విడుదలతో జలాశయం దిగువ ప్రాంతవాసులను అధికారులు అప్రమత్తం చేశారు. సాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజీల నుంచి నీటి విడుదల ఇంకా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. సాగర్‌లో ప్రస్తుతం 308.17 టీఎంసీల నీటి నిల్వ ఉంది. పులిచింతలకు 6,84,800 లక్షల క్యూసెక్కుల వరద చేరుతుండగా ప్రకాశం బ్యారేజ్‌కు 6,74,800 కూసెక్కులను విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజ్ ఎగువున ఉన్న డ్యాంలతో పాటు మున్నేరు, బుడమేరు వాగుల నుంచి ఉధృతంగా వరద ప్రవహిస్తుండటంతో ప్రమాదకర పరిస్థితి నెలకొన్నది. ఆదివారం మధ్యాహ్నం వరకు 7 లక్షల క్యూసెక్కుల వరకు వస్తున్న వరద సాయంత్రానికి అది 9.2 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. మునేరు నుంచి 2.40 లక్షలు, పాలేరు నుంచి మరో 70 వేల క్యూసెక్కుల వరద బ్యారేజికి వచ్చి చేరుతోంది. దీంతో శనివారం నుంచే బ్యారేజి దగ్గర 70 గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్టే సముద్రంలోకి వదిలేస్తున్నారు. ఆది వారం మధ్యాహ్ననికి వరద పెరిగి ఒకేసారి 8.27 లక్షల క్యూసెక్కులకు చేరింది. మునేరు నుంచి వచ్చే వరద 3 లక్షలకు చేరుతుందనేది నీటిపారుదల శాఖ అధికారుల అంచనా. సోమవారం ఉదయానికి 10.50 లక్షల క్యూసెక్కులకు పైగానే వరద పెరి గే ప్రమాదం ఉంటుందని అంచనా.

అరవింద వారధి వద్ద గండి..



అరవింద వారధి వద్ద వరద ఉధృతి పరిశీలిస్తున్న మంత్రి మనోహర్, ఎస్పీ తుషార్‌డూడీ

అరవింద వారధి దగ్గర నక్కపాయకు వేసిన అడ్డుకట్టకు గండి పడటంతో నీరంతా పల్లపు భూముల్లోకి చేరింది. ప్రవాహ ఉధృతితో అడ్డగండీ దగ్గర రోడ్డు మార్గానికి కోతపడింది. కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల పరిధిలో దాదాపు 24 గ్రామాల ప్రజలకు వరద ముంపు పొంచి ఉంది. కొల్లూరులో శనివారం అర్ధరాత్రి నుంచి కలెక్టర్ వెంకటమురళితో పాటు స్పెషల్ ఆఫీసర్ శేషగిరిబాబు, ఎస్పీ తుషార్ డూడీ మకాం వేసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. కృష్ణానది తీవ్రరూపం దాల్చడంతో జిల్లాలోని లంకగ్రామాలు వరద గుప్పిట్లో చిక్కుకోవడంతో పరిస్థితిని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆదివారం రాత్రి బాపట్లలోనే ఉండి సమీక్షించారు. వారధి వద్ద గండిపడడంతో చుట్టూ ఉన్న గ్రామాలకు పెను ముప్పు నెలకొని ఉండడంతో ఏ క్షణాన ఏం జరుగుతోందనన్న ఆందోళనలో ఆయా గ్రామాల ప్రజలు ఉన్నారు. లంకల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి 20 కేంద్రాలను సిద్ధం చేసి, వాటిలో 20,000 మంది ఉండేలా చర్యలు చేపట్టారు. వరద ప్రభావితమయ్యే లంక గ్రామాల పరిధిలో 40 జనరేటర్లను సిద్ధం చేశారు. రహదారుల కోతతో ప్రజలను, నిత్యావసరాలను తరలించడానికి 40 బోట్లు సిద్ధంగా ఉంచారు. కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల పరిధిలోని దాదాపు 30 గ్రామాలకు వరద ముంపు పొంచి ఉండడంతో వారిని అప్రమత్తం చేసి పునరావాస కేంద్రాలకు తరలించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. రేపల్లె మండల పరిధిలోని పెనుమూడి, బొబ్బర్లంక, లంకెవానిదిబ్బ గ్రామాలకు చెందిన 350 మందిని ఇప్పటికే శిబిరాలకు తరలించారు.

అర్ధరాత్రికి నీటి ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తదనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 48,000 ఎకరాల్లో పంట నీటమునిగినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చింది. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ కర్లపాలెం మండల పరిధిలో ముంపు బారిన పడిన పొలాలను పరిశీలించి రైతులకు ధైర్యం చెప్పారు. ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు లంకల్లో వరద పరిస్థితిని సమీక్షిస్తున్నారు. కొల్లూరు మండలం ఈపూరులంక దగ్గర చప్టాపైకి వరద నీరు చేరింది. వరద డ్యూటీ వేసిన వారిలో ఇద్దరు అధికారులు కనిపించకపోవటంతో కలెక్టర్ వారి సస్పెన్షన్‌కు ఆదేశాలు జారీ చేశారు. మరో 8 మందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొల్లిపర మండలం వల్లభాపురం దగ్గర నది మధ్యలో దిబ్బలపై గొర్రెలతో చిక్కుకుపోయిన కాపరులను పోలీసులు పడవల సాయంతో గట్టుకు తీసుకొచ్చారు. కొల్లూరు మండలం రావిలంక నది మధ్యలో చిక్కుకున్న 30 మందిని కృష్ణా జిల్లా వెలువోలుకు తరలించారు. బాపట్ల మండలం నందిరాజుతోట-హైదర్‌పేట మధ్య నల్లమడ డ్రెయిన్‌పై ఉన్న పాతబ్రిడ్జి వరద ఉధృతికి కిందకు కుంగింది. సంతమాగులూరు మండల పరిధిలోని చవిటిపాలెం, గురిజేపల్లి మధ్యలో ఉన్న బ్రిడ్జిపై వరద ప్రవాహంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలు స్థంభించాయి.

● బాపట్ల జిల్లాకు ఆరెంజ్ హెచ్చరిక

గుంటూరు, పల్నాడుకు రెడ్అలర్ట్

వర్షం తెరిపిచ్చింది కదా అని గుంటూరు, పల్నాడు ప్రజలు ఊపిరి పీల్చు కుంటున్న తరుణంలో వాతావరణ శాఖ పిడుగు లాంటి హె చ్చరిక జారీ చేసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం శనివా రం అర్ధరాత్రి కళింగపట్నం సమీపంలో తీరం దాటిన విషయం తెలిసిందే. అయితే తీరం దాటిన తర్వాత ఈ వాయుగుండం జగదల్‌పూర్‌కు ఆగ్నేయంగా 60 కిలోమీటర్లు, విశాఖకు వాయువ్యంగా 120 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇది క్రమంగా దక్షిణ ఒడిశా- విదర్భ చేరుకుని బలహీనపడుతుందని అధికారులు తెలిపారు. ఈ ప్రభావంతో ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా సోమవారం విస్తారంగా వర్షాలు కురుస్తాయని అధికారులు ప్రకటించారు. దీంతో గుంటూరు, పల్నాడు జిల్లాలకు రెడ్ అలర్ట్, బాపట్ల జిల్లాకు ఆరెంజ్ అలర్ట్‌ని జారీ చేశారు. తీరం వెంట బలమైన గాలులు వీస్తాయని, మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని సూచించారు. ఈ కారణంగానే ప్రభుత్వం స్కూళ్లు, కళాశాలలకు సోమవారం సెలవు దినాన్ని ప్రకటిం చినట్లు జిల్లా అధికారులు తెలిపారు. ఏ ఒక్క ప్రైవేట్ పా ఠశాల నిర్వహించకూడదని ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు.



భట్టిప్రోలు లంక గ్రామాల్లో ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీ కృష్ణ ప్రసాద్

పలు రైళ్లు దారిమళ్లింపు.. కొన్ని రద్దు

గంటల తరబడి రెగ్యులర్ రైళ్లు ఆలస్యం

భారీ వర్షాలు, ముంచెత్తుతోన్న వరదతో కొన్ని రైళ్లను దారిమళ్లించగా, మరి కొన్నింటిని అధికారులు ఏకంగా రద్దు చేశారు. పలు రైళ్లను గుంటూరు డివిజన్ పరిధిలోని నడికుడి మార్గంలో దారి మళ్లించారు. ఖమ్మం, వరంగల్ జిల్లా ల్లో మెయిన్ లైన్ దెబ్బతినడంతో దూర ప్రాం తాలకు వెళ్లాల్సిన, అక్కడి నుంచి వస్తున్న రైళ్లను విజయవాడ నుంచి గుంటూరు మీదగా దారి మళ్లిం చారు. కొన్నింటిని అయితే జగ్గయ్యపేట నుంచి మేళ్లచెరువు మీదగా విష్ణుపురం తీసుకొచ్చి అక్కడి నుంచి గుంటూరు, సికింద్రాబాద్ వైపుకు మళ్లించారు. దీంతో ఆదివారం ఈ మార్గం 200 శాతం కెపాసిటీని దాటింది. 11019 సీఎస్ఎంటీ ముం బై - భువనేశ్వర్, 11020 భువనేశ్వర్ - సీఎస్ఎంటీ ముంబై, 18519 విశాఖపట్టణం - ఎల్‌టీటీ రైళ్లను పగడిపల్లి, నడికుడి, గుంటూరు మార్గంలో నడిపింది. 12709 గూడూరు - సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌ని మహబూబాబాద్-పగిడిపల్లి మీదగా సికింద్రా బాద్‌కు, 12749 మచిలీపట్నం - బీదర్, 12763 తిరుపతి - సికింద్రాబాద్, 12861 విశాఖ- మహబూబ్‌నగర్, 12699 చెన్నై- చాప్రా, 12737 కాకినాడపోర్టు - లింగంపల్లి, 12760 హైదరాబాద్ - తాంబరం, 12862 మహబూబ్‌నగర్ - విశాఖ, 12740 సికింద్రా బాద్ - విశాఖ, 12968 జైపూర్ - చెన్నై సెంట్రల్ రైళ్లను కూడా ఈ మార్గంలోనే దారి మళ్లించారు. దీంతో ఈ మార్గంలో రెగ్యులర్ రైళ్లు గంటల తరబడి ఆలస్యంగా గమ్య స్థానాలకు చేరుకున్నాయి.

నేడు నాలుగు ఎక్స్‌ప్రెస్‌ల రద్దు

సికింద్రాబాద్ నుంచి గుంటూరుకు రాకపోకలు సాగించే గోల్కొండ, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను సోమవారం పూర్తిగా రద్దు చేశారు. 12787 నరసపూర్ - నాగర్‌సోల్, 18046 హైదరాబాద్ - షాలిమార్ ఎక్స్‌ప్రెస్‌లను సోమవారం గుంటూరు మీదగా దారి మళ్లిస్తున్నట్లు తెలిపారు. 17255 నరసపూర్ - లింగంపల్లి ఎక్స్‌ప్రెస్, 17016 సికింద్రాబాద్ - భువనేశ్వర్ విశాఖ ఎక్స్‌ప్రెస్‌లను ఆదివారం రెండు గంటల ఆలస్యంగా రీషెడ్యూల్ చేశారు. విజయవాడలో రైలు పట్టాలు దెబ్బతిన్న కారణంగా మచిలీపట్నం - ధర్మవరం, నరసపూర్ - లింగంపల్లి ఎక్స్‌ప్రెస్‌లను ఆది, సోమ వారాల్లో రద్దు చేశారు. ఈ నెల 2,3 తేదీల్లో 07783 విజయవాడ - గుంటూరు, 07779 గుంటూరు - మాచర్ల, 07580 మాచర్ల - నడికుడి, 07579 నడికుడి-మాచర్ల, 07780 మాచర్ల-గుంటూరు, 07788 గుంటూరు - విజ యవాడ, 07276 కాచీగూడ - మిర్యాలగూడ, 07277 మిర్యాలగూడ - నడికుడి రైళ్లను రద్దు చేశారు. ఈ నెల 2, 3, 4 తేదీల్లో 07973 నడికుడి - మిర్యాలగూడ, 07974 మిర్యాలగూడ - నడికుడి రైళ్లను కూడా రద్దు చేశారు.



లంక గ్రామాల ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి



లంక గ్రామాల్లో అరటి గెలలను ఒడ్డుకు చేర్చుకుం టున్న రైతు





● కంద, అరటి అంతర్‌పంటలో చేరిన వరద నీరు



చెరుకుపల్లి : చెరువులను తలపిస్తున్న వరినాటిన పంటపొలాలు

బాపట్ల జిల్లాలో.. 105 మీమీ

జిల్లాలో ఆదివారం సాయంత్రానికి సగటు వర్షపాతం 105 మీమీ నమోదు కాగా మొత్తంగా 2700 మిల్లీమీటర్ల వర్షం పడింది. మండలాల వారీగా వర్షపాతం..

చుండూరు	172.4
నగరం	143.4
సంతమాగులూరు	122.6
అమర్తలూరు	139
వేమూరు	118.4
కొల్లూరు	107.4
చెరుకుపల్లి	108.4
పిట్టలవానిపాలెం	105.4
కర్లపాలెం	142.2
నిజాంపట్నం	116.2
కారంచేడు	102.8
అద్దంకి	111.4
వేటపాలెం	117
బాపట్ల	84.6



● రేపల్లె: మోర్తోట ముక్తేశ్వరస్వామి ఆలయంలో భారీగా చేరిన వరదనీరు



బాపట్ల మండలం మూలపాలెం గ్రామంలో నీటమునిగిన పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



కర్లపాలెం : దమ్మనవారిపాలెంలో పాడైపోయిన వరిపైరును చూపిస్తున్న రైతులు



పడవను మెరక ప్రాంతానికి తెచ్చుకుంటున్న మత్స్యకారులు

ఆగిన వర్షం

● ఊపిరిపీల్చుకున్న మత్స్యకారులు

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు1 : వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న వర్షాలు ఆదివారం ఉదయానికి కొంతమేర తగ్గుముఖం పట్టాయి. దీంతో మత్స్యకారులు ఊపిరి పీల్చుకున్నారు. కొందరు తమ పడవలను మెరక ప్రాంతానికి తెచ్చుకున్నారు. మరలా వర్షం కురిసినా ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అయితే ఎక్కడా తుఫాన్ షెల్టర్లలో ఉండేందుకు మత్స్యకారులు ఇష్టపడలేదు. పెద్దగా నష్టమేమీ లేదని చెప్పారు. వేట ఆగడం ఒక్కటే ప్రతిబంధకంగా మారిందన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు తీరప్రాంత పరిస్థితిని తెలుసుకుంటూ అవసరమైతే అన్ని సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారు.

మునిగిన పడవ

వాడరేవుకు చెందిన ముగ్గురు మత్స్యకారులు శనివారం సముద్రంలో వేటకు వెళ్లారు. తిరిగి వచ్చే సమయంలో వారి బోటుకు రంధ్రం ఏర్పడింది. దీంతో బోటును అక్కడే లంగరు వేసి వేరే బోటులో మత్స్యకారులు ఒడ్డుకు చేరారు. ఈ క్రమంలో ఆదివారం వైజాగ్‌కు చెందిన మత్స్యకారుల సహాయంతో సముద్రంలోకి వెళ్లగా బోటు మునిగింది. కొన్ని గంటలపాటు శ్రమించి ఆ బోటును ఒడ్డుకు చేర్చారు. ఘటనా స్థలాన్ని ఈపురుపాలెం ఎస్సై శివకుమార్ పరిశీలించారు. మత్స్యకారులతో మాట్లాడారు.



అద్దంకి భవానిసెంటర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న ఎస్సై ఖాదర్‌బాషా

రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలి

అద్దంకి, సెప్టెంబరు 1 : రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని ఎస్‌ఐ ఖాదర్‌బాషా అన్నారు. ఆదివారం స్థానిక భవానీ సెంటర్‌లో స్థానికులతో ఎస్‌ఐ రోడ్డు ప్రమాదాల నివారణకు పాటించాల్సిన నియమాలు గురించి అవగాహన కల్పించారు. అనంతరం దర్శి రోడ్డులో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వ్యక్తులను గుర్తించి కౌన్సెలింగ్ నిర్వహించారు.

ట్రాన్స్‌'ఫార్మర్‌' వెతలు

అటు దొంగలు.. ఇటు కరెంటోళ్ల దోపిడీ

విద్యుత్ శాఖలో ఇదీ పరిస్థితి

ఇష్టారీతిన పొలాల్లో చోరీలు

నాలుగేళ్లలో 385 ట్రాన్స్‌ఫార్మర్లు

అవన్నీ ఎక్కువగా ఎత్తిపోతలవే

మిగతావి వ్యవసాయ బోర్లవి

మరోవైపు సిబ్బంది లంచాల బాదుడు

విలవిల్లాడిపోతున్న కర్షకులు

కనెక్షన్ కోసం రైతు నుంచి రూ.20వేలు

తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ లైన్‌మన్

ఒంగోలు రూరల్ మండలం ఉలిచిలోని తారకరామ ఎత్తిపోతల కింద వెయ్యి ఎకరాల ఆయకట్టు ఉంది. ఆ పథకం కోసం 240కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దానిని జూలై 4న దొంగలు పగులగొట్టి రాగి తీగను ఎత్తుకెళ్లారు. ఆ ట్రాన్స్‌ఫార్మర్ ఖరీదు రూ.8లక్షలు. ఇంతవరకూ కొత్తది బిగించలేదు. దీంతో సాగుకు రైతులు ఇబ్బంది పడుతున్నారు. అదే మండలంలోని చేజర్ల గ్రామంలోని చేజర్లమ్మ ఎత్తిపోతల పథకం కింద 700 ఎకరాల ఆయకట్టు ఉంది. ఆ పథకానికి 160కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దానిని కూడా జూలై 3నే దొంగలు పగులగొట్టారు. దీంతో పంటల సాగుకు ఇబ్బందికరంగా మారింది.

రాచర్ల మండలం అనుమలవీడు గ్రామానికి చెందిన వాకా కిరణ్ అనే రైతు తన వ్యవసాయ భూమిలో బోరు ఏర్పాటు చేసుకున్నారు. అందుకు అవసరమైన విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. రూ.20వేలు లంచం ఇస్తేనే కనెక్షన్, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని లైన్‌మన్ రామలింగయ్య డిమాండ్ చేశాడు. రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా రామలింగయ్య రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు.

విద్యుత్ సిబ్బంది ధనదాహం, దొంగల చేతివాటంతో రైతులు విలవిల్లాడుతున్నారు. ఒకవైపు అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది కుమ్మక్కై అందిన కాడికి దోచుకుంటున్నారు. ప్రతి పనికీ రేటు నిర్ణయించి వసూళ్ల పర్వం సాగిస్తున్నారు. విద్యుత్ కనెక్షన్లు మొదలు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, లైన్‌ల మార్పు వంటి వాటికి కాసులు పడితేనే కదులుతున్నారు. అందరూ కలిసి రైతులను జలగల్లా పీక్కుతుంటున్నారు. ఇంకోవైపు జిల్లావ్యాప్తంగా ఎత్తిపోతల పథకాలు, పొలాల్లో వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌ల చోరీలు గత వైసీపీ పాలనలో పెచ్చరిల్లాయి. నాలుగేళ్లలో 385కుపైగా ట్రాన్స్‌ఫార్మర్లు దొంగల పాలయ్యాయి. దీంతో రైతులు పంటల సాగుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బంది, అధికారుల తీరుపై వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దొంగల పాలైన ట్రాన్స్‌ఫార్మర్‌ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడంలో తాత్సారం చేస్తుండటంతో దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

ఒంగోలు (క్రైం), సెప్టెంబరు 1 : జిల్లాలో విద్యుత్‌శాఖ అధికారుల తీరు కర్షకులను కన్నీరు పెట్టిస్తోంది. వారి అవినీతికి అంతులేకుండా పోయింది. అదేసమయంలో దొంగలు స్వైరవిహారం చేస్తున్నారు. పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్‌లను రాత్రికి రాత్రి పగులగొట్టి రాగితీగ, ఇతరత్రా సామగ్రిని కొల్లగొడుతున్నారు. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. విద్యుత్ శాఖలో పనిచేసే కొందరు సంస్థకు రావాల్సిన ఆదాయానికి కూడా గండి కొట్టి సొంతలాభం కోసం పాకులాడుతున్నారు. గత ప్రభుత్వంలో జరిగిన అవకతవకలు పునరావృతం కాకూడదని ప్రభుత్వ పెద్దలు మొత్తుకుంటున్నా అధికారులు, సిబ్బంది తీరు మాత్రం మారడం లేదు. రైతుల అవసరాన్ని ఆసరా చేసుకొని అందినకాడికి దోచుకుంటున్నారు.

నాలుగేళ్లలో రూ.5కోట్లకుపైన విలువైన ట్రాన్స్‌ఫార్మర్‌లు చోరీ

ఉమ్మడి జిల్లాలో రైతుల కోసం పొలాల్లో ఏర్పాటు చేసిన 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 2020 నుంచి ఇప్పటి వరకూ 385 చోరీకి గురయ్యాయి. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ ఖరీదు రూ.లక్షకుపైనే ఉంటుంది. ఆప్రకారం జిల్లాలో దొంగల పాలైన ట్రాన్స్‌ఫార్మర్‌ల విలువ సుమారు రూ.4కోట్లకుపైనే ఉంటుంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకూ 60 ట్రాన్స్‌ఫార్మర్లు ఉమ్మడి జిల్లాలో చోరీకి గురయ్యాయి. ఎత్తిపోతల పథకాలకు సంబంధించి 250కేవీ నుంచి 500కేవీ వరకూ ఉంటాయి. వీటి విలువ రూ.5 నుంచి రూ.10లక్షల వరకూ ఉంటుంది. అవి కూడా పెద్ద సంఖ్యలోనే దొంగల పాలయ్యాయి. ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి అందులో ఉండే లక్షల రూపాయల విలువైన రాగి తీగను దొంగలు లాగేసి కేవలం రూ.10వేల నుంచి రూ.20వేలకు విక్రయిస్తున్నట్లు సమాచారం. దీంతో రైతుల వెతలు వర్ణనాతీతమయ్యాయి. సకాలంలో పంటలు సాగు చేయలేకపోతున్నారు. వేసిన పంటలకు నీరందక ఎండిపోతున్నాయి. దీంతో రైతులు పెట్టుబడుల తోపాటు రూ.కోట్లలో రాబడిని కోల్పోతున్నారు.

లంచం ఇస్తేనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్

పొలాల్లో ట్రాన్స్‌ఫార్మన్ చోరీకి గురైందని పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న రైతులు కొత్తదాని కోసం విద్యుత్ శాఖ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. నిబంధనల ప్రకారం రైతులు ట్రాన్స్‌ఫార్మర్ కోసం దరఖాస్తు చేసుకున్న నెలకు విద్యుత్ అధికారులు ఏర్పాటు చేయాలి. చోరీ జరిగితే అందుకు సంబంధించిన ఎఫ్‌ఐ

ఆర్
కా పీ ని
అందజేసిన 24
గంటల్లో కొత్తదాన్ని
ఉచితంగా బిగించాలి. కానీ అలా జరగడం లేదు. నెలలు గడిచినా అధికారులు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం లేదు. పైగా ఒక్కోదానికి భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఇలా ఉద్యోగులకు లంచాలు, ఏర్పాటు చేసిన తరువాత చోరులతో రైతులు అల్లాడుతున్నారు. దీంతోపాటు కొత్త వ్యవసాయ కనెక్షన్ ఇవ్వాలన్నా, లైన్ మార్చాలన్నా సిబ్బంది చేయి తడపాల్సిందే. వారు అడిగినంత ముట్టచెప్తేనే పనిచేస్తున్నారు. లేకుంటే ముప్పుతిప్పలు పెడుతున్నారు. రైతులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా కనికరించని పరిస్థితి నెలకొంది.

ఏసీబీకి చిక్కిన లైన్‌మన్

రాచర్ల మండలం అనుమలవీడులో వ్యవసాయ కనెక్షన్ ఇచ్చేందుకు రూ.20వేలు లంచం తీసుకుంటూ లైన్‌మన్ రామలింగయ్య శుక్రవారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. అనుమలవీడు గ్రామానికి చెందిన వాకా కిరణ్ అనే రైతు తన వ్యవసాయ భూమిలో బోరు ఏర్పాటు చేసుకున్నారు. అందుకు అవసరమైన విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకొన్నారు. రూ.20వేలు లంచం ఇస్తేనే విద్యుత్ కనెక్షన్, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని లైన్‌మన్ రామలింగయ్య తేల్చిచెప్పాడు. అసలే వర్షాలు కురవక, పంటలు పండక అప్పోసొప్పో చేసి బోరు వేయించుకున్నానని, అంత డబ్బు ఇవ్వలేనని రైతు బతిమాలినా వినలేదు. దీంతో రైతు కిరణ్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి సూచన మేరకు రైతు లైన్‌మన్‌కు ఫోన్ చేయగా పొలానికి వచ్చి రూ.20వేలు తీసుకున్నాడు. అప్పటికే అక్కడ మాటు వేసి ఉన్న ఏసీబీ అధికారులు ఆయన్ను పట్టుకున్నారు. దర్శి మండలం రాజంపల్లిలో టి.లక్ష్మానాయక్ లైన్‌మన్ రైతు పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడానికి లంచం తీసుకుంటూ గతంలో ఏసీబీకి పట్టుబడ్డాడు. ఇలాంటి సంఘటనలు అనేకం చోటుచేసుకున్నాయి. అయినప్పటికీ సిబ్బంది తీరు మారడం లేదు.

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలపై ఎస్పీ సీరియస్

ఎస్పీగా దామోదర్ బాధ్యతలు తీసుకున్న కొద్ది రోజులకే జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలపై విద్యుత్ శాఖ ఎస్‌ఈ ఆయన్ను కలిసి ఫిర్యాదు చేశారు. దీన్ని ఎస్పీ సీరియస్‌గా తీసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాల కేసులను వేగవంతంగా దర్యాప్తు చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో కదిలిన పోలీసులు నెలరోజుల్లోనే 60 కేసుల్లో నిందితులను అరెస్టు చేసి జైలుకు పంపారు.

అవినీతికి పాల్పడితే శాఖాపరమైన చర్యలు

-కె.వి.జి.సత్యనారాయణ,విద్యుత్‌శాఖ ఎస్‌ఈ

విద్యుత్‌శాఖ సిబ్బంది అవినీతికి పాల్పడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. రైతులకు వేగవంతంగా సేవలు అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశాం. పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్‌ల కోసం వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా చూడాలని ఏఈ, ఈఈలను ఆదేశించా. అలాగే రైతులు దరఖాస్తు చేసుకున్న వెంటనే అంచనాలు తయారు చేయాలని అధికారులకు సూచించాం. ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు నివారించేందుకు చర్యలు చేపట్టాం. దీనిపై ఎస్పీకి ఫిర్యాదు చేశాం. విద్యుత్ శాఖ సిబ్బందితోపాటు రైతులను కలుపుకొని రాత్రుళ్ల గస్తీ చేస్తున్నాం.



మూలనపడిన చేజెర్ల ఎత్తిపోతల పథకం

అధికారులు సహకరించడం లేదు

- పమిడి వెంకటేశ్వరరావు, పొందూరు ఎల్‌ఐ స్కీం అధ్యక్షుడు

మా పథకానికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీగ, ఇతర పరికాలు మూడు నెలల క్రితం చోరీకి గురయ్యాయి. పోలీసులకు ఫిర్యాదు చేశాం. ఐడీసీ అధికారులను కలిసి విషయం తెలిజేశాం. ట్రాన్స్‌కో అధికారులకూ విన్నవించాం. కానీ ఎవ్వరూ సహకరించలేదు. ఇప్పటి వరకూ కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయలేదు. ఇప్పుడు పంటల సాగుకు సమయం మించిపోతోంది. దీంతో రైతులమంతా సొంతంగా డబ్బులు వేసుకొని కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించుకోవాలని నిర్ణయించుకున్నాం.

ట్రాన్స్‌ఫార్మర్‌ల చోరీతో ఇబ్బందులు

- తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, శ్రీ ఆంజనేయ ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు, నెన్నూరుపాడు

నెన్నూరుపాడులో ముసి ఆధారంగా మూడు ఎత్తిపోతల పథకాలున్నాయి. శ్రీ ఆంజనేయ ఎత్తిపోతల పథకం కింద దాదాపు 260 ఎకరాల ఆయకట్టు ఉంది. దీనికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌ను రెండు నెలల క్రితం దొంగలు పగులగొట్టి రాగితీగ చోరీ చేశారు. మరో రెండు ఎత్తిపోతల పథకాలకు కలిపి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను కూడా చోరీ చేశారు. ఈ విషయమై రెండు నెలల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశాం. ఇప్పటి వరకూ ట్రాన్స్‌ఫార్మర్‌లు రాలేదు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైంది. ఏం చేయాలో దిక్కుతోచడం లేదు.

సాగుపై సందిగ్ధంలో ఉన్నాం

- గద్దె వెంకటకృష్ణ, చేజర్ల ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు, ఒంగోలు రూరల్ మండలం

చేజర్ల ఎత్తిపోతల పథకం కింద 700 ఎకరాల ఆయకట్టు ఉంది. జూన్ 3వతేదీన పథకానికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీగను దొంగలు చోరీ చేశారు. దీనిపై ఒంగోలు తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశాం. ఇప్పటి వరకూ కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం వరినాట్లు వేసుకునే సీజన్. అయితే నీరు అందే పరిస్థితి లేకపోవడంతో సాగుపై సందిగ్ధంలో ఉన్నాం. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రూ.10లక్షలు విద్యుత్‌శాఖకు చెల్లించాలంటున్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలు స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలి.

ముంచెత్తిన వాన

48 గంటల్లో 90.1మి.మీ వర్షపాతం

పశ్చిమప్రాంతంలో అధికం

పొంగిన వాగులు,వంకలు

పలుచోట్ల రవాణాకు అంతరాయం

గుండ్లకమ్మ నాలుగు గేట్లు ఎత్తివేత

ఇతర వనరులకూ భారీగానే చేరిక

సాగుకు ఉపయుక్తం

అధికారులతో కలెక్టర్ అన్సారియా టెలికాన్ఫరెన్స్

తక్షణ చర్యలకు ఆదేశం



గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్లు ఎత్తి నీటిని బయటకు వదిలివేసిన దృశ్యం

ఒంగోలు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాను వర్షం ముంచెత్తింది. చాలాకాలంగా వానలు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజానీకానికి ఊరట కలిగించింది. 48 గంటల వ్యవధిలో ఏకంగా 90.01 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. దాదాపు సగం మండలాల్లో 100 నుంచి 170 మి.మీ కురిసింది. జిల్లా అంతటా ఈ వర్షాలు వ్యవసాయానికి, తాగునీటికి మేలు చేశాయి. పలు చోట్ల వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తుండటంతో రవాణాకు అంతరాయం కలిగింది. గుండ్లకమ్మకు భారీగా వరద నీరు రావడంతో నాలుగు గేట్లు వచ్చినది వచ్చినట్లు దిగువకు వదులుతున్నారు. ఇంతకు మించి వర్షాలు కురిస్తే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.

పంటలకు జీవం.. ఖరీఫ్ సాగుకు ఊతం

దాదాపు నెలన్నర నుంచి జిల్లాలో సరైన వర్షం లేక ఖరీఫ్ సీజన్ ముందుకు సాగలేదు సుమారు 2.02 లక్షల హెక్టార్ల ఖరీఫ్ సాధారణ విస్తీర్ణంలో కేవలం 31శాతంలో మాత్రమే పంటలు సాగయ్యాయి. అందులోనూ పలుచోట్ల వర్షాలు లేక ఎండుముఖం పట్టాయి. ఆగస్టు నెలలోనూ ఎండల తీవ్రత అధికంగా ఉండటంతోపాటు చాలా చోట్ల తాగునీటికి ఇక్కట్లు తప్ప లేదు. ఈ పరిస్థితుల్లో వాయుగుండం ప్రభావంతో జిల్లాలో గురువారం అర్ధరాత్రి నుంచి వర్షం ప్రారంభమైంది. ఇది ప్రస్తుతం పొలాల్లో ఉన్న పైర్లకు జీవం పోసిన ఈవర్షం రానున్న రోజుల్లో పంటల సాగుకు ఉపకరించనుంది.

పశ్చిమప్రాంతంలో

జిల్లాలోని తూర్పు ప్రాంతంలో పోల్చితే పశ్చిమప్రాంతంలో వర్ష ప్రభావం అధికంగా ఉంది. నల్లమల ఆటవీ ప్రాంతంలో భారీ వర్షాలు కురవడంతో మార్కాపురం డివిజన్‌లోని ఆటవీ సమీప మండలాల్లో ఉన్న గుండ్లకమ్మ ఉధృతంగా ప్రవహిస్తోంది. పలు వాగులు, వంకలు పొంగాయి. గుండ్లకమ్మ, జంపలేరులోకి వస్తున్న నీరు కంభం చెరువుకు భారీగా చేరుతోంది. దోర్నాల ప్రాంతంలో నల్లమల నుంచి భారీగా నీరు వస్తూ తీగలేరు పొంగి ప్రవహిస్తుండగా సప్లయ్ చానల్ ద్వారా మార్కాపురం చెరువుకు పెద్దఎత్తున నీరు చేరుతోంది. పెద్దారవీడు మండలంలోని రామాయపాలెం వద్ద నల్లవాగు వర్షపు నీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది. తీగలేరు ఉధృతితో మార్కాపురం-దోర్నాల మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. అక్కడ పోలీసులు పికెట్ ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను మళ్లించారు. ఇతర పలు గ్రామాల మధ్య ఇలాంటి పరిస్థితే కనిపించింది.

లోతట్టు ప్రాంతాలు జలమయం

వర్షాలతో పలుచోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అక్కడక్కడా ఇళ్లు కూలాయి. మార్కాపురం మండలం తిప్పాయపాలెంలో గృహాల మధ్య నీరు చేరి ప్రజలు అవస్థ పడ్డారు. త్రిపురాంతకం మండలం గణపవరం వద్ద ఎస్సీ కాలనీలో రేకుల షెడ్డు పడిపోయింది. కురిచేడు మండలం గంగదొనకొండలో పాపిరెడ్డి అనే వ్యక్తికి చెందిన పాతమిద్దె కూలిపోయింది. ఆ సమయంలో అందులో ఎవ్వరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్

జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం పగలు కూడా జల్లులు పడ్డాయి. ఈనేపథ్యంలో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ తమీమ్ అన్సారియా టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. పారిశుధ్య చర్యలపై తక్షణం దృష్టి పెట్టాలని ఆదేశించారు. తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రవాణా, విద్యుత్ సరఫరాకు ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. పలు ప్రాంతాల్లో అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి వర్షాల వల్ల నష్టాలు జరగకుండా సిబ్బందిని అప్రమత్తం చేశారు.

గుండ్లకమ్మ ప్రాజెక్టులోకి భారీగా నీరు

మద్దిపాడు : అల్పపీడనం ప్రభావంతో ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు గుండ్లకమ్మ ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు గరిష్ఠ నీటి మట్టం 34.38 మీటర్లు కాగా ప్రస్తుతం 20.90 మీటర్ల మేర నీరు చేరింది. ఇన్‌ఫ్లో 18వేల క్యూసెక్కులు ఉండగా అధికారులు నాలుగు గేట్లను ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు వదులుతున్నారు.

పంటలకు స్వల్ప నష్టం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు స్వల్పంగా నష్టం వాటిల్లింది. ఈ మేరకు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ఆ ప్రకారం ఆరు మండలాల పరిధిలోని 17 గ్రామాల్లోని 668మంది రైతులకు చెందిన 1,334 హెక్టార్లలో పంటలకు స్వల్పంగా నష్టం జరిగింది. కొర్ర 504 హెక్టార్లు, సజ్జ 337 హెక్టార్లు, నువ్వు 493 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు.

నేడు పాఠశాలలకు సెలవు

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 1 : జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సోమవారం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలకు కలెక్టర్ తమీమ్ అన్సారియా సెలవు ప్రకటించారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఉప విద్యాధికారులు, ఎంఈవోలు తమ పరిధిలో పాఠశాలలు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుతం జరుగుతున్న అసెస్‌మెంట్ మోడల్ పేపర్-1 పరీక్షలను సైతం వాయిదా వేశారు.

జేసీగా బాధ్యతలు తీసుకున్న ప్రఖర్‌జైన్

బాపట్ల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ప్రఖర్ జైన్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన సుబ్బారావు ఆదివారం పదవీవిరమణ చేయగా సోమవారం జైన్ జేసీగా బాధ్యతలు స్వీకరించాల్సి ఉంది. కానీ జిల్లాలో వరద పరిస్థితుల దృష్ట్యా ఒక రోజు ముందే కొల్లూరులోనే ప్రఖర్‌జైన్ జేసీగా బాధ్యతలు స్వీకరించి పునరావాస కేంద్రాలను కలెక్టర్ వెంకటమురళితో కలిసి పరిశీలించారు.

రైతులకు మెరుగైన సేవలందించాలి

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 1 : వ్యవసాయ, అనుబంధ శాఖల ద్వారా రైతులకు మెరుగైన సేవలందించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి సూచించారు. వ్యవసాయ శాఖ నూతనంగా అమలు చేయనున్న పొలం పిలుస్తోంది. కార్యక్రమ పోస్టర్‌ను ఆదివారం మంత్రి తన స్వగ్రామమైన తూర్పునాయుడుపాలెంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులు షెడ్యూల్ ప్రకారం గ్రామాలకు వెళ్లి క్షేత్రస్థాయిలో ఉండే పంట పొలాలను రైతుల సమక్షంలో పరిశీలించి గ్రామ సభ నిర్వహించాలన్నారు. చీడపీడలకు నివారణ చర్యలపై శాస్త్రవేత్తల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సింగరాయకొండ సహాయ సంచాలకులు రమేష్, నిర్మల కుమారి, ఒంగోలు వ్యవసాయాధికారి శ్రీనివాసనాయక్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల ఆచూకీ లభ్యం

● ఎమ్మెల్యే ఏలూరి చొరవ

● క్షేమంగా తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు

చినగంజాం, సెప్టెంబరు 1 : జీవనోపాధి కోసం సముద్రంలో చేపల వేటకు వెళ్లి తప్పిపోయిన బాపట్ల జిల్లా చినగంజాం మండలం రుద్రమాంబపురం గ్రామానికి చెందిన మత్స్యకారుల ఆచూకీ లభ్యమైంది. గ్రామానికి చెందిన కొండూరి రాముడు, బసన్నగారి జయరాజు, కాటంగారి బాబూరావు, ఆవల మునియ్య గత నెల 20వ తేదీన గ్రామం నుంచి చెన్నైకి వెళ్లారు. చెన్నై ఫిషింగ్ హార్బర్ నుంచి 23వ తేదీన వీరితోపాటు తమిళనాడుకు చెందిన నలుగురు, ప్రకాశం జిల్లా కొత్తపట్నంకు చెందిన ఇద్దరు మత్స్యకారులతో ఐఎన్‌డీ టీఎన్-2 ఎంఎం-2210 నెంబరు గల మెకనైజ్డ్ బోటుతో చెన్నై నుంచి చేపల వేటకు బయల్దేరారు. ఆ రోజు నుంచి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్నారు. వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో నాలుగు రోజుల నుంచి వారి నుంచి కుటుంబసభ్యులకు ఎలాంటి సమాచారం లేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టికి ఆదివారం ఉదయం తీసుకెళ్లారు. ఈ విషయాన్ని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, హోంమంత్రి వంగలపూడి అనితకు ఎమ్మెల్యే వివరించారు. దీంతో మంత్రులు ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. వెంటనే గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. బోటు మరమ్మతులకు గురైనట్లు సమాచారం తెలుసుకున్న అధికారులు విషయాన్ని కలెక్టర్ వెంకటమురళి దృష్టికి తీసుకెళ్లారు. వారిని సురక్షితంగా బయటకు తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రులను ఎమ్మెల్యే కోరారు. మంత్రుల ఆదేశాలతో వెంటనే కంట్రోల్ కోస్ట్ గార్డ్ రంగంలోకి దిగారు. విశాఖ తీరంలో గాలింపు చర్యలు చేపట్టారు. రెండు జిల్లాల అధికారులతో అనుక్షణం సంప్రదింపులు చేస్తూ ఆటు కమాండ్ కంట్రోల్, ఇటు కోస్ట్ గార్డ్‌తో సమన్వయం చేస్తూ మత్స్యకారుల ఆచూకీని తెలుసుకున్నారు. విశాఖ తీరానికి 150-200 కిలోమీటర్ల దూరంలో బోటు ఉన్నట్లు గుర్తించారు. బోటు డ్రైవర్‌తో కోస్ట్ గార్డ్ మాట్లాడి వారికి అవసరమైన ఆహారం ఉందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వాతావరణ అనుకూలతను బట్టి వారిని ఒడ్డుకు చేర్చేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు కోస్ట్ గార్డ్ తెలిపారు.

శోకసంద్రంలో కొత్తపల్లి

కన్నీరు మున్నీరైన తల్లిదండ్రులు, బంధువులు

అండగా ఉండి ఆదుకుంటా: ఎరిక్షన్‌బాబు



కుమారుడు మను మృతదేహం వద్ద సొమ్మసిల్లిన తండ్రి భానుచారి



నివాళులర్పిస్తున్న టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, నేతలు

పెద్దారవీడు, సెప్టెంబరు 1 : ముగ్గురు చిన్నారుల మృతితో మండలంలోని కొత్తపల్లి శోకసంద్రంలో మునిగిపోయింది. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి కులవృత్తి అయిన వడ్రింగి పని చేసుకుంటున్న కొత్తపల్లి విశ్వరూపాచారి, భానుచారిల కుమారులు మను, శివ, అదేవిధంగా ఆరవీటి శ్రీను కుమారుడు ఏడుకొండలు మృతితో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరై విలపిస్తున్నారు. రోజూ చలాకీగా బడికి పోతూ, వస్తూ అందరి మధ్యలో తిరిగే చిన్నారుల మృతితో కొత్తపల్లి గ్రామంలో కన్నీరు పెట్టని వారు లేరు. ఇటువంటి విషాద ఘటన మును పెన్నడూ తమ ఊరిలో జరగలేదంటూ నాటి తరం వారి నుంచి నేటితరం వారు పేర్కొంటున్నారు. ఈ సంఘటన గురించి తెలుసుకున్న టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు, ఇన్‌చార్జ్ సబ్‌కలెక్టర్ వెంకటసునీల్, డివిజనల్ పంచాయతీ అధికారి భాగ్యవతి, డిప్యూటీ తహసీల్దార్ రాజేష్, ఎంపీడీవో రాజ్ కుమార్‌లు చిన్నారులు మృతి చెందిన ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ముగ్గురు చిన్నారుల మృతదేహాల వద్ద నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు అండగా ఉంటానన్నారు. విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి ఆయా కుటుంబాలను ఆదుకుంటానని తెలిపారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు మెట్టు శ్రీనివాసులరెడ్డి, మాజీ అధ్యక్షుడు గొట్టం శ్రీనివాసులరెడ్డి, తదితరులు ఉన్నారు.

విద్యార్థుల మృతి బాధాకరం : మంత్రి స్వామి

ఒంగోలు(కార్పొరేషన్) : జిల్లాలోని పెదారవీడు మండలం ఎస్.కొత్తపల్లిలో ముగ్గురు విద్యార్థులు నీటికుంటలో పడి మృతి చెందడం బాధాకరమని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉన్న చిన్నారులు చనిపోవడం, వారి తల్లిదండ్రుల బాధను ఎవరూ తీర్చలేనిదన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తల్లిదండ్రులు పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వర్షాలు తగ్గే వరకు పిల్లలను బయటకు పంపొద్దని సూచించారు.

నేడు 'మీ కోసం' రద్దు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 1 : భారీ వర్షాల నేపథ్యంలో ఒంగోలులోని ప్రకాశం భవన్‌లో ప్రతివారం నిర్వహించే మీకోసంను సోమవారం రద్దు చేసినట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గుర్తించాలని ఆమె కోరారు.

గుండ్లకమ్మ నదికి వరద

- తాజాగా సాగర్ నీటి విడుదల, వర్షాలే కారణం
- వరి సాగుకు సిద్ధమవుతున్న రైతులు

అద్దంకి, సెప్టెంబరు 1 : గుండ్లకమ్మ నదికి వరద నీటి ప్రవాహం బాగా పెరిగింది. గత రెండు రోజులుగా గుండ్లకమ్మ నది ఎగువ పరీవాహక ప్రాంతాలలో వర్షాలు, సాగర్ కాలువలకు పూర్తి స్థాయిలో నీటి విడుదల నేపథ్యంలో గుండ్లకమ్మ నదిలో నీటి ప్రవాహం ఆదివారం బాగా పెరిగింది. గత ఏడాది నుంచి గుండ్లకమ్మ నదికి ఇంతమేర వరద నీరు రాలేదు. సాగర్ నీరు కూడా విడుదల జరగడంతో ఇక గుండ్లకమ్మ నదిలో నీటి ప్రవాహం కొనసాగనుంది.

గుండ్లకమ్మ ఆధారంగా ఉన్న ఎత్తిపోతల పథకాల ఆయకట్టు రైతు లు వరిసాగుకు సిద్ధమవుతున్నారు. పట్టణానికి కూడా తాగునీటి కష్టాలు తీరినట్లయింది. అద్దంకిలో ఆదివారం ఉదాయినికి 111.4 మి.మీ వర్షపాతం నమోదైంది. సాయంత్రం వరకు కూడా వర్షపు జల్లులు పడ్డాయి. శుక్రవారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు జల్లులు పడుతున్నాయి. ఆదివారం సాయం త్రం కొద్దిమేర ఎండ వచ్చినప్పటికీ ఆకాశం మేఘావృతమై ఉంది. వర్షపు జల్లులు పడుతుండడం ఆదివారం సెలవు కావడంతో అద్దంకి పట్టణంలోని వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. రెండు రోజుల పాటు ఎడతెరపి లేకుండా వర్షాలతో పొలాలలో నీరు నిలిచింది. వాగులకు నీరు చేరింది. బోరుబావుల కింద వరినాట్లు ముమ్మరం అయ్యాయి. నీటి వినియోగం లేకపోవడంతో సాగర్ కాలువల నిండా నీరు ప్రవహిస్తుంది.


అద్దంకి సమీపం వద్ద గుండ్లకమ్మ నదిలో వరద

నిండుతున్న వాగులు, చెరువులు

బల్లికురవ : నిన్న మొన్నటి వరకు చు క్క నీరులేని చెరువులు, వాగులు భారీ వర్షాలతో నిండుతున్నాయి. మూడు రోజుల నుంచి మండలంలోని అన్ని గ్రామాలలో కురిసిన భారీ వర్షంతో బెట్ట కొచ్చిన మెట్ట పంటలు జీవం పోసుకున్నాయి. చుక్క నీరు లేని చెరువులు వాగులకు నీరు పెద్ద ఎత్తున నీరు చేరుతోంది. మండలంలోని గుంటుపల్లి, ముక్తేశ్వరం గ్రామాల మధ్య ఉన్న పరమడ వాగు నీటి ఉధృతి కొనసాగుతోంది. ఈ నీరు బల్లికురవ వీర్లచెరువుకు చేరుతుండడంతో చెరువు కళకళలాడుతుంది. అంబడిపూడి సాగు నీటి చెరువు పూర్తి స్థాయిలో నిండుకుంది. చెన్నుపల్లి, చెరువు పూర్తి స్థాయిలో నిండింది.

అలానే గంగపాలెం వేమవరం గ్రామాల మధ్య ఉన్న అక్కమ్మ కుంటలో మట్టిని తవ్వడంతో వర్షపు నీటితో పంటపొలాలు నీట మునిగాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బల్లికురవ మండలంలో రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకున్న వర్షాలు ఇప్పటి వరకు పంటలకు ఎంతో ఉపయోగం అని రైతులు అంటున్నారు. ఇంకా వానలు పడితే పంటలకు నష్టమని వారు తెలిపారు.


బల్లికురవ : ఉధృతంగాప్రవహిస్తున్న గుంటుపల్లి ముక్తేశ్వరం వాగు


అద్దంకి : తిమ్మాయిపాలెం వద్ద పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

రాతి మండపానికి రూ.లక్ష విరాళం

అద్దంకి, సెప్టెంబరు 1 : శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం రాతి ముఖ మండపం నిర్మాణానికి అద్దంకి మండలంలోని కొంగపాడుకు చెందిన ప్రియ స్టుడియో అధినేత కమ్మ నాగేశ్వరరావు, వెంకట సుజాత దంపతులు లక్ష నూట పదహారు రూపాయలను ఆదివారం అందజేసినట్లు ఈవో సుభద్ర తెలిపారు.

నేడు అరటి పండ్ల పూజ

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో అమవాస్య సందర్భంగా సోమవారం ఉదయం 7-39 గంటలకు అరటి పండ్లతో పూజ జరుగుతుందని ఈవో, అసిస్టెంట్ కమీషనర్ సుభద్ర తెలిపారు.

ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూసుకోవాలి


చేపల విక్రేతలకు సూచినలిస్తున్న ఎస్సై వెంకటేశ్వర్లు

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు1 : చేపలు, రొయ్యల విక్రేతలు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ తమ వ్యాపారాలు చేసుకోవాలని ఎస్సై వెంకటేశ్వర్లు సూచించారు. ఆదివారం ఆయన సిబ్బందితో కలసి కాలుక సెంటర్లో చేపల విక్రేతలకు పలు సూచనలు చేశారు. వాస్తవానికి చేపల మార్కెట్ నిర్ణీత స్థలంలో ఉన్నా, వారికి అనువుగా ఉంటుందని కాలువ సెంటర్లో విక్రయాలు చేస్తుంటారు. ఈ క్రమంలో మీ జీవనోపాధికి ఇబ్బంది లేకుండా, అలానే ప్రజలకు, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా నడుచుకోవాలని ఎస్సై వారికి స్పష్టం చేశారు.


బాధితులకు ఆహార పొట్లాలను అందిస్తున్న డాక్టర్ మహేంద్రనాథ్

వర్ష బాధితులకు టీడీపీ ఆహారం పంపిణీ

చీరాల, సెప్టెంబరు1 : నియోజకవర్గంలోని శివారు ప్రాంతాల్లో వర్షాలతో ఇబ్బంది పడుతూ ఆహారం లేని వారికి టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్ ఆదివారం ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆయా ప్రాంతాల్లో కరకట్టలపై జీవనం సాగిస్తున్న వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. నాయకులు, కార్యకర్తలతో కలసి వర్షంలోనే వారికి ఆహార పొట్లాలను పంపిపెట్టారు. ఎవరు కూడా ఆహారం కోసం ఇబ్బంది పడకుండా తమ వంతు ప్రయత్నం చేస్తామన్నారు. ప్రకృతి ప్రకోపాన్ని ఎవరూ ఆపలేరని, అయితే బాధితుల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా తమవంతు సాయం అందిస్తామని బాధితులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంటల పరిశీలన


మినుము పైరును పరిశీలిస్తున్న ఏవో సుబ్బారెడ్డి

పంగులూరు, సెప్టెంబరు 1 : మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో సాగులో ఉన్న పంటలను వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి ఆదివారం రైతులతో కలిసి పరిశీలించారు. రేణంగివరం, కొండమూరు గ్రామాలలో మినుము, పత్తి పైర్లను పరిశీలించిన ఏవో రైతులకు పలు సూచనలు చేశారు. వర్షం పడుతున్నందున పంటలో అక్కడక్కడా నీరు నిలిచి ఉందని, ఆ నీటిని బయటకు మళ్లించాలన్నారు. లీటర్ నీటికి రెండు గ్రాములు యూరియా లేదా పొటాషియం నైట్రేట్ నాలుగు గ్రాములు కలిపి వారం వ్యవధిలో మినుపై రెండుసార్లు పిచికారీ చేయాలని సూచించారు. మూడు రోజుల వ్యవధిలో 14 సెంటీమీటర్ల వర్షం నమోదయిందని, నిరంతరం కురుస్తున్న వర్షంతో భూమికి సరిపడా నీరు చేరిందని, సాగులో ఉన్న పంటలకు ఇప్పటి వరకు ఇబ్బంది లేదని ఏవో తెలిపారు.

తులసమ్మ మృతికి ఎమ్మెల్యే ఏలూరి సంతాపం


తులసమ్మ

వీరన్నపాలెం (పర్చూరు), సెప్టెంబరు 1 : పర్చూరు టీడీపీ జడ్పీటీసీ మాజీ సభ్యురాలు వీరన్నపాలెం గ్రామానికి చెందిన యార్లగడ్డ తులసమ్మ మృతి పట్ల ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదివారం ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతి వ్యక్తం చేశారు. ఆమె మృతి తెలుగుదేశం పార్టీకి, కుటుంబ సభ్యులకు తీరని లోటు అన్నారు. పర్చూరు మండల తొలి జడ్పీటీసీ సభ్యురాలిగా గెలుపొందిన తులసమ్మ అభివృద్ధిలో కీలక భూమిక పోషించారని ఈసందర్భంగా ఏలూరి గుర్తు చేశారు. తెలుగుదేశం పార్టీకి తులసమ్మ చేసిన సేవలను కొనియాడారు.

ఓగేరు ఉధృతం

రాకపోకలు నిలిపివేత

సంతమాగులూరు, సెప్టెంబరు 1 : మండలంలోని గత మూడు రోజులుగా కురుస్తున్న బారి వర్షాలకు మండలంలోని వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండలంలోని గురిజేపల్లి - చవిటిపాలెం గ్రామాల మధ్యగల ఓగేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వంతెనపై రాకపోకలను అధికారులు నిలిపివేశారు. దీంతో పలు గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.


గురిజేపల్లిలో ప్రవహిస్తున్న ఓగేరు వాగు

అదుపులోకి రాని విష జ్వరాలు

- రోజురోజుకూ పెరుగుతున్న జ్వర బాధితులు
- మంచంపట్టిన వంద మంది
- నెలరోజులుగా విలవిల
- ముక్తేశ్వరంలో అధ్వానంగా పారిశుధ్యం
- వానలతో రోగాల విజృంభణ ఆందోళనలో ప్రజలు


ముక్తేశ్వరంలో విషజ్వరంతో బాధపడుతున్న వృద్ధుడు, మంచం పట్టిన మహిళ, చిన్నారులతో అద్దంకి వైద్యశాలకు ఉన్న జ్వర బాధితులు


గ్రామంలో అధ్వానంగా పారిశుధ్యం

బల్లికురవ, సెప్టెంబరు 1 : మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో విష జ్వరాలు అదుపులోకి వచ్చిన దాఖలాలు లేవు. గత నెలరోజుల నుంచి జ్వర బాధితుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతుంది అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జ్వరం కొంత మందికి తగ్గిన మరలా రెండు మూడు రోజు వ్యవధిలోనే మరలా జ్వరం వస్తుందని పగలే దోమల సంచారం అధికం అయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు మొదలు కావడంతో పారిశుధ్యం కూడా పడకవేసిందని రోడ్ల మీదే మురుగు పారుతుందని జ్వరాల బారిన పడి వారికి తగ్గక ప్రైవేట్ వైద్యశాలలకు పరుగులు పెట్టాల్సి వస్తుందని వారు తెలిపారు. అధికారులు నామ మాత్రంగా పారిశుధ్య పనులు, ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి మమ అనిపించారని జ్వరాలు అదుపులోకి మాత్రం రాలేదని ప్రజలు తగ్గోలు పెడుతున్నారు. అద్దంకి ప్రైవేట్ వైద్యశాలలోనే సుమారు 50 మంది వరకు జ్వరాలబారిన పడి వైద్యం కోసం తరలివెళ్లారని వారు అంటున్నారు. గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు కూడా విష జ్వరం బారిన పడి వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడని వారు తెలిపా రు. జ్వరం వస్తే కుటుంబం మెత్తం మంచాన పడుతుందని, ఇంట్లో ఉన్న చిన్నారులకు ముం దుగా వచ్చి తదుపరి పెద్ద వారికి వ్యాప్తి చెందుతుందని కొందరికి కాళ్ల వాపులు కూడా వచ్చాయని గున్యా కూడా అధికంగా ఉందని వారు తెలిపారు. జిల్లా అధికారులు వెంటనే గ్రామాన్ని సందర్శించి జ్వరాలు అదుపులోకి వచ్చేలా పారిశుధ్య పనులు చేయించాలని ముక్తేశ్వరం గ్రామ ప్రజలు కోరుతున్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

అద్దంకిటౌన్, సెప్టెంబరు 1 : సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్‌లను రద్దు చేసి ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఆమోదయోగ్యమైన పాత పెన్షన్ విధానాన్ని పు నరుద్ధరించాలని ఏపీటీఎఫ్ అద్దంకి జోన్ నాయకులు మలాది నాగరాజు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కేంద్రీకృత పెన్షన్ విధానం (యూపీఎస్) నూతన పథకానికి వ్యతిరేకంగా ఆదివారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యూపీఎస్ అనే నూతన విధానాన్ని తీసుకురావాలని కేబినెట్‌లో నిర్ణయించిందని, ఈ పథకం ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. రాష్ట్రంలో ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు రామయ్య, రమేష్‌బాబు, ఎలీషా, వెంకట్రావు, చెంచుబాబు, మల్లికార్జునరావు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

మార్టూరు : పాత పించన్ విధానాన్ని కొనసాగించాలని కోరుతూ ఆదివా రం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ ఉపాధ్యాయులు తమ నిరసనను తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ మాదుగుల కిషోర్, జయకుమార్, కంభంపాటి ప్రశాంత్, శిఖా నాగేశ్వరరావు, జానీ బాషా, సుబ్బారాయుడు, బండారు రాంబాబు, కత్తి మునలయ్య, కటారు కోటయ్య లతోపాటు నాలుగుమండలాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


అంజయ్యకు పింఛన్ ఇస్తున్న ఉద్యోగి, టీడీపీ నాయకులు

చికిత్స పొందుతున్న వ్యక్తికి పింఛన్ అందజేత

అద్దంకిటౌన్, సెప్టెంబరు 1: మండలంలోని మణికేశ్వరం గ్రామానికి చెందిన మందా అంజయ్య పించన్‌దారుడు. ఆయన అనారోగ్యంతో బాధపడుతూ ఒంగోలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం గ్రామ సచివాలయ ఉద్యోగి అంకమ్మరావు, ఐటీడీపీ నాయకలు కరిముల్లా ఒంగోలు ఆసుపత్రికి వెళ్లి లబ్ధిదారుడు అంజయ్యకు పింఛన్‌ను అందజేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బల్లికురవ, సెప్టెంబరు 1 : గ్రామాలలో గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ జీవీ చౌదరి సూచించారు. ఆదివారం అయన మాట్లాడుతూ పలు గ్రామాలలో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని ప్రజలు అత్యవసరమైతేనే ప్రయాణాలను చేయాలన్నారు. ఏదైనా సమాచారం ఉంటే వెంటనే పోలీసు స్టేషన్‌కు తెలియజేయాలన్నారు. అలానే గ్రామాలలో కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే వెంటనే వారి వివరాలు సేకరించి అనుమానం కలిగితే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాలలో తమ సిబ్బంది నైట్ బీట్ తిరుగుతున్నారని, చోరీలు జరగకుండా చర్యలు చేపడుతున్నామని ఎస్ఐ తెలిపారు.


కాల్వ గండిని పూడ్చిన నేతలు

మైనర్ కాలువకు గండి

పూడ్చిన టీడీపీ నాయకులు

ఇంకొల్లు, సెప్టెంబరు 1 : ఇంకొల్లు మండలంలోని పోలిమేర ఆంజనేయస్వామి గుడి సమీపంలో పావులూరు ఎస్ఎస్పీ మైనర్ క్వాలకు గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గండి పడింది. సాగర్ కాల్వకు పావులూరు రోడ్డుకు మధ్య ఉన్న పంట పొలాలు నీట మునిగాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సూచనల మేరకు స్పందించిన పావులూరు గ్రామ టీడీపీ నేతలు గుంజి వెంకట్రావు, నారిశెట్టి రాంబాబు, తన్నీరు రామాంజనేయులు, అన్నెం వెంకట్రావు, పావులూరి రవి, అశోక్, శ్రీను, కొత్తపల్లి మహేష్, మోషే, వలేరు డేవిడ్, టీడీపీ కార్యకర్తలు, అభిమానులు ఆదివారం కాలువ గండి పూడ్చారు.

నేడు పర్చూరులో మెగా రక్తదాన శిబిరం

పర్చూరు, సెప్టెంబరు 1 : జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ప్రవాశాంధ్రుడు, జనసేన పర్చూరు నియోజకవర్గ నాయకుడు మన్నెం శ్రీకాంత్ ఆధ్వర్యంలో పర్చూరులో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని జనసేన పార్టీ నాయకులు ఆదివారం ప్రకటలో కోరారు. పర్చూరులోని ఎఎస్‌వీఎస్ బాలికల పాఠశాలలో సోమవారం ఉదయం 9 గంటలకు శిబిరం ప్రారంభిస్తారని తెలిపారు.


జాతీయ రహదారి పక్కన నీట మునిగిన పొలాలు

నీట మునిగిన పొలాలు

చీరాల, సెప్టెంబరు1 : వర్షం ప్రభావంతో పలుచోట్ల పొలాలు నీట మునిగాయి. ఇప్పటికే సాగులో ఉన్న పైర్లకు వర్షం జీవం పోసింది. ఇసుక నేల కావటంతో పొలాల్లో నీటిని వెలుపలకు పంపితే పెద్దగా నష్టం ఉండదని రైతులు అంటున్నారు. లోతట్టు ప్రాంతంలో సాగు చేసిన మినుము, పెసర పైర్లు కొన్నిచోట్ల కొంతమేర పాడయ్యే ప్రమాదం ఉంది. చేలల్లో నిలిచిన నీరు వెలుపలకు పంపేందుకు మార్గం లేక ఆగినచోట పంట దెబ్బతింటుంది. మొత్తం మీద వర్ష ప్రభావంపై రైతుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

కూలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



మార్టూరు, సెప్టెంబరు 1 : మండలంలోని వలపర్ల గ్రామంలో శనివారం రాత్రి కురిసిన వర్షాలకు జడ్పీ హైస్కూల్‌కు వెళ్లే రహదారిలోని విద్యుత్ ట్రాన్స్‌ఫారమ్ పడిపోయింది. రోడ్డుపక్కన గతంలో నేలపై సిమెంట్ దిమ్మెతో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫారమ్ వర్షం కారణంగా ఒరలు కింద ఉన్న మట్టి కరిగిపోవడంతో ట్రాన్స్‌ఫారమ్ పక్కనున్న గుంతలోకి పడిపోయింది. వినియోగదారులకు అంతరాయం కలగకుండా విద్యుత్ లైన్‌మన్ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. విద్యుత్ అధికారులు స్పందించి వెంటనే ట్రాన్స్‌ఫారమ్‌ను పునరుద్ధరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఆపదలో ఉన్న వ్యక్తికి రక్తదానం

అద్దంకిటౌన్, సెప్టెంబరు 1 : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో ఆదివారం సర్జరీ చేయించుకుంటున్న వ్యక్తికి రక్తదానం చేశారు. అద్దంకికి చెందిన పీడీ ముద్దన విష్ణుప్రసాద్‌కు విజయవాడ మణిపాల్ ఆసుపత్రిలో సర్జరీ నిమిత్తం ఏబీ పాజిటివ్ రక్తం అవసరం అని వైద్యులు తెలిపారు. ఈ క్రమంలో రోగి బంధువులు రోటరీ క్లబ్ సెక్రటరీ చుండూరి మురళీ సుధాకరరావును సంప్రదించగా అద్దంకికి చెందిన శివారెడ్డి, చెన్నుపల్లి వాసు, ప్రసన్న ముగ్గురు విజయవాడ వెళ్లి రక్తదానం చేశారు. రక్త దాతలను, రోటరీ సెక్రటరీ సుధాకర రావును రోటరీ క్లబ్ అధ్యక్షుడు వీరయ్య అభినందించారు.

టిఫిన్ దుకాణంలో అగ్నిప్రమాదం

- తండ్రీకుమారుడికి గాయాలు
- రూ.2లక్షల ఆస్తి నష్టం


తగలబడుతున్న దుకాణం

మార్టూరు, సెప్టెంబరు 1 : మండల పరిధిలోని రాజుపాలెం గ్రామంలో శనివారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. దామవరపు శ్రీను అనే వ్యక్తికి చెందిన తాటి ఆకుతో ఉన్న దుకాణం పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో దుకాణంలోని వస్తువులతోపాటు కొంతనగదు పూర్తిగా కాలిపోయింది. సుమారు రూ.2లక్షల నష్టం వాటిల్లినట్లు తెలిసింది. కాలిపోతున్న వాటిని బయటకు తీసే ప్రయత్నంలో యజమాని శ్రీను, అతని కుమారుడు నాగరాజులకు గాయాలయ్యాయి. ఎస్సీ కాలనీలో రోడ్డు పక్కన టిఫిన్ దుకాణాన్ని శ్రీను నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి 10 గంటల సమయంలో భారీ వర్షం కారణంగా కరెంట్ పోయింది. దుకాణంలో వెలుతురు కోసం శ్రీను కొవ్వొత్తిని వెలిగించారు. కొంత సేపటికి దుకాణం బయట ఉన్న శ్రీను దుకాణంలో భారీగా మంటలు రావడం గమనించారు. కొవ్వొత్తి కారణంగా ఒక్క సారిగా మంటలు వ్యాపించాయి. వాటిని అదుపుచేయడానికి కాలనీవాసులు ప్రయత్నిస్తుండగా, దుకాణంలోపల ఉన్న నగదును, వస్తువులను బయటకు తీసుకురావడానికి ప్రయత్నించిన తండ్రీకుమారుడు గాయపడ్డారు. చిలకలూరిపేట అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను పూర్తిగా ఆర్పివేశారు.

దాడిపై కేసు నమోదు

చీరాల, సెప్టెంబరు 1 : మున్సిపల్ పరిధిలోని జయంతిపేటలో ఓ వ్యక్తి, మరో కుటుంబంపై దాడి చేసిన నేపథ్యంలో టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జయంతిపేటకు చెందిన ఆదర్శ్, ఆనందబాబులు సమీప ఇళ్లలో ఉంటుంటారు. ఆదర్శ్ తరచూ మద్యం సేవించి అక్కడ న్యూసెన్స్ చేస్తుంటాడు. ఆనందబాబు పలుమార్లు ఆదర్శ్ చర్యలు ఖండిస్తూ వారించాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఆనంద్‌బాబు డ్యూటీకి వెళ్లగా అతని ఇంటికి ఆదర్శ్ వెళ్లి ఆనందబాబు భార్య అలేఖ్యను దుర్భాషలాడతాడు. చంపుతానని బెదిరించాడు. ఆలేఖ్య జరిగిన విషయాన్ని తన భర్త ఆనంద్‌బాబుకు ఫోన్‌లో తెలపగా అతను ఇంటికి వచ్చాడు. ఆదివారం ఉదయం తెల్లవారుజామున 5 గంటల సమయంలో అదర్శ్ మరలా ఆనంద్‌బాబు ఇంటికి గొడ్డలితో వెళ్లి ఘర్షణకు దిగుతాడు. ఈ నేపథ్యంలో అలేఖ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దార్యప్తు చేస్తున్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

చినగంజాం, సెప్టెంబరు 1 : వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి మందిర ఆవరణలో వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిర కార్యక్రమాన్ని నిర్వహించారు. వాసవీ క్లబ్ వ్యవస్థాపకులు కేసీజీఎఫ్ గుప్తా పుట్టిన రోజు సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్లు వాసవీ క్లబ్ మండల అధ్యక్షుడు కోట సుచిత్ర తెలిపారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని అన్నారు. శిబిరంలో 30 మంది నుంచి ఒంగోలు రెడ్ క్రాస్ సంస్థ వారు రక్తాన్ని సేకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ జోన్ చైర్మన్ పొట్టి శైలజ, మండల కార్యదర్శి భయ్యా జ్యోతి, కోశాధికారి శేషు, ఆర్యవైశ్యసంఘం జిల్లా కార్యదర్శి రామసుబ్బారావు, శివరామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

పొలాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలి

చెరుకూరు(పర్చూరు) 1 : పొలాల్లో వరద నీరు నిల్వ లేకుండా వెంటనే బయటకు పంపించానలి వ్యవసాయ సబ్‌డివిజన్ సహాయ సంచాలకులు ఎన్. మోహనరావు సూచించారు. ఆదివారం అధిక వర్షాల కారణంగా నీటమునిగిన పంట పొలాలను వ్యవసాయ సిబ్బందితో కలసి పరిశీలించారు. మండలంలోని చెరుకూరు, కొత్తపాలెం గ్రామాల్లోని వరి, పత్తి పొలాలను ఆయన పరిశీలించి రైతులకు తగు సలహాలు సూచనలు ఇచ్చారు. పొలంలో నీటిని తీసివేసి ఎకరానికి 30 కేజీల యూరియా, 15 కేజీల ఎంవోపీ ఎరువులను బూస్టర్ డోస్‌గా పంటలకు అందించాలన్నారు. ప్రస్తుతం కురిసిన వర్షాల నేపథ్యంలో వరి పైరులో కలుపు వచ్చే ప్రమాదం ఉందని నివారణకు ఎకరానికి 100ఎంఎల్ బిస్ పైరిబాక్ సోడియం 10శాతం చొప్పున పిచికారీ చేయాలన్నారు. పత్తిలో బయటకు నీటిని పంపిన తరువాత మల్టీ కే (13-0-45) లేదా 19-19-19 లీటరు నీటికి 10 గ్రాములు చొప్పున పిచికారీ చేస్తే మంచి ఫలితం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


రైతులకు సూచనలు ఇస్తున్న ఏడీఏ మోహనరావు

- భయమూ, భక్తి లేకుండా ఆలయాల నిధులు భారీగా దుర్వినియోగం
- అరికట్టాల్సిన ఆడిటింగ్ శాఖంతా అవినీతిమయం
- ప్రీ, పోస్ట్ ఆడిట్లలోనూ అనేక అవకతవకలు
- నెలమామూళ్లతో సహకరిస్తున్న వైనం
- ఇటీవల ఐదుగురు ఈవోల సస్పెన్షన్.. మరి ఆడిటర్లపై చర్యలేవి ?
- ఏళ్లతరబడి పాతుకుపోయిన సిబ్బంది

దేవుడి సొమ్మా..
అయితే ఏంటి ?


నెల్లూరు రంగనాయకులపేటలోని జిల్లా ఆడిటింగ్‌శాఖ కార్యాలయం

నెల్లూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం అంటే బాధ్యత లేదు.. దేవుడంటే భయమూ, భక్తి లేవు..! ఆలయాల్లో అక్రమాలను అరికట్టాల్సిన ఆడిటింగ్ శాఖనే.. అవినీతికి సహకరిస్తోంది. ప్రీఆడిట్ ద్వారా అక్రమాలకు అడ్డుకట్టాలని ప్రభుత్వం భావిస్తే.. దాన్ని ఆదాయ వనరుగా మార్చుకున్నారు. ఆడిట్‌శాఖ అధికారుల వద్ద ఉండాల్సిన ప్రీఆడిట్ లాగిన్లు దేవాలయాల్లో పని చేస్తున్న సిబ్బంది వద్ద ఉన్నట్లు గతంలోనే ఏసీబీ విచారణలో బయటపడింది. ఇటీవల జిల్లాలోని మూడు ఆలయాల్లో నిధుల దుర్వినియోగానికి సంబంధించి ఐదుగురు ఎగ్జిక్యూటివ్ అధికారుల (ఈవోల)ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఇంతస్థాయిలో నిధులు పక్కదారి పడితే ఆడిటింగ్ శాఖ ఏం చేస్తోందన్న ప్రశ్న తలెత్తుతోంది. ప్రతీరూపాయికి ఆడిటింగ్ చేసే అధికారులు... మరి అక్రమాలను ఎందుకు గుర్తించలేకపోయారన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఇప్పటికీ పలు ఆలయాల్లో దేవదాయశాఖ విజిలెన్స్ విభాగం విచారణ చేస్తోంది. పలు అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తు న్నాయి. ఇంత జరుగుతున్నా ఆడిటింగ్ శాఖలో ఇందుకు బాధ్యులైన అధికారులపై విచారణ గానీ, చర్యలు గానీ తీసుకోలేదు. ఆడిటింగ్ శాఖ అధికారులు చేసే ప్రీఆడిట్, పోస్ట్ ఆడిట్ వద్దే అక్రమాలకు బ్రేకులు వేస్తే ఆలయాల్లో అవినీతికి ఆస్కారముండదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

ఎందుకు పట్టించుకోవడం లేదు..?

ఆలయాలు, పంచాయతీలు, మున్సిపాలిటీలు వంటి కీలక విభాగాల్లో అవినీతిని అరికట్టి, జవాబుదారీతనం పెంచేందుకు రాష్ట్ర ఆడిట్‌శాఖ ఏటా ఆడిటింగ్ నిర్వహిస్తుంది. నిధుల ఖర్చును క్షుణ్ణంగా పరిశీలించి లోటుపాట్లను గుర్తిస్తుంది. అయితే దొంగ బిల్లులతో నిధులు దుర్వినియోగం చేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం 2022లో ప్రీఆడిట్‌ను ప్రవేశపెట్టింది. ఈ విధానం ప్రకారం ఆలయాల్లో ఒక్క రూపాయి ఖర్చు పెట్టాలన్నా ముందుగా ఆడిటర్ల నుంచి అనుమతి తీసుకోవాలి. ఆ బిల్లు ఆడిటర్ల లాగిన్‌కు వెళ్లాక వారు క్షుణ్ణంగా పరిశీలించి అది నిబంధనల ప్రకారం వచ్చిన బిల్లేనా.. లేదా..? అన్నది పరిశీలించి అప్రూవల్ ఇవ్వాలి. ఉదాహరణకు ఒక ఆలయంలో ఒక వస్తువును కొనుగోలు చేసేందుకు బిల్లు పెడితే.. ఆ మొత్తం ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు అనుగుణంగా ఉందా..? అనేదాన్ని పరిశీలించాలి. ప్రీఆడిట్‌లో ఏవైనా రిమార్కులు వస్తే వాటిని పోస్ట్ ఆడిట్‌లో పరిశీలించాలి. కానీ గత కొన్నేళ్లుగా ఆలయాల్లో ఆడిటింగ్ నామమాత్రంగా జరుగుతున్నట్లు ఇటీవల వెలుగుచూసిన పరిణామాలు చెబుతున్నాయి. ఆలయాల నుంచి వస్తున్న బిల్లులను పరిశీలించ కుండానే ఆడిటింగ్ సిబ్బంది అప్రూవల్ చేస్తున్నట్లు సమాచారం. ఆడిటర్ల వద్ద ఉండాల్సిన ప్రీఆడిట్ లాగిన్లు ఆలయాల సిబ్బంది వద్ద ఉంటున్నాయి. వారు ఇష్టం వచ్చినట్లు బిల్లులు పెట్టుకుంటున్నారు. నెల్లూరు రంగనాథస్వామి ఆలయంలో గతేడాది ఏసీబీ అధికారుల విచారణలో ఈ విషయం బయట పడింది. అయినా బాధ్యులైన ఆడిట్ అధికారులపై చర్యలు మాత్రం తీసుకోలేదు. నాడు రాష్ట్ర ఉన్నతాధికారులు విచారణ అంటూ హడావుడి చేసి ఆ తర్వాత సర్దుకున్నారు.

జీతాలకూ డబ్బుల్లేవట !

ఏదైనా ఒక ఆలయంలో ఏ విభాగానికి ఎంత ఖర్చు చేయాలన్నది స్పష్టంగా ఉంది. ఎస్టాబ్లిష్‌మెంట్ ఖర్చులు 30 శాతానికి మించకూడదు. కానీ చాలా ఆలయాల్లో ఇది పరిధి దాటిపోతోంది. ఒక్క జొన్నవాడ ఆలయంలోనే దాదాపు 65 శాతం వరకూ ఉన్నట్లు సమాచారం. అసలు ఇంత మొత్తాన్ని ఎస్టాబ్లిష్‌మెంట్ పద్దు కింద ఆడిటింగ్ సిబ్బంది ఎలా అనుమతించారన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఏ ఆలయంలో ఎంతమంది ఉద్యోగులు పనిచేయా లన్నది కూడా నిబంధనల్లో స్పష్టంగా ఉంది. కానీ చాలా చోట్ల పరిమితికి మించి సిబ్బంది పనిచేస్తున్నారు. పైగా జీతాలు కూడా చాలా ఎక్కువగా ఉంటున్నాయి. ప్రభుత్వ జీవో ప్రకారం జీతాలు చెల్లించడం లేదు. ఇలా సిబ్బంది జీతాలకే ఆలయం ఆదాయంలో సగం సరిపోతోందంటే ఆశ్చర్యం కలగకమానదు. ఒక్క జొన్నవాడ ఆలయంలోనే గత రెండేళ్లలో 32 మంది వరకూ సిబ్బందిని నిబంధనలకు విరుద్ధంగా ఎంపిక చేసినట్లు విచారణలో తేలింది. కొన్ని ఆలయాల్లో భారీగా నిధులు దుర్వినియోగం చేసి ఖజానాను ఖాళీ చేయడంతో ప్రస్తుతం సిబ్బందికి జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. ఉలవపాడులోని వేణుగోపాలస్వామి ఆలయం, జొన్నవాడ కామాక్షమ్మ ఆలయాలే ఇందుకు ఉదాహరణ. కొన్ని నెలలుగా ఇక్కడ పనిచేస్తున్న వారికి జీతాలు ఇవ్వలేకపోతున్నారు. దీనంతటికీ ఆడిటింగ్ శాఖ సిబ్బందినే కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఏళ్ల తరబడి కొనసాగుతున్న సిబ్బంది

నెల్లూరు ఆడిట్‌శాఖలో పనిచేస్తున్న కొందరు అధికారులు, ఉద్యోగులు ఏళ్ల తరబడి పాతుకుపోయారు. సొంత జిల్లాలో ఉండకూడదన్న నిబంధనలు కూడా ఈ శాఖలోని అధికారులకు వర్తించవన్న విమర్శలున్నాయి. ఎన్నికల సమయంలో కూడా ఈ శాఖలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు వైసీపీకి అనుకూలంగా పనిచేశారన్న ఆరోపణలున్నాయి. మూడు ప్రధాన ఆలయాల్లో భారీగా నిధులు దుర్వినియోగం జరిగినట్లు తేలినా ఈ శాఖలో మాత్రం చలనం లేదు. అసలు ఇన్ని అక్రమాలు జరిగితే ఆ ఆలయాల్లో ఆడిట్ చేసిన అధికారులు, ఉద్యోగుల పాత్ర ఎంతన్నది కూడా తేల్చడం లేదు. అంతేకాకుండా జిల్లాలోని చాలా 6(ఏ) ఆలయా(పెద్ద ఆలయాలు)ల్లో అవకతవకలు జరిగినట్లు తెలుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా సిబ్బందిని నియమించడం, ఎస్టాబ్లిష్‌మెంట్ ఖర్చులు భారీ చేయడం, విచ్చలవిడిగా జీతాలు పెంచడం వంటివి జరగ్గా, వాటిని ఆడిట్ అధికారులు అప్రూవల్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

జీతాలకోసం ఆలయ ఉద్యోగులు ఏకరువు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడ ఆలయంలో పనిచేస్తున్న రెగ్యులర్, ఔట్‌సోర్సు ఉద్యోగులు గత మూడు నెలలుగా జీతాల కోసం ఏకరువు పెడుతున్నారు. గత నెలలో రెగ్యులర్ ఉద్యోగులకు మాత్రమే జీతాలు చెల్లించగా, మిగిలిన వారికి చెల్లించలేదు. ఆలయ ఈవోగా శ్రీనివాసులురెడ్డి బాధ్యతలు చేపట్టే నాటికి రూ. 60వేలు సాధారణ నిధులుండగా, నిధుల కొరతతో జీతాల కొరత ఏర్పడిందని ప్రస్తుత ఈవో తెలిపారు. ఆగస్టు నెల జీతాలు ఈనెలలో చెల్లిస్తామని, పెండింగ్ బకాయిలు వచ్చేనెల 10లోగా చెల్లిస్తామని తెలిపారు.

ఏఎస్ఐలకు ఎస్ఐలుగా పదోన్నతి

- ఐజీ ఆదేశాలతో ఎస్పీ ఉత్తర్వుల జారీ

నెల్లూరు,(క్రైం), సెప్టెంబరు 1: పోలీసుశాఖలో ఖాళీల ఆధారంగా జిల్లాలో పనిచేస్తున్న 24 మంది ఏఎస్ఐ (సివిల్)లకు ఎస్ఐలుగా పదోన్నతి కల్పిస్తూ గుంటూరు రేంజ్ ఐజీ ఆదేశాలతో జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదివారం ఉత్తర్వులు జరీ చేశారు. ఆ వివరాలు..

పేరు	పనిచేస్తున్న ప్రాంతం
ఎస్‌కే మహబూబ్ బాషా	ఇంటెలిజెన్స్ (నెల్లూరు)
ఆర్ సుధీర్‌కుమార్	వెంకటాచలంస్టేషన్
కే శ్రీనివాసులురెడ్డి	దుత్తలూరు స్టేషన్
ఎస్‌కే గౌస్‌బాషా	కావలి-2 స్టేషన్
ఎస్‌కే ఖాదర్‌బాషా	కొవడలూరు స్టేషన్
ఎం జానకిరామిరెడ్డి	కావలి-2 స్టేషన్
సీహెచ్ తిరుమలరెడ్డి	దగదర్తి
ఎస్‌కే దాదాబాషా	సంతపేట,నెల్లూరు
వీ బ్రహ్మయ్య	దర్గామిట్ట, నెల్లూరు
డీ వెంకటేశ్వరు	మనుబోలు
ఎన్ శ్రీనివాససింగ్	డీసీఆర్‌బీ, నెల్లూరు
కే ముక్తియార్ బాష	డీసీఆర్‌బీ, నెల్లూరు
పీ శ్రీనివాసులు	నెల్లూరు(తిరుపతి)
ఎస్‌కే సుల్తాన్‌బాషా	విడవలూరు
ఏ శీనయ్య	ఉదయగిరి
ఓ శ్రీనివాసులు	విడవలూరు
పీ శ్రీనివాసులురెడ్డి	నెల్లూరు (తిరుపతి)
జీవీ సుబ్బారావు	చేజర్ల
ఎస్ నాగరాజు	కండలేరు
ఎన్ శ్రీనివాసరావు	కావలి రూరల్
యూ నాగయ్య	సంగం
కే శివయ్య	టీపీ గూడూరు
ఏ మనోహర్‌రెడ్డి	కొండాపురం
ఎన్‌వీ శేషుబాబు	ఇంటెలిజెన్స్(నెల్లూరు)

నేడు విద్యా సంస్థలకు సెలవు

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 1: జిల్లాలోని అన్నీ విద్యాసంస్థలకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా పరిధిలోని అన్నీ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కాలేజీలకు ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలు, కళాశాలలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఈవో రామారావు, ఆర్ఐవో డాక్టర్ ఎ.శ్రీనివాసులు వేర్వేరు ప్రకటనలో హెచ్చరించారు.

జిల్లాలో సగటు వర్షపాతం 3.4 మిమీ

జిల్లాలో ఆదివారం సగటు వర్షపాతం 3.4 మి.మీగా నమోదైంది. అత్యధికంగా కందుకూరు, లింగసముద్రంలలో 5.2 మిమీ వర్షం పడగా, అత్యల్పంగా దగదర్తిలో 2.5 మి.మీ వర్షం కురిసింది.

ఊరటనిచ్చిన 'పునాస'

- ఉలవపాడు నుంచి కేరళకు ఎగుమతి
- బంగినపల్లి సాగుతో నష్టాలు.. పునాసతో ఊరట
- వర్షసూచనతో వణుకుతున్న రైతు
- మంగుమచ్చతో ధర తగ్గుతుందని ఆందోళన



ఉలవపాడు, సెప్టెంబరు 1: ఈ ఏడాది బంగినపల్లి మామిడి సీజన్‌లో నష్టాలు చవిచూసిన రైతులకు పునాస మామిడి ఊటరనిస్తోంది. ఏడాదికి రెండు కాపులు కాసే పునాస మామిడి తొలిపంట సీజన్ జూలై నుంచే మొదలవు తుంది. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కాపు దిగుబడి వస్తుంది. తొలినాళ్లలో రేటు ఆశించినంత ఉండకపోయినా, దిగుబడిలో కాయ నాణ్యతను బట్టి, డిమాండ్‌ను బట్టి రేటు పెరుగుతోంది. ఇందులో భాగంగానే ప్రస్తుతం కిలో ధర రూ. 60 నుంచి రూ. 65 వరకు పలుకుతోంది. గత 20 రోజుల నుంచి ఉలవపాడ కేంద్రంగా రోజుకి సగటున 50 టన్నుల వరకు పునాస మామిడి ఎగుమతులు జరుగుతున్నాయి.

90శాతం ఎగుమతులు కేరళకు..

కాగా పునాస మామిడిపై కేరళ రాష్ట్ర ప్రజలకు ఎంతో మక్కువ. దీంతో పునాస సీజన్‌కు ఆ రాష్ట్రం నుంచి వ్యాపారులు వచ్చి ఉలవపాడులో రెండునెలలపాటు మకాం వేస్తారు. టన్నుల కొద్దీ కొనుగోలు చేసి తమ రాష్ట్రానికి ఎగుమతులు చేస్తుంటారు. ఓనం పండుగ సమయానికి కేరళలో పునాసకు మంచి డిమాండ్ ఉంటుంది. దీంతో రైతులు ఐదారు ఏళ్లుగా మంచి లాభాలు చూస్తున్నారు. ఏప్రిల్, మే నెలలో సాధారణంగా పంటకు వచ్చే బంగినపల్లి, ఇతర రకాల మామిడి సాగులో ఈ ఏడాది చాలామటుకు రైతులు నష్టాలు చవిచూశారు. నష్టపోయిన రైతులు పునాస సాగులో లాభాలు గడించారు.

వర్షాలతో రైతుల ఆందోళన

శుక్రవారం నుంచి కురుస్తున్న వర్షంతో వెనకచిక్కి వస్తున్న పునాస మామి డి, మంగుమచ్చ లతో నాణ్యత దెబ్బతిని రేటు పడిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నా రు. అంతేకాక రెండోదశ కాపునకు పూతలు కూడా వస్తున్నాయి. వర్షంతో పూతలు పూర్తిగా దెబ్బ తింటాయని, పూతలు నిలబడాలని ఇప్పటికే రూ. వేలు ఖర్చుపెట్టి పురుగు మందులు పిచికారీ చేసిన రైతులు నష్టపోతామని అంటున్నారు.

అభివృద్ధి పేరుతో అటవీ ప్రాంతాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగింత

- అంతరిస్తున్న ఆదివాసీల మనుగడ
- హక్కుల వేదిక రాష్ట్ర కన్వీనర్ చిలుకా చంద్రశేఖర్

నెల్లూరు (సాంస్కృతికం) సెప్టెంబరు 1: దేశంలోని అటవీ ప్రాంతాన్ని అభివృద్ధి పేరుతో కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వాలు కట్టబెడుతున్నా యని, దీంతో అడవులను నమ్ముకున్న ఆదివాసీల జీవనం మను గడ అంతరించి పోతున్నదని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక రాష్ట్ర కన్వీనర్ చిలుకా చంద్రశేఖర్ అన్నారు. నెల్లూరు నగరంలోని పుర మందిరంలో ఆదివారం ఆదివాసీల దక్షిణాంధ్ర ప్రాంతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కొన్ని ప్రాంతాల్లో జరుగుతున్న పర్యావరణ విధ్వంసంపై ప్రశ్నించిన ఆదీవాసీ నాయకులను, ప్రభుత్వం తీవ్రవాదుల పేరుతో చంపేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఛత్తీస్‌ఘడ్ ప్రాంతంలో ఆదివా సీలపై ప్రభుత్వాలు కక్ష కట్టి సైనికచర్య ద్వారా 192 మంది చంపడమేకాక, వేలాదిమందిని అక్రమంగా అరెస్టులు చేశారన్నారు. ఆదివాసీ మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అడవుల్లోని ఆదివాసీలు కూడా భారతీయులేనని, వారి హక్కులను పరిరక్షించేందుకు మేధావులంతా కలిసి రావాలని కోరారు. ఆదివాసీ హక్కుల పోరాట వేదిక కో-కన్వీనర్ జే బాబు మాట్లాడుతూ అడవులపై జరుగుతున్న విధ్వంసాన్ని ఆపకపోతే పర్యావరణం దెబ్బతిం టుందన్నారు. ఈ సందర్భంగా పురమందిరం నుంచి గాంధీబొమ్మ వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ సదస్సులో ప్రజా కళామండలి కళాకారులు సందేశాత్మక గీతాలు ఆలపించారు. సభలో మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, ఆదివాసీ సంఘం నాయకులు సిద్ధార్థ, దొరబాబు, పలు ప్రజాతంత్ర సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న చిలుకా చంద్రశేఖర్

- పుట్టి ధాన్యానికి రూ.4 వేల తగ్గింపు
- ఓ వైపు చిరుజల్లులు.. మరోవైపు తుఫాన్ భయం
- ఆందోళనలో అన్నదాతలు

దిగజారిన ధరతో రైతు దిగాలు


కాగులపాడు రోడ్డులో లారీకి లోడ్ చేస్తున్న ధాన్యం

బుచ్చిరెడ్డిపాళెం,సెప్టెంబరు1: జిల్లాలో సుమారు 40వేల ఎకరాల్లో రెండో పంట కింద రైతులు వరిసాగు చేశారు. అయితే ఐదురోజులుగా ధాన్యానికి ధర తగ్గుతూ వస్తున్నది. ఆదివారం పుట్టికి రూ. 4,500 నుంచి 4000 వరకు దిగజారింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తీరా వరికోతలు సమ యంలో ఓ వైపు చిరుజల్లులు, మరో వైపు తుఫాన్ హెచ్చరికలు రైతులను భయాందోళనకు గురిచేశాయి. వరికోతలు ప్రారంభమై నిండా 10రోజులుకూడా కాలేదు. మిల్లర్లు, దళారులు మిలాఖత్ అయి పుట్టి రూ. 21వేలతో ప్రారంభమైన ధాన్యం ధరను శనివారానికి రూ. 17వేల నుంచి రూ. 16,500లకు దిగజార్చారని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి స్పందించి పడిపోయిన ధాన్యం ధరలను పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

కోసినా, కోయకపోయినా సమస్యే

వరి కోయాలంటే ధాన్యానికి గిట్టుబాటు ధర లేదనే బాధ ఓ వైపు, కోయకుంటే తుఫాన్ ముప్పు ఉందనే భయం మరోవైపు వేధిస్తున్నది. మిల్లర్లు, దళారులు చూస్తే ధర తగ్గించి అడుగుతున్నారు. ఏమీ చేయలేక రోడ్డుపై ధాన్యం పోసుకుని దిక్కుతోచని స్థితిలో ఉన్నాం. కాగా రెండురోజులుగా ఈదురుగాలులు, వర్షానికి కొన్ని ప్రాంతాల్లో వరిపైరు నేలవాలింది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలి.

- ముంగర మల్లయ్య, కౌలురైతు, జొన్నవాడ

అభివృద్ధి పనులపై ఇంత నిర్లక్ష్యమా ?

- సోమశిల ఇంజనీర్లు, కాంట్రాక్టరుపై మంత్రి ఆనం మండిపాటు
- సీఎంవోకు తెలిపి చర్యలు తీసుకుంటామని హెచ్చరిక
- అల్పపీడనంపై అధికార యంత్రాంగం అప్రమత్తం
- దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి


అనంతసాగరం, సెప్టెంబరు 1: సోమశిల జలాశయం ముందు జరుగుతున్న అప్రాన్ పనులు చూసి దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి విస్తుపోయారు. పనుల్లో పురోగతి లేకపోవడంపై ఇంత నిర్లక్ష్యమేమిటని ఇంజనీరింగ్ అధికారులపై మండిపడ్డారు. సోమశిల ప్రాజెక్టును ఆదివారం ఆయన సందర్శించారు. తొలుత అతిథిగృహంలో జలవనరులశాఖ ఇంజనీర్లతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ప్రాజెక్టు ముందు జరుగుతున్న అప్రాన్ పనులను పరిశీలించారు. పనుల్లో పురోగతి లేకపోవడంపై ఎస్ఈలు వెంకటరమణారెడ్డి, రమణారెడ్డి, ఈఈ దశరథరామిరెడ్డిని గట్టిగా ప్రశ్నించారు. అనంతరం మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం పనులను నిర్లక్ష్యం చేసిందని, చేసిన పనులకు కూడా బిల్లులు ఇవ్వలేదన్నారు. ఈక్రమంలో సోమశిల దుస్థితిని సీఎం చంద్రబాబుకు వివరించగా, ఆయన స్పందించి సోమశిలను పరిశీలించి, త్వరగా పనులు పూర్తిచేయాలని ఆదేశాలు ఇచ్చారని గుర్తుచేశారు. అయితే కాంట్రాక్టరు మాత్రం ఈపనులను నత్తనడకన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 45 రోజుల ముందు పనులు ప్రారంభించగా, నేటికి 45 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు చేయాల్సి ఉండగా, రెండు వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు కూడా పూర్తిచేయలేదని పేర్కొన్నారు. ఇంజనీర్లను ప్రశ్నిస్తే కాంట్రాక్టరు పోకడలు చూశాకా తాము బాధ్యత తీసుకోలేమని చెబుతున్నారని ఆనం తెలిపారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న తరుణంలో సోమశిలకు భారీ వరదలు వచ్చే సూచనలు ఉన్నాయని, ఈ విపత్కర పరిస్థితిని అధిగమించాలంటే పనులు త్వరగా పూర్తి చేయాల్సి ఉందన్నారు. అత్యవసరంగా కాలువ ప్రొటెక్షన్ వాల్ పనులు చేయాల్సి ఉండగా, ఇంతవరకు చేయలేదన్నారు. జిల్లా రైతాంగాన్ని, ప్రాజెక్టును కాపాడుకోవాలన్నది తమ అభిమతమని, పనుల నిర్లక్ష్యంపై సీఎంవో, ఇరిగేషన్ మంత్రి కార్యాలయానికి సమాచారం ఇచ్చి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి ఆనం స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో మధులత, టీడీపీ నాయకులు గిరినాయుడు, మెట్టుకూరు కృష్ణారెడ్డి, ఎం. జనార్దన్‌రెడ్డి, రాపూరు సుజాతమ్మ, శాకమూరి సుబ్బారావు రాపూరు సుబ్బారెడ్డి, మనోజ్‌రెడ్డి, చల్లా శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అప్రాన్ పనుల నిర్లక్ష్యంపై ఇంజనీర్లను ప్రశ్నిస్తున్న మంత్రి ఆనం

అల్పపీడనంపై యంత్రాంగం అప్రమత్తం

భారీ వర్షాలకు ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. కురుస్తున్న వర్షాలపై ఎమ్మెల్యేలు, మంత్రులతోపాటు అధికారులను సీఎం చంద్రబాబు అప్రమత్తం చేశారని, మూడు రోజుల నుంచి సీఎం నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా అన్నీ జాగ్రత్త చర్యలు తీసుకొంటున్నట్లు వివరించారు. రాష్ట్రంలో ఉన్న అన్నీ ప్రాజెక్టులకు వచ్చే వరద తీరుపై సీఎం అంచనా వేస్తూ ఇంజనీర్లకు సూచనలు చేస్తున్నారని చెప్పారు. ద్రోణి ప్రభావం తగ్గే వరకు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి కోరారు.

సోమశిలకు పెరిగిన వరద ప్రవాహం


సోమశిలకు చేరుతున్న వరద నీరు

సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం పెరుగుతోంది. ఆదివారం 20,075 క్యూసెక్కుల వస్తుండగా 37.072 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. కృష్ణాజలాలతోపాటు బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో కడప, కర్నూలు జిల్లాల్లో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో సోమశిలకు వచ్చే ప్రవాహంలో మార్పు కనిపి స్తున్నది. సోమవారం సాయంత్రానికి వరద మరింత పెరగవచ్చని ఇంజనీర్లు అంచనా వేస్తున్నారు. ఉపనదులు కందు, సగిలేరు నుంచి పెన్నాకు వరద నీరు చేరుతున్నది.

అసంపూర్తి నిర్మాణాలు

- ఉదయగిరిలో సచివాలయ, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు
- ఇరుకు, శిథిలావస్థ గదుల్లో సిబ్బంది అగచాట్లు
- పట్టించుకోని అధికారులు



ఉదయగిరి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో అసంపూర్తిగా ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం



ప్రారంభానికి నోచుకోని సచివాలయ భవన నిర్మాణం

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 1: నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు గత వైసీపీ ప్రభుత్వం 95సచివాలయాలు, 85విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు మంజూరు చేసింది. అందులో సుమారు 40భవనాలు అసంపూర్తి నిర్మాణంతో మిగిలిపోయాయి. ఉదయగిరి మండలంలో నేలటూరు, వెంగళరావునగర్, ఉదయగిరి పట్టణంలో సచివాలయాలు, విలేజ్‌హెల్త్ క్లినిక్ భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. దుత్తలూరు మండలంలో నర్రవాడ, నందిపాడు, సీతారామపురం మండలం బాలాయపల్లి, వరికుంటపాడు మండలంలో పది భవనాలకుగాను ఐదు భవనాలు, కొండాపురం మండలంలో పది భవనాలల్లో రెండు, జలదంకి మండలంలో 11భవనాలకు గాను రెండు భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. ఏళ్ల తరబడి భవన నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో పరాయి పంచన సేవలందించేందుకు ఉద్యోగులు తంటాలు పడుతున్నారు. భవనాలు ఫర్నిచర్, సామగ్రి, మందులు నిల్వ చేసుకునేందుకు వీలు కావడం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనాలు నిర్మాణాలను పూర్తి చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు.

● త్వరలో పూర్తి చేయిస్తాం: శ్రీనివాసరాజు

అసంపూర్తిగా ఉన్న సచివాలయ, విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలను త్వరలో పూర్తి చేయిస్తాం. గుత్తేదారులకు బిల్లులు సైతం పెండింగ్‌లో ఉన్నాయి. నిధులు రాగానే పూర్తి చేయించి భవనాలను అందుబాటులోకి తీసుకొస్తాం.

- పీఆర్ ఏఈ, ఉదయగిరి

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

చెరువుల ఆక్రమణ!

● ఆయకట్టు రైతుల అవస్థలు, ● పట్టించుకోని అధికారులు

బిట్రగుంట, సెప్టెంబరు 1: బోగోలు మండలంలోని 26 చెరువుల్లో పలు చెరువులు ఆక్రమణలతో కుంచించుకుపోతున్నాయి. దీంతో ఆయకట్టు రైతులకు సాగు నీరందక అవస్థలు పడుతున్నారు. ఓ వైపు చెరువుల ఆక్రమణలతో విస్తీర్ణం తగ్గిపోతుంటే, మరోవైపు వర్షాలకు కొట్టుకువచ్చిన మట్టితో చెరువులు పూడిపోతున్నాయి. చెరువుకట్టల లోపల ఆక్రమదారులు గ్రావెల్ తవ్వకాలు జరుపుతూ లోతైన గోతులు చేస్తున్నారు.



పంట పొలాలుగా మారిన అక్కిలిగుంట చెరువు



ఆక్రమణలకు గురైన తెల్లగుంట తాగేటి చెరువు

దీంతో చెరువులోకి వర్షపు నీరు గోతులోకి చేరుకుని ప్రమాదాలకు దారితీస్తున్నాయి. అల్లిమడుగులోని తాగేటి చెరువు దాదాపు ఆక్రమణలకు గురైంది. కడనూతల చెరువు ఆక్రమణలు కొంత, పూడుక పేరుకుపోయి మరికొంత విస్తీర్ణం తగ్గింది. బోగోలు చెరువు ఆక్రమణలకు గురికావడంతో కాలువ నీరు చెరువులోకి రావడం కష్టంగా మారింది. కోవూరుపల్లి చెరువును కొందరు ఆక్రమించుకుని లేఅవుట్ వేయగా అధికారులు ఇటీవల తొలగించారు. వర్షాలు కురుసేలోపు అధికారులు యుద్ధప్రాతిపదికన ఆక్రమణలు తొలగిస్తే రైతులకు న్యాయం జరుగుతుంది.

అనైతికతకు దూరంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న అసియా

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 1: ఇతరుల హక్కులకు భంగం కలుగకుండా నీతి, నియమాలు పాటిస్తూ అనైతికతకు దూరంగా ఉండాలని జమాతే ఇస్లాం హింద్ మహిళా విభాగం ఉదయగిరి అధ్యక్షురాలు అసియా సూచించారు. ఆదివారం స్థానిక దిలావర్‌భాయ్‌వీధిలోని మదర్సాలో నైతికతే నిజమైన స్వేచ్ఛ అనే కార్యక్రమంపై అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ నెల 30వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మద్యం, మాదకద్రవ్యాల బానిసత్వం నుంచి, అశ్లీల, అసభ్యతతో ఉన్న వైబ్‌సైట్‌ల నుంచి యువతను బయటకు తీసుకురావడమే ప్రధాన లక్ష్యమన్నారు. పాశ్చాత్య సంస్కృతుల నుంచి మన యువతను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతిఒక్కరికీ ఈ సందేశం అందేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సభ్యులు అల్‌సానియా, అమీరా, మహమ్మదీ, పర్వీన్, సాదియా, రిహానా పాల్గొన్నారు.

చెత్తాచెదారం తొలగింపు



తొట్టెలో పేరుకపోయిన చెత్తను తొలగిస్తున్న టీడీపీ నాయకులు

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 1: పట్టణ ప్రజల దాహార్తిని తీర్చే కోనకాలువ, తొట్టె ప్రాంతంలో పేరుకపోయిన చెత్తాచెదారాన్ని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సూచన మేరకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి ఆదివారం నాయకులతో కలిసి శ్రమదానం నిర్వహించారు. తొట్టిలో పేరుకుపోయిన వ్యర్థ పదార్థాలను తొలగించి బ్లీచింగ్ చల్లించారు. అనంతరం కాలువ వెంట నీటి సరఫరాకు అడ్డంకిగా మారిన ఆకులు, చెత్తను తొలగించారు. కార్యక్రమంలో గూడూరు వెంకటేశ్వరరావు, రంతుజానీ, బాబు, మాబాషా, మట్ల రామయ్య, లక్ష్మయ్య, అర్షద్ పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



ఇంట్లోనే కుటుంబసభ్యులతో నిరసన వ్యక్తం చేస్తున్న సుబ్బారెడ్డి

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 1: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని యూటీఎఫ్ నాయకులు గాజుల సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానాన్ని అమలు చేసి 20ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి తమ నివాసంలో ప్లకార్డులు చేతపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లు ఎమ్మెల్యే, ఎంపీలుగా పదవులు నిర్వహించే వారికి పెన్షన్ ఇవ్వడం, 35ఏళ్లు ఉద్యోగం చేస్తే వారికి పెన్షన్ లేకపోవడం దారుణమన్నారు. సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్ తమకు వద్దని, ఓపీఎస్ ముద్దన్నారు. మా నాన్నకు పెన్షన్ లేకుంటే.. నా జీవిత మంతా టెన్షన్... మా నాన్నకు పాత పెన్షన్.. నా భవిష్యత్తుకు నో టెన్షన్ అంటూ పిల్లలు ప్లేకార్డులు ప్రదర్శించారు.

మొక్కలు నాటిన నాయకులు

సీతారామపురం, సెప్టెంబరు 1: ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వారోత్సవాల్లో భాగంగా జనసేన నాయకులు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బోగినేని కాశీరావు ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో క్లీన్ ఆంధ్ర- గ్రీన్ ఆంధ్ర ఇనిషియేటివ్ కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా తహసీల్దార్, ఎంఈవో, ఎంపీడీవో, సచివాలయం కార్యాలయాల ఆవరణలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కప్పా ప్రభాకర్ రాజు, పిడుగు రమేష్, వెంగళశెట్టి వెంటయ్య, వెంకటేశ్వర్లు, చేన్నకేశవులు, తమ్మిశెట్టి వెంకటసుబ్బమ్మ, సర్పంచ్ భాగ్యకుమారి పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న నాయకులు

కృష్ణాపురంలో ఆసుపత్రి నిర్మాణానికి భూమి పూజ



మర్రిపాడు: శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి ఆనం, ఎంపీ వీపీఆర్

మర్రిపాడు, సెప్టెంబరు 1: కృష్ణాపురంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నిర్మాణానికి ఆదివారం రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి భూమి పూజ చేసి, శిలఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. వైద్యాధికారులు 24గంటలు అందుబాటులో ఉండేందుకు వారికి క్వార్టర్స్ నిర్మిస్తామని, అందుకు పక్కనే మరో ఎకరా భూమిని కేటాయించాలని ఆర్డీవోను ఆదేశించారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. మేకపాటి కుటుంబం సుదీర్ఘకాలంగా రాజకీయంలో ఉండి పదవులు అనుభవిస్తూ సొంత మండలాన్ని అభివృద్ధి చేయలేదని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో సోమశిల హైలెవెల్ కెనాల్ పనులు 60శాతం పూర్తి చేశామని చెప్పిన మీరు ఒక్క ఎకరాకైనా నీరు ఇచ్చారా? అని ప్రశ్నించారు. ఎంపీ వేమిరెడ్డి సహకారంతో హైలెవెల్ కెనాల్ పనులు పూర్తి చేస్తామన్న మాటను నిలబెట్టుకుంటామన్నారు. మండల ప్రజలు బెంగుళూరు, చెన్నైలకు వలస వెళ్లి జీవిస్తుంటే మీ రేమో ఇతర దేశాల్లో కాంట్రాక్టు పనులు చేసుకుంటున్నారని విమర్శించారు. అనంతరం ఎంపీ వేమిరెడ్డి మాట్లాడారు. వైసీపీ పాలకులు రూ.60వేల కోట్ల మందులను వివిధ కంపెనీల వద్ద కొనుగోలు చేసి అప్పు చేసినట్లు కంపెనీల నిర్వాహకులు ఇటీవల సీఎం చంద్రబాబునాయుడి దృష్టికి తీసుకెళితే వారికి రూ.500కోట్లను విడుదల చేసినట్లు గుర్తుచేశారు. అనంతరం బ్రాహ్మణపల్లి ఎస్సీ, బీసీ కాలనీల్లో వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేసిన మంచినీటి ప్లాం ట్లను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విజయరామిరెడ్డి, తాళ్లూరి గిరినాయుడు, పుట్టం బ్రహ్మరెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు ఆరికట్ల జనార్దన్‌నాయుడు పాల్గొన్నారు.

సమాచారం సరిచేయరూ.. !



బదిలీ అధికారుల పేర్లతో ఉన్న సమాచారం

వరికుంటపాడు, సెప్టెంబరు 1: స్థానిక వెలుగు కార్యాలయంలో సమాచార హక్కు చట్టానికి సంబంధించి ఏర్పాటు చేసిన సమాచార బోర్డులో వివరాలు తప్పులమయంగా ఉండటం అక్కడి అధికారుల పనితీరుకు నిదర్శంగా మారుతోంది. గతంలో ఉన్న అధికారులు బదిలీపై వెళ్లి నెలలు గడుస్తున్నా నేటికీ ఆ బోర్డులో అప్పటి అధికారుల పేర్లు, ఫోన్లు నంబర్లే దర్శనమిస్తుండడం గమనార్హం. దీంతో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ప్రజలు విషయం తెలియక ఆ బోర్డులో పేర్లు ఉన్న బదిలీ అధికారులకే ఫోన్లు చేసి విసుగెత్తిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమాచార బోర్డును సరి చేసి సమగ్ర సమాచారం నమోదు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తాగునీటి కోసం తప్పని తిప్పలు



నిరుపయోగంగా ఉన్న వాటర్ కూలర్

వరికుంటపాడు, సెప్టెంబరు 1: స్థానిక వెలుగు కార్యాలయానికి పనులపై వెళ్లిన ప్రజలకు తాగునీటి తిప్పలు తప్పడం లేదు. నిత్యం ఉద్యోగులు, పొదుపు సంఘాల మహిళలు, ప్రజలతో రద్దీగా ఉండే ఆ కార్యాలయంలో దాహం తీర్చుకు నేందుకు పడరాని పాట్లు పడాల్సి వస్తున్నది. దాతలు అందించిన వాటర్ కూలర్ నెలల తరబడి మరమ్మతులకు గురై నిరుపయోగంగా మారింది. దీంతో చేసేదేమిలేక ఉద్యోగులతో సహా అటుగా వెళ్లిన ప్రతి ఒక్కరూ దప్పిక తీర్చుకునేందుకు సమీపంలోని మండల పరిషత్ కార్యాలయానికి పరుగులు తీస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్యాలయంలో తాగునీటి వసతి ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నిబంధనలు మరచి బొగ్గు బట్టీల నిర్వహణ

● అనుమతి పొందిన చోట కాకుండా అనువైన ప్రాంతంలో నిర్వహణ



బట్టీల వద్ద రవాణాకు సిద్ధంగా ఉన్న బొగ్గు

మర్రిపాడు, సెప్టెంబరు 1: మండలంలోని శెట్టిసముద్రం, చిలకపాడు, చిన్నమాచునూరు సమీపంలో బొగ్గు బట్టీల నిర్వాహకులు నిబంధనలను లెక్క చేయకుండా ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నారు. ఒకటి.. రెండు బట్టీల నిర్వహణ పేరుతో గోరంత అనుమతులు పొంది కొండంత వ్యాపారం సాగిస్తున్నారు. అడవులను సైతం లెక్క చేయకుండా, పచ్చని చెట్లను నరుకుతూ బొగ్గు బట్టీలకు తరలిస్తున్నారు. ఒక్కో ప్రదేశంలో 5నుంచి 8బట్టీల వరకు అమర్చి, అనుమతి పొందిన పొలంలో కాకుండా అక్రమార్కులకు అనువైన స్థావరంలో నిర్వహిస్తూ లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. ఎవరైనా ఆరాతీస్తే తమకు అన్నీ అనుమతులు ఉన్నాయంటూ బుకాయిస్తున్నారు. అడవి కర్ర వంటివి బట్టీల వద్ద ఉందని అధికారులకు ఎవరైనా ఫిర్యాదులు చేస్తే 2వేలు, రూ.మూడు వేలు చలానాలు కట్టించుకొని అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. పొగాకు సీజన్ ప్రారంభమైతే పొగాకు క్యూరింగ్ చేసుకునేందుకు ఎలాంటి కర్ర దొరక్క రైతులు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. దొరికిన చోట కొనాలంటే టన్ను ధర ఆకాశాన్ని అంటుతోంది. బొగ్గు బట్టీల నిర్వహణతో రైతులకు సైతం కర్ర దొరకటం లేదు. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ కొరవడటం వలనే ఈ తతంగం జరుగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు అనుమతులు ఇస్తుండటం ఒక ఎత్తైతే, బొగ్గు సామర్థ్యాన్ని సైతం తక్కువ చూపి చలానాల రూపంలో ప్రభుత్వానికి అందాల్సిన ఆదాయానికి తూట్లు పొడుస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

చేతిపంపు ఎత్తు పెంచండి



నిరుపయోగంగా చేతిపంపు

వరికుంటపాడు, సెప్టెంబరు 1: తూర్పుబో యమడగల గ్రామంలోని ప్రధానవీధిలోని చేతిపంపు నిరుపయోగంగా ఉంది. నీరు రాక నిరుయోగంగా లేదండోయ్.. తాగునీరు వస్తున్నా నివాసాలు, రోడ్డు ఎత్తు పెరగ డంతో చేతిపంపు సగానికి పైగా పూడుకపోయింది. ఈ సమస్యతో చేతిపంపును స్థానికులు వాడుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి చేతి పంపు ఎత్తును పెంచి వాడుకలోకి తీసుకొస్తే స్థానికులకు ఇతర అవసరాలకు ఉపయోగపడుతుందని స్థానికులు చెబుతున్నారు.

కావలిని కనకపట్నం చేయడమే లక్ష్యం

● ప్రజల రక్తం తాగిన జలగ ప్రతాప్‌కుమార్‌రెడ్డి ● తుమ్మలపెంట పాదయాత్ర విజయవంతం ● ఎమ్మెల్యే వెంకట క్రిష్ణారెడ్డి





తుమ్మలపెంటరోడ్డు శంకుస్థాపనకు హాజరైన ప్రజలు, మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి/కావలి రూరల్, సెప్టెంబరు 1: మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి నియంతృత్వంతో గత ఐదేళ్లల్లో కరప్షన్‌కు కేరాఫ్‌గా మారిన కావలిని తిరిగి కనకపట్నంగా మార్చడమే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి స్పష్టం చేశారు. వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురై ప్రజల రాకపోకలకు తీవ్ర ఆటంకంగా మారిన తుమ్మలపెంట రహదారి నిర్మాణానికి ఆదివారం చేపట్టి శంకుస్థాపన కార్యక్రమంలో భాగంగా కావలి నుంచి చేపట్టిన పాదయాత్ర విజయవంతం అయింది. ఈ పాదయాత్ర ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సుమారు 5 వేల మందితో కావలి పట్టణం తుమ్మలపెంటరోడ్డులోని భారత్ గ్యాస్ వద్ద నుంచి తుమ్మలపెంట వరకు 9.కిలో మీటర్లు సాగింది. రూ.14.76 కోట్లతో నిర్మించనున్న రోడ్డుకు రూరల్ మండల మహిళలచే శంకుస్థాపన చేయించిన ఎమ్మెల్యే ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలనపోయి రామ రాజ్యం వచ్చిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి ప్రదాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మొట్టమొదట 1995 సెప్టెంబరు 1న హైదరాబాద్‌లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజునే తుమ్మలపెంట రోడ్డుకు మోక్షం కల్పిస్తూ శంకుస్థాపన చేశామన్నారు. ఎన్నికల్లో మాట ప్రకారం దశాబ్దాల కాలం నుంచి నిర్లక్ష్యానికి అంతిమ యాత్ర నిర్వహించి రోడ్డు పనులు ప్రారంభించామ న్నారు. 2018లో నారా లోకేష్ తుమ్మలపెంటకు వచ్చినప్పుడే ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారన్నారు. అయితే 2019లో వైసీపీ అధికారం లోకి రావడంతో రాక్షసుడైన అప్పటి ముఖ్యమంత్రి జగన్ పాలనలో అప్పటి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి కమిషన్ల కోసం కాంట్రాక్టర్‌ను బెదిరించడంతో రోడ్డు నిర్మాణం ఆగిపోయిం దన్నారు. కావలికి ఓ పక్కన రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, మరో పక్కన ఎయిర్ పోర్టుతో పాటు 5700 ఎకరాల్లో ఇండస్ట్రీయల్ హబ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆవుల రామక్రిష్ణ, ప్రధాన కార్యదర్శి వెంకట్రావ్, పాలడుగు రంగారావు, నాయుడు రాంప్రసాద్, పాలడుగు రంగారావు, మలిశెట్టి వెంకటేశ్వర్లు, పమిడి రవికుమార్ చౌదరి, పోతుగంటి అలేఖ్య, రాజ్‌కుమార్ చౌదరి, గుత్తికొండ కిషోర్, బొట్లగుంట శ్రీహరినాయుడు, కొండూరు పాలిశెట్టి, జనసేన నాయకుడు అళహరి సుధాకర్, బీజేపీ నాయకుడు కుట్టుబోయిన బ్రహ్మానందం, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి

● ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు నిరసన



నిరసన తెలుపుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు

కందుకూరు, సెప్టెంబరు 1: కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని(సీపీఎస్) రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బహుజన టీచర్స్ అసోసియేషన్, సీపీఎస్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీటీఏ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కళ్లగుంట మోహనరావు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల పట్ల సీపీఎస్ ఒక భూతంలా ఉందని, 30 ఏళ్లు ఉద్యోగం చేశాక పెన్షన్ తీసుకునే పరిస్థితి లేకపోవడం చాలా దుర్మార్గమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు షేక్ అబ్దుల్లా, సంగా మహేంద్ర, ధన్నాసి కోటేశ్వరరావు, అశోక్‌కుమార్, కోటయ్య, అంజయ్య, వలేటి మాలకొండయ్య, మద్ది రంగారావు, బత్తుల కేశవ, శ్రీనివాసులు, కొచ్చర్ల వెంకటేశ్వర్లు, కేవై కోటయ్య పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో...



సీపీఎస్‌కు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కావలిటౌన్ : సీపీఎస్ రద్దు చేయాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆదివారం తహసీల్దార్ల కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉద్యోగుల జీవితాలకు సీపీఎస్ గొడ్డలిపెట్టని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టాలనుకుంటున్న యుపీఎస్‌ను కూడా ఉపసంహరించుకోవాలని వెంటనే ఓపీఎస్‌ను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ అధికార పత్రిక ఉపాధ్యాయ సంపాదక వర్గ సభ్యుడు గురునాథశర్మ, రాష్ట్ర కౌన్సిలర్ గొబ్బిళ్ల కృష్ణయ్య, నేతలు కటారి నరసింహారావు, రామారావు, రఘునాథరెడ్డి, బూచి మధుసూదన్‌రావు, సంజీవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అన్నదాన కార్యక్రమం

లింగసముద్రం, సెప్టెంబరు 1 : ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ జన్మదినం సందర్భంగా లింగసముద్రం పంచాయతీలోని బలిజపాలెంలో సోమవారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జనసేన పార్టీ మండల అధ్యక్షుడు అంగులూరి నరసింహారావు ఆదివారం ఓ ప్రకటనలో చెప్పారు.

ఎస్‌ఐకి టీడీపీ నేతల సన్మానం



ఎస్‌ఐ సుభానీని సన్మానిస్తున్న టీడీపీ నేతలు

లింగసముద్రం, సెప్టెంబరు 1 : లింగసముద్రం ఎస్సై షేక్ మహమ్మద్ సుభానీని టీడీపీ మండల అధ్యక్షుడు వేముల గోపాలరావు, పెదపవని గ్రామ పార్టీ అధ్యక్షుడు గొర్రెపాటి సాంబయ్య, పలువురు టీడీపీ నేతలు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్చాలు ఇచ్చి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎన్ నారాయణ, ఎం సుధాకర్, కె సుబ్బులునాయుడు, మాజీ ఎంపీటీసీ ఎస్ కొండరావు, కంచర్ల రవీంద్ర, షేక్ రఫీ, షేక్ కరీముల్లా, బి సిద్ధయ్య, జనసేన నేత కె దినేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

'నైతికతే నిజమైన స్వేచ్ఛ' ఉద్యమానికి శ్రీకారం



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న జమాతే ఇస్లామి హింద్ సంస్థ మహిళలు

కావలి, సెప్టెంబరు 1: సమాజంలో జరిగే అనైతిక, అసాంఘిక, అశ్లీల అరాచక, అశాంతి పనులకు వ్యతిరేకంగా నైతికతే నిజమైన స్వేచ్ఛ అనే నినాదంతో జమాతే ఇస్లామీ హింద్ కావలి శాఖ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడుతున్నట్లు ఆ సంస్థ మహిళలు తెలిపారు. స్థానిక జర్నలిస్ట్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో జమాతే ఇస్లాం హింద్ కావలి శాఖ కన్వీనర్ ఫాతిమామహ్మద్ సంస్థ సభ్యులతో కలిసి గోడపత్రిక ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అరాచకాలను వ్యతిరేకిస్తూ ఉద్యమం చేపడుతున్నట్లు తెలిపారు. వీటిపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ గోడపత్రికలు అంటిస్తూ, కరపత్రాలు పంపిణీ చేస్తూ ఇంటింటా కార్యక్రమాన్ని సెప్టెంబరు 1నుంచి 30 వరకు కొనసాగించనున్నట్లు చెప్పారు. ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు తమ సంస్థ ద్వారా చేసే ఈ కార్యక్రమానికి మహిళామణులు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో సంస్థ సభ్యులు బుష్ర, నూర్జహాన్, షాహినా, హబీబా, ఇస్మత్, సమయ, షకీలా తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు నిధుల మంజూరుపై హర్షం

కొండాపురం, సెప్టెంబరు 1: ఉదయగిరిలోని డిగ్రీ కళాశాల అభివృద్ధికి నిధులు మంజూరు హర్షించదగ్గ విషయమని బీజేపీ మండల అధ్యక్షుడు మాలేపాటి మల్లికార్జున పేర్కొన్నారు. ఈ కళాశాల అభివృద్ధి కొరకు నిధులు కేటాయించాలంటూ గతేడాది మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓరుగంటి మాధవరావులు కేంద్ర మానవ వనరులమంత్రికి వినతిపత్రం అందజేశారని పేర్కొన్నారు. దీనికి స్పందించిన కేంద్రప్రభుత్వం రూ.5 కోట్లు నిధులు కేటాయించిందని పేర్కొన్నారు.

పవన్ కళ్యాణ్ అభిమానుల రక్తదానం



రక్తదానం చేస్తున్న అభిమానులు

జలదంకి, సెప్టెంబరు 1: మండలంలోని అన్నవరంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా జనసేన ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 50 మంది యువకులు రక్తదానం చేశారు. కేక్‌కట్ చేసి పలువురికి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు చక్రాల సురేష్, సిద్ధు, పి.రామక్రిష్ణారెడ్డి, పత్తి సుబ్బారావు, సమాల్‌బాషా, సల్మాన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఉలవపాడు, సెప్టెంబరు 1 : మండలంలోని కరేడు ర్యాంపు సమీపంలో జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై అంకమ్మ కథనం మేరకు.. గుర్తుతె లియని 40 ఏళ్ల వ్యక్తి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయ పడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి జేబులో జయరామయ్య విజలాపురం పేరుతో ఫోన్ నెంబ రు రాసిన కాగితం ఉండడంతో దాని ఆధారంగా మృతుడి వివరాలు సేకరిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉలవపాడు సామాజిక ఆరోగ్యం కేంద్రానికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ట్లు పోలీసులు తెలిపారు.

డీఎం చానల్‌లో పూడికతీత

బిట్రగుంట, సెప్టెంబరు 1: బోగోలు మండలంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎండి పోయిన కడనూతల, కోవూరుపల్లి చెరువులకు సోమశిల జలాలు విడుదల కోసం డీఎం చానల్ పూడికతీత పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. చెంచులక్ష్మీపురం సమీపంలో కాలువలో పెరిగిన తుంగ, ముళ్లచెట్లు తొలగిస్తున్నారు. ఇటీవల జరిగిన మండల సమావేశంలో ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి దృష్టికి ఈ విషయం తీసుకుపోవడంతో స్పందించిన ఎమ్మెల్యే యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభించినట్లు టీడీపీ మండల అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరావు తెలిపారు.



పూడిక తీస్తున్న ఎక్స్‌కవేటర్